సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 233

సోమవారం 14-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



ఇదీ ఇంగ్లండ్‌దే

12లో

వరల్డ్ కప్ ఫైనల్ ఈ సారి 'టై' కాలేదు... సూపర్ ఓవర్లు కూడా సమం కాలేదు..క్రీడా స్ఫూర్తిని ప్రశ్నించడానికి, సగం గెలుపంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేయడానికి ఇంగ్లండ్ జట్టు అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు అలాంటి చర్చే రాకుండా అద్భుత ఆటతో అందరికంటే శిఖరాన నిలిచింది. వాన పాలైన వేదికపైనే విశ్వవిజేతగా నిలిచింది.



రష్యాను పూర్తిగా తరిమేస్తాం

రష్యా సేనలను ఉక్రెయిన్ నుంచి పూర్తిగా తరిమేసి తీరతామని ఆ దేశ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు.


వివరాలు 6లో



రిపబ్లికన్లకు ఎదురు దెబ్బ

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు షాక్ తగిలింది. 3 స్థానాల్లో రెండింట్లో డెమొక్రాటిక్ అభ్యర్థులు గెలిచారు.

వివరాలు 6లో



ఉమ్మడి పోరే ఉత్తమం

ఉత్తర కొరియాను ఉమ్మడిగానే ఎదుర్కోవాలని జపాన్, దక్షిణ కొరియాకి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పిలుపునిచ్చారు.

వివరాలు 6లో



ముందు చూపుతోనే 'విశ్రాంతి'!


రిటైర్మెంట్ తర్వాత జీవితానికి ఎంత కావాలి? అందుకు ఎంత పెట్టుబడులు పెట్టాలనే అంశాలపై అవగాహన కల్పించే కథనం.

వివరాలు 13లో

రచ్చ కోసం ఇంటి బాట

31 లక్షల మంది పేదల సొంతింటి కల సాకారంతో దుష్ట చతుష్టయం గుండెలు గుభేల్

- ఇళ్లను అడ్డుకునే యత్నాలన్నీ విఫలం.. ఫలించని దుష్ప్రచారాలు
- తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమేనని నిర్ధారణకు రావడంతో కొత్త కుట్రలు
- కన్నీళ్లు తుడుస్తానంటూ తెరపైకి దత్తపుత్రుడు
- ఒక్క ఇల్లూ ఇవ్వకున్నా గత ప్రభుత్వ హయాంలో నోరెత్తని జనసేనాని
- మా కన్నీళ్లు నాడెందుకు కనపడలేదని అడుగడుగునా నిలదీస్తున్న పేదలు



సాక్షి, అమరావతి: పేదలు కోరుకునేది తినటానికి గుప్పెడు మెతుకులు, తలదాచుకోవటానికి ఓ గూడు! వీటిని సమకూర్చాల్సిన బాధ్యత ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలదే. మరి ప్రజాస్వామ్య యుతంగా దీన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ దేశంలోనే తొలిసారిగా 31 లక్షల మందికిపైగా పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి గృహాలను కూడా నిర్మించి ఇస్తున్న ప్రభుత్వంపై రాళ్లేస్తున్న వారిని ఏమనాలి? పేదల కన్నీళ్లు తుడుస్తామంటూ మొసలి కన్నీళ్లు కారుస్తూ బయల్దేరిన వారికి ఎలా బుద్ధి చెప్పాలి? టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 1996–2004, 2014–19 మధ్య సీఎంగా ఉన్నారు. ఆయన హయాంలో ఏనాడూ నిరుపేదలకు సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవు. పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేసిందీ లేదు. అయినాసరే ఈనాడు రామోజీ రావుకు అంతా 'పచ్చ'గానే కనిపించింది. గూడు లేక నిరుపేదలు పడుతున్న ఇక్కట్లు ఆయన కంటికి కానరాలేదు. వారి మొర వినపడలేదు. 2014లో వచ్చిన జనసేనానిది కూడా ఇదే వైఖరి. చంద్ర బాబుకు రాజకీయ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా వీరు పని చేస్తారు. ప్రజలకు ఎనలేని మేలు చేకూర్చే సంక్షేమ కార్యక్రమాలపైనా బురద జల్లేందుకు వెనుకాడరు. లక్షల మంది పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేస్తున్న 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం పట్ల ఈనాడు రామోజీ, ఇతర పచ్చమీడియా, దత్తపుత్రుడి వైఖరి చూస్తుంటే' ఇదే నిజమని మరోసారి రుజువవుతోంది.

రూ.మూడు లక్షల కోట్ల సంపద సృష్టి

రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల పథకం కింద 30.25 లక్షల మంది అక్క చెల్లెమ్మలకు విలువైన ప్రాంతాల్లో స్థలాలు పంపిణీ చేసింది. 71,811.49 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు పంపిణీకి రూ.56,102.91 కోట్లు ఖర్చు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు ద్వారా 17 వేల వైఎస్సార్, జగనన్న కాలనీల రూపంలో ఏకంగా

మిగతా 2వ పేజీలో ▶

గుంకలాంలో పారని పాచిక

- లబ్ధిదారులతో మాట్లాడకుండానే వెనుదిరిగిన పవన్
- రోడ్‌షోకే జనసేనాని పరిమితం
- ప్రభుత్వంపై తిరగబడాలని రెచ్చగొడుతూ ప్రసంగం
- ఓడిపోయిన వాణ్ణి, దెబ్బతిన్న వాణ్ణి, గాయపడ్డ పులిని అంటూ వ్యాఖ్య
- అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లిన పవన్

3లో

మా ఇళ్లు మాకు కాకుండా చెయ్యొద్దు

- వైఎస్సార్ జగనన్న కాలనీల వద్ద జనసేన నేతలను అడ్డుకున్న లబ్ధిదారులు
- రాజకీయాల కోసం పర్యటించవద్దంటూ హెచ్చరికలు

2లో



ఎల్లో ఎజెండాకు లిక్కర్ కిక్కు

- అరబిందో... ఢిల్లీ వ్యవహారాన్ని చూపిస్తూ టీడీపీ కారుకూతలు
- అది దేశంలోనే టాప్–2 ఫార్మా కంపెనీ... ఏపీలో పెట్టుబడులు
- ప్రస్తుత ప్లాంట్లకు తోడు... కాకినాడలో 2వేల కోట్లతో పెన్సిలిన్–జి తయారీ
- అందుకే రెండు పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- దీంతో ఏపీకి ఆదాయం.. పైపెచ్చు గ్రిడ్‌లో హెచ్చుతగ్గులుండవు
- రాష్ట్రానికిన్ని ప్రయోజనాలున్నా అరబిందోను టార్గెట్ చేస్తున్న ఎల్లో ముఠా
- ఢిల్లీ వ్యవహారం పూర్తిగా అక్కడి ప్రభుత్వానికి, కేంద్రానికి సంబంధించినదే
- కొంతలో కొంత తెలంగాణపై ఆరోపణలు చేసిన సీబీఐ
- మరి ఏపీకి, ముఖ్యమంత్రికి, విజయసాయికి అసలు సంబంధమేంటి?

4లో

వర్షాలకు నీటమునిగిన చెన్నైలోని ఓ ప్రాంతం



తమిళనాడుపై వరుణ ప్రతాపం

తీర ప్రాంతజిల్లాలపై తీవ్ర ప్రభావం

మైలాడుతురై జిల్లా శీర్గాలిలో 44 సెంటీమీటర్ల వర్షపాతం

- తమిళనాడులోని సముద్ర ప్రభావిత జిల్లాల్లో వరుణ బీభత్సం కొనసాగుతోంది. కడలూరు, మైలాడుతురై జిల్లాలో ఆదివారం భారీ వర్షాలు కురిశాయి. మైలాడుతురై జిల్లా శీర్గాలిలో గత 24 గంటల్లో 44 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగపట్నం, తంజావూరు, తిరువారూర్, దిండిగల్ జిల్లాల్లోనూ భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దిండిగల్ జిల్లా పరిధిలోని కొడైకెనాల్ పరిసర మార్గాల్లో రవాణా పూర్తిగా ఆగిపోయింది. ఎక్కడికక్కడ వాగులు, జలపాతాలు పొంగి పొర్లుతుండడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ఆదివారం వేకువజామున చెన్నై శివారులోని మొగలివాకం, మాంగాడు పరిసరాల్లో కుండపోత వర్షం కురిసింది.

- వివరాలు 6లో

నేడు విశాఖలో శ్రీవారి కార్తీక మహా దీపోత్సవం

- టీటీడీ ఆధ్వర్యంలో సోమవారం విశాఖలో కార్తీక మహా దీపోత్సవం జరగనుంది. 3 వేల మంది భక్తులు కుటుంబ సమేతంగా ఇందులో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు పార్క్ హోటల్ కూడలి నుంచి ఆర్కే బీచ్ వరకు శోభాయాత్ర సాగనుంది. అనంతరం ఆర్కే బీచ్ తీరంలో సాయంత్రం 5.30 గంటలకు దీపోత్సవం ప్రారంభమవుతుంది.

5లో

పారిశ్రామికవేత్తలే ప్రచారకర్తలు

- రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని అభినందిస్తున్న దిగ్గజ సంస్థలు
- వచ్చే ఏడాది విశాఖ సదస్సుకు వాటి మనోగతమే పెద్ద బ్రాండింగ్
- కళ్లెదుటే ఫలితాలు.. మరిన్ని సంస్థలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు

సాక్షి, అమరావతి: సాధారణంగా పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రముఖ సినీ నటులు, క్రీడాకారులను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించి భారీ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. వారు కోరినంత డబ్బులు చెల్లించి మరీ ప్రచారాన్ని చేపడతాయి. ఇక గత సర్కారు ప్రచార ఆర్భాటాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎంఓయూల పేరుతో మభ్యపుచ్చింది. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం, ప్రభుత్వ సహకారం ఉన్నప్పుడు ఇలాంటి కృత్రిమ ప్రచారంతో పనిలేదు. వచ్చే ఏడాది మార్చిలో విశాఖ వేదికగా నిర్వహించనున్న అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన దిగ్గజ సంస్థలే ప్రచారకర్తలుగా నిలవనున్నాయి. ఆయా యూనిట్లకు

మిగతా 3వ పేజీలో ▶



రిబ్బన్ కంపెనీ శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, తదితరులు

పారిశ్రామిక జిల్లాగా అనకాపల్లి

- 'అనకాపల్లి–అచ్యుతాపురం' ప్రాంతం వైపు పరిశ్రమలు
- విశాఖ నుంచి కాకినాడ వరకు పారిశ్రామిక పరుగులు
- త్వరలోనే పూడిమడకలో ఫిషింగ్ హార్బర్‌కు సీఎం శంకుస్థాపన
- యమ రిబ్బన్ కంపెనీకి శంకుస్థాపన చేసిన మంత్రి అమర్‌నాథ్

3లో

ఇదండీ సంగతి



..అయితే మోదీని మార్చడం కష్టమంటారా!



రేపటి నుంచి జీ–20 సదస్సు

నేడు బాలికి ప్రధాని మోదీ

- ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన కూటమి జీ–20 దేశాల సదస్సుకు హాజరవడానికి ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేషియా బయల్దేరి వెళుతున్నారు. అక్కడ బాలిలో ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న జీ–20 17వ శిఖరాగ్ర సదస్సుకు ఆయన హాజరవుతారు. కోవిడ్–19 తర్వాత తిరిగి ఆర్థికంగా పుంజుకోవడం, ఆహార, ఇంధన భద్రత అంశాల్లో ఎదురవుతున్న అంతర్జాతీయ సవాళ్లపై జరిగే చర్చా వేదికల్లో ప్రధాని పాల్గొననున్నారు.

6లో

16న మరో అల్పపీడనం!



- ఈ నెల 16న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో 18వ తేదీ నుంచి రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురిసే పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, నాలుగు రోజుల నుంచి రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు తగ్గుముఖం పట్టాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఆదివారం కుంభవృష్టిగా వర్షం కురిసింది. రానున్న 2 రోజులు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు కురవనున్నాయి.

- వివరాలు 2లో

23న విశాఖలో ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సు

- బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే వెల్లడి
- ఒకే వేదిక పైకి ఇంధన రంగ పరిశ్రమలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు



సాక్షి, అమరావతి: ఇంధన సామర్థ్యం పెట్టుబడుల సదస్సు (ఇన్వెస్ట్‌మెంట్ బజార్)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) సమన్వయంతో 23న విశాఖలో నిర్వహించనున్నట్టు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) డైరెక్టర్ జనరల్ అభయ్ బాక్రే ప్రకటించారు. రాష్ట్ర ఇంధన శాఖ, ఏపీఎస్ఈసీఎం అధికారులతో ఆదివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో ఇంధన సామర్థ్య సాంకేతికతను అందుబాటులోకి తేవటం, దానిని వినియోగించుకోవడం కోసం పరిశ్రమలకు ఆర్థిక సహకారం అందించడమే లక్ష్యంగా ఆసక్తి గల పరిశ్రమలను, బ్యాంకులను, ఆర్థిక సంస్థలను ఒకే వేదిక పైకి తెచ్చేందుకు సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ఇన్వెస్ట్‌మెంట్ బజార్ వేదికగా పెట్టుబడులకు అవకాశమున్న ప్రాజెక్టులను గుర్తిస్తామని, సదస్సులో ఎంపికైన పరిశ్రమలకు ప్రాజెక్టులు అమలు చేసేందుకు ఆర్థిక సహకారం అందే ఏర్పాటు చేస్తామని అభయ్ బాక్రే చెప్పారు. గతేడాది మార్చిలో ఇదే విశాఖలో దేశంలో తొలిసారిగా ఇంధన సామర్థ్య పెట్టుబడుల సదస్సును నిర్వహించిన ఘనత ఏపీకి దక్కుతుందని, విద్యుత్ రంగంలో ప్రత్యేకించి ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన రంగాల్లో ఏపీ పనితీరును గుర్తించి మరోసారి విశాఖలో సదస్సు నిర్వహించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పరిశ్రమల నుంచి ఏపీఎస్ఈసీఎంకు ప్రతిపాదనలు వస్తే వాటికి అవసరమైన సాంకేతిక ప్రక్రియ నిర్వహించి, ఆర్థిక సంస్థలకు పంపుతామని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. సమావేశంలో ఏపీఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖర రెడ్డి, ఇంధన శాఖ అధికారులు పాల్గొన్నారు.

16న మరో అల్పపీడనం!

- 18వ తేదీ నుంచి మళ్లీ వర్షాలకు అవకాశం..
- నెల్లూరు జిల్లాలో కుంభవృష్టి.. జలమయమైన నగరం



కావలిలోని బాలకృష్ణారెడ్డి నగర్‌లో ఓ ఇంట్లో వంట గదిలోకి చేరిన నీరు

సాక్షి, విశాఖపట్నం/నెల్లూరు (అర్బన్): కొద్దిరోజులుగా నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక తీరానికి ఆనుకుని కొనసాగుతున్న అల్పపీడనం ఆదివారం ఆగ్నేయ అరేబియా సముద్రంలో విలీనమైంది. మరోవైపు ఈ నెల 16న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో 18వ తేదీ నుంచి రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురిసే పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, నాలుగు రోజుల నుంచి రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు తగ్గుముఖం పట్టాయి. రానున్న రెండు రోజులు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాంధ్రలో పొడి వాతావరణం నెలకొంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది.

నెల్లూరు జిల్లాలో కుంభవృష్టి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షం ఆదివారం నాటికి కుంభవృష్టిగా మారింది. నెల్లూరు నగరం జలమయమైంది. ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం, మాగుంట లేఅవుట్‌లోని అండర్ బ్రిడ్జిల్లోకి నీరు చేరడంతో బారికేడ్లు పెట్టి మూసేశారు. ఉమ్మారెడ్డిగుంటలోని పలు పల్లపు ప్రాంతాల ఇళ్లలోకి నీరు చేరింది. ప్రధానంగా కావలి, కొండాపురం, గుడ్లూరు, ఉలవపాడు, కందుకూరు మండలాల్లో కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కావలి మండలం రుద్రకోట పంచాయతీ గుమ్మడిబొందల గ్రామం వద్ద చప్టాపై నీరు పొంగి ప్రవహిస్తోంది. కావలి పట్టణం బాలకృష్ణారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. బ్రాహ్మణక్రాక- కృష్ణాపాడు రోడ్డుపై వర్షపు నీరు చేరింది. కొండాపురం మార్గంలో మిడతలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గుడ్లూరు-బసిరెడ్డిపాలెం గ్రామాల మధ్య ఉప్పుటేరు బ్రిడ్జిపై 4 అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో శనివారం రాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. గుడ్లూరు-తెట్టు ప్రధాన రహదారిలో చెమిడిదిపాడు వద్ద ఉన్న రాళ్లవాగు కూడా ఉధృతంగా పారుతుండడంతో మధ్యాహ్నం వరకు కావలి-కందుకూరు మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఉలవపాడు మండలంలో బద్దిపూడి-మాచవరం మధ్య ఉన్న ఉప్పుటేరు కూడా ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మన్నేటికోట-ఆత్మకూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఎర్రవాగు ఉధృతంగా పారుతోంది. దీంతో చుట్టుగుంటకు రాకపోకలు నిలిచిపోయాయి.

మా కాలనీల్లోకి రావొద్దు.. మా ఇళ్లు మాకు కాకుండా చెయ్యొద్దు

- వైఎస్సార్ జగనన్న కాలనీల వద్ద జనసేన నేతలను అడ్డుకున్న లబ్ధిదారులు
- రాజకీయాల కోసం పర్యటించవద్దంటూ ఎక్కడికక్కడ హెచ్చరికలు
- ఈసారి వస్తే మాటలతో కాదు.. చేతలతో సమాధానం చెబుతాం
- ప్రజల తిరుగుబాటుతో ఎక్కడికక్కడ వెనుతిరిగిన జనసేన నేతలు



మంగళగిరిలో జనసేన నాయకులను అడ్డుకుంటున్న లబ్ధిదారులు



ఆదోనిలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నాయకులతో జనసేన శ్రేణుల వాగ్వాదం



బిళ్లగుంటలో జనసేన నాయకులు గోబ్యాక్ అంటూ నిరసన తెలుపుతున్న కాలనీవాసులు



మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతున్న లబ్ధిదారులు

మంగళగిరి/కశింకోట/పెంటపాడు: వైఎస్సార్ జగనన్న కాలనీలలో పర్యటించి రాజకీయాలు చేయాలనుకున్న జనసేన నాయకులకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల నుంచి తిరుగుబాటు ఎదురైంది. తమ నివాసాలలో ఎవరు పర్యటించాల్సిన అవసరంలేదని వెంటనే వెనక్కి వెళ్లాలని కరాఖండిగా చెప్పారు. ఇంకోసారి తమ కాలనీల్లోకి వస్తే మాటలతో కాకుండా చేతలతో సమాధానం చెబుతామని ముక్తకంఠంతో లబ్ధిదారులు హెచ్చరిస్తున్నారు. ఎక్కడికక్కడ లబ్ధిదారుల నుంచి ఇలా వ్యతిరేకత వస్తుండడంతో జనసేన నేతలు చేసేదిలేక వెనుదిరుగుతున్నారు.

రాజకీయాల కోసం రావొద్దు.. వెళ్లిపోండి

గుంటూరు జిల్లా మంగళగిరి ఆటోనగర్‌లో నిర్మించిన వైఎస్సార్ జగనన్న కాలనీ (టిడ్కో) ఇళ్లను పరిశీలించేందుకు వచ్చిన జనసేన శ్రేణులకు చేదు అనుభవం ఎదురైంది. వీరి పర్యటనను ముందుగానే తెలుసుకున్న లబ్ధిదారులు సమావేశమై జనసేన నాయకులను అడ్డుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆ పార్టీ నేత చిల్లపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు టిడ్కో ఇళ్ల సముదాయానికి చేరుకున్నారు. వీరి రాకను గమనించిన లబ్ధిదారులు అనుకున్నట్లుగానే వారిని అడ్డుకున్నారు. తమ ఇళ్లకు అన్ని వసతులు కల్పించి అత్యాధునికంగా తీర్చిదిద్దారని.. గృహప్రవేశాలు కూడా చేసుకున్నామని చెప్పారు. అసలు జనసేన నాయకులు ఎందుకు వచ్చారని నిలదీశారు. రాజకీయాల కోసం ఎవరూ తమ దగ్గరకు రావాల్సిన అవసరంలేదని వెంటనే వెనక్కి వెళ్లాలని కరాఖండిగా చెప్పారు. దీంతో జనసేన శ్రేణులు తాము సమస్యలేమైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే వచ్చామని చెప్పారు. అంతేకాక.. ప్రజాస్వామ్యంలో తమకు ఇలా వచ్చే హక్కు ఉందని కొందరు జనసేన కార్యకర్తలు లబ్ధిదారులైన మహిళలతో వాగ్వాదానికి దిగారు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన లబ్ధిదారులు సమస్యలుంటే తమ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్తామని మీరు వెళ్లిపోవాలంటూ మండిపడ్డారు. అలాగే, రాజకీయం చేసి మా పొట్ట కొట్టొద్దని కోరారు. దీంతో ఏంచేయాలో పాలుపోని జనసేన నేతలు లబ్ధిదారులకు దండం పెట్టి వెనుదిరిగారు. అనంతరం.. సి-3 బ్లాక్‌లో ఎఫ్ఎఫ్-8 ప్లాట్‌లో నివాసముంటున్న జనసేన కార్యకర్త ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఇది గమనించిన లబ్ధిదారులు మళ్లీ అక్కడకు చేరుకుని అసలు ఏ ఇంటినీ పరిశీలించాల్సిన అవసరంలేదని వెంటనే వెళ్లిపోవాలని కోరడంతో మరోసారి వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో పట్టణ ఎస్ఐ మహేంద్ర అక్కడకు చేరుకోవడంతో చేసేదిలేక జనసేన శ్రేణులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత పలువురు లబ్ధిదారులు మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయాల కోసం ఏ పార్టీ పర్యటించినా అడ్డుకుంటామన్నారు. రాజకీయాల కోసం జగనన్న ఇళ్ల వద్దకు వస్తే మాటలతో కాకుండా చేతలతోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు.

సంతృప్తికరంగానే ఉంటున్నాం..

అలాగే, అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట, తేగాడ గ్రామాల వద్ద నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ లేఅవుట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను సమస్యలు చెప్పమని అడిగారు. అయితే, ఇళ్ల స్థలం, ఇళ్లు మంజూరు చేయడంతో సంతృప్తికరంగా నిర్మించుకుంటున్నామని వారు బదులిచ్చారు. తేగాడ లేఅవుట్‌లో కూడా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం సంతృప్తికరంగా సాగుతుందని బదులివ్వడంతో తాము ఆశించిన ఫలితం రాలేదంటూ జనసేన శ్రేణులు నిరాశతో వెనుదిరిగారు.

గోబ్యాక్ నినాదాలతో తోకముడిచిన జనసేన

'జగనన్న కాలనీలో జనసేన జెండాల ప్రదర్శన తగదు.. మమ్మల్ని సంప్రదించకుండా కాలనీలోకి రావడాన్ని సహించం.. మాకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయి.. జనసేన నేతలు వచ్చి ఇక్కడ కిరికిరీలు పెట్టొద్దు.. జగనన్న ప్రభుత్వం మాకెంతో మేలు చేస్తోంది.. గతంలో ఏ ప్రభుత్వం మాకు ఇళ్లు ఇవ్వలేదు'.. అంటూ పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం దర్శిపర్రు శివారు బిళ్లగుంట జగనన్న కాలనీవాసులు జనసేన శ్రేణులకు అడ్డుతగిలారు. జనసేన గోబ్యాక్ అంటూ మహిళలు నినదించారు. తమకు సీఎం జగనన్న, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నిరకాలుగా అండగా నిలుస్తుంటే ఓర్వలేకపోతున్నారా అని ప్రశ్నించారు. దీంతో జనసేన శ్రేణులు తమ జెండాలను ముడిచి వెనుదిరిగారు.

రచ్చ కోసం ఇంటి బాట

▶ మొదటి పేజీ తరువాయి

ఊళ్లనే నిర్మిస్తోంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు చొప్పున చెల్లిస్తోంది. పేదలపై ఇంకా అదనపు భారం పడకూడదని, బయట అప్పులు చేసి వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఇంటికి రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణాన్ని పావలా వడ్డీకే సమకూరుస్తోంది. మరోవైపు ఉచితంగా ఇసుక, మార్కెట్ ధరల కన్నా తక్కువ రేటుకు సిమెంట్, ఇనుము, ఇతర నిర్మాణ సామాగ్రిని సరఫరా చేస్తోంది. సబ్సిడీపై సామగ్రి సరఫరా, ఇతర రాయితీల ద్వారా రూ.13,758 కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూరుస్తోంది. కేవలం ఇళ్లు నిర్మించడమే కాకుండా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసింది. కరెంట్, నీరు లాంటి కనీస వసతుల కోసం రూ.3,117 కోట్లు వెచ్చిస్తోంది. మరోవైపు శాశ్వత మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏకంగా రూ.36,026 కోట్లు వ్యయం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. వీటిలో 1.7 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 1.2 లక్షల ఇళ్లు స్లాబ్ దశ పూర్తై ముగింపు దశలో ఉన్నాయి. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. పేదల ఇళ్ల నిర్మాణం ద్వారా రూ.మూడు లక్షల కోట్ల సంపదను ప్రభుత్వం సృష్టిస్తోంది. అది ఎలాగంటే.. ప్రభుత్వం పంపిణీ చేసిన స్థలాల విలువ గ్రామీణ ప్రాంతాల్లో రూ.3 లక్షల నుంచి 4 లక్షల దాకా ఉండగా పట్టణ ప్రాంతాల్లో రూ.5 లక్షల నుంచి 7 లక్షల వరకూ ఉంది. ఈ క్రమంలో ఇంటి నిర్మాణం పూర్తయ్యే సరికి ఆస్తి విలువ రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల మేరకు చేరుతుంది. ఈ లెక్కన 31 లక్షల మంది పేదలకు పక్కా ఇళ్ల కల్పన ద్వారా రూ.2.7 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల మేర సంపదను ప్రభుత్వం సృష్టిస్తోంది.

ఆర్నెల్లలో రెండు రకాలుగా..

ప్రభుత్వం చేస్తున్న సాయంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేకపోతున్నారంటూ రామోజీ తన పత్రికలోనే కొద్ది నెలల క్రితం కథనాలు ప్రచురించారు. అయితే ఐదారు నెలలు తిరగక ముందే కొత్త పల్లవి అందుకున్నారు. ప్రభుత్వమే కొన్ని కంపెనీల ద్వారా చేపట్టిన ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణంలో స్కామ్ జరుగుతోందనే ఆరోపణలకు దిగారు. ఆర్నెల్లలోనే భిన్నాభిప్రాయాలను వెలువరించడం ఆయనకే చెల్లింది. అసలు ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణంలో స్కామ్‌లు, అక్రమాలు జరుగడానికి తావు లేదు. ఇళ్ల లబ్ధిదారులందరికీ రూ.1.80 లక్షల బిల్లు, బ్యాంకు రుణం ద్వారా రూ.35 వేలు సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంటే మొత్తంగా రూ.2.15 లక్షలు. ఈ సాయం అందించినా ఇళ్ల నిర్మాణం తమవల్ల కావడం లేదని, ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల మందికి పైగా లబ్ధిదారులు కోరారు. దీంతో లాభాపేక్ష లేకుండా ప్రభుత్వం నిర్ధారించిన రూ.2.15 లక్షల మొత్తంతోనే ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి కొన్ని కంపెనీలు, భవన నిర్మాణ మేస్త్రీలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఈ క్రమంలో వీరికి లబ్ధిదారులతో ఒప్పందం కుదిర్చి ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఇందులో ఈనాడుకు ఏం స్కామ్ కనిపించిందని అడ్డుకుంటున్నారని ఆప్షన్-3 లబ్ధిదారులు మండిపడుతున్నారు.

ఎందుకింత అక్కసు అంటే..?

దేశంలో ఎక్కడా లేని రీతిలో పేదలెవరూ సొంతిల్లు లేక ఇబ్బంది కూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేయడం చూసి చంద్రబాబు బృందం బెంబేలెత్తుతోంది. ఈ పథకం దిగ్విజయంగా పూర్తయితే తనకు రాజకీయ భవిష్యత్తు ఉండదనే దృఢ నిశ్చయానికి వచ్చిన ఆయన దీన్ని అడ్డుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారు. తమ పార్టీ నాయకుల ద్వారా కోర్టులను ఆశ్రయించి ఇళ్ల పట్టాల పంపిణీకి ఆటంకాలు కల్పించారు. అయితే ప్రభుత్వ సంకల్పం ముందు ఈ కుటిల యత్నాలు ఫలించలేదు. దీంతో ఈనాడు, ఇతర పచ్చ మీడియా ద్వారా తప్పుడు కథనాలతో ప్రభుత్వంపై దుష్ప్రచారానికి తెగించారు. అయితే అది కూడా ఆశించిన మేర ఫలితం ఇవ్వకపోవడంతో ఈసారి దత్తపుత్రుడిని రంగంలోకి దింపారు. తొలి నుంచి ఈ చేష్టలు గమనిస్తున్న రాష్ట్ర ప్రజలు జనసేనాని ఆదుర్దా అంతా రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమై విలపిస్తున్న బాబు కన్నీళ్లు తుడవడం కోసమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

పేదల పట్ల దత్తపుత్రుడి విధానం

నాడు 2014-19

టీడీపీ హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంచిన దాఖలాలు లేవు. నిలువ నీడ లేదని పేదలు ప్రాధేయపడ్డా ఇళ్ల దరఖాస్తులను పట్టించుకున్న పాపాన పోలేదు. లక్షల మంది నిరుపేదలు తలదాచుకునేందుకు చోటు లేక, అద్దె ఇళ్లలో అవస్థలు పడుతున్నా ఏ రోజూ జనసేనాని స్పందించ లేదు. నాటి ప్రభుత్వాన్ని కనీసం ప్రశ్నించలేదు.

నేడు 2019 తరువాత

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 31 లక్షల మంది నిరుపేదలకు గృహ యోగం కల్పిస్తోంది. ప్రభుత్వమే ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు బిల్లు రూపంలో, పావలా వడ్డీకి రూ.35 వేలు బ్యాంకు రుణం ద్వారా సాయం చేస్తోంది. రెండు దశల్లో 21.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో పేదలకు మేలు జరుగుతుంటే లోపాయికారీ ఒప్పందాల మేరకు కన్నీళ్లు తుడుస్తానంటూ, ప్రశ్నిస్తానంటూ బయల్దేరారు.

ఈనాడు ద్వంద్వ వైఖరి ఇలా..

13-06-2022



రూ.1.80 లక్షల బిల్లు, రూ.35 వేలు బ్యాంకు రుణం కలిపి మొత్తంగా రూ.2.15 లక్షల్లో ఇల్లు పూర్తి చేయాలా...? అబ్బే ఎలా కుదురుతుంది..? ఇచ్చే డబ్బుకు, అయ్యే ఖర్చుకు పొంతన లేకుండా పోతోంది. పేదలు ఇళ్లు నిర్మించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. పేదల ఇళ్లు పునాదే దాటడం లేదు.

09-11-2022



పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వమే కాంట్రాక్టర్లను ఎంపిక చేస్తోంది. ఆ సంస్థలు ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షల బిల్లు, లబ్ధిదారులకు బ్యాంకు రుణం కింద వచ్చే రూ.35 వేలు కలిపి మొత్తం రూ.2.15 లక్షలతో ఇంటిని నిర్మిస్తున్నారు. దీని వెనుక పెద్ద స్కామ్ దాగుంది!!

మా కన్నీళ్లు నాడు కనపడలేదా?

మాటల ప్రభుత్వం కాదని రుజువు చేశారు



మహారాష్ట్ర నుంచి జీవనోపాధి కోసం 13 ఏళ్ల క్రితం వచ్చి పాలకొండలో స్థిరపడ్డాం. రోజు వారీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నా. నాకు ముగ్గురు పిల్లలు. అద్దె ఇంట్లో ఉంటున్నా. ఆధార్, రేషన్, ఓటరు కార్డు పాలకొండలో ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా గత ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు మంజూరు చేయలేదు. గత ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ వాగ్దానాలు చూసి అందరూ ముందు ఇలాగే మాటలు చెబుతారు. అధికారంలోకి వస్తే పట్టించుకోరని భావించా. ఇది మాటల ప్రభుత్వం కాదని సీఎం జగన్ రుజువు చేశారు. మాకు ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తవుతుంది. ఇప్పుడు పేదల గురించి మాట్లాడుతున్న పార్టీలు నాడు మా గోడు ఆలకించలేదు.

– కుంబారు సంతోష్, పాలకొండ, పార్వతీపురం మన్యం జిల్లా

నాడు ఆరుసార్లు దరఖాస్తు



గత ప్రభుత్వ హయాంలో ఆరుసార్లు ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకున్నా రాలేదు. అర్హత ఉండి కూడా మాకు ఇల్లు మంజూరు చేయకపోవడంపై అధికారులను ప్రశ్నిస్తే సమాధానం లేదు. నాయకుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాకు మొదటి విడతలోనే పక్కా గృహాన్ని మంజూరు చేసింది. ఈ రోజు ప్రజల కన్నీటి గురించి మాట్లాడుతున్న ఏ నాయకుడూ ఆ రోజు కనిపించలేదు.

– స్నేహలత, కోట గుండ్ల పల్లె, అన్నమయ్య జిల్లా

జనసేన, ఈనాడు మొసలి కన్నీళ్లు



20 ఏళ్లు నిలువ నీడ లేక ఇబ్బంది పడితే ఏ నాయకుడూ పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా సెంటు స్థలం ఇవ్వలేదు. ఆ పార్టీకి వత్తాసు పలికే జనసేన, ఈనాడు మా గురించి మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. వారంతా పేదల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. ఈ రోజు జగనన్న కాలనీల సందర్శనకు వస్తున్న పవన్ టీడీపీ హయాంలో మేం నిలువ నీడలేక ఇబ్బంది పడినప్పుడు ఏమయ్యారు? సీఎం జగన్ చేస్తున్న సాయం చాలా పెద్దది. మేం ఎంతో తృప్తిగా ఉన్నాం.

– సాంబశివ, బైరెడ్డిపల్లి, చిత్తూరు జిల్లా

రూ.3 లక్షల విలువైన స్థలం ఇచ్చారు



అరకొర సంపాదనలో నెలకు రూ.3 వేలు ఇంటి అద్దె, ఇతర అవసరాలకు సరిపోయేది. టీడీపీ అధికారంలో ఉండగా ఎన్నిసార్లు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా ఫలితం దక్కలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ మా ఇంటికే వచ్చి దరఖాస్తు తీసుకున్నాడు. రూ.3 లక్షల విలువైన స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల బిల్లు ఇచ్చారు.

– కొల్లి కన్నమ్మ, కొత్త మూలకుద్దు, భీమిలి మండలం, విశాఖ జిల్లా

ఈ సాయం ఎంతో గొప్పది..



దశాబ్దాలుగా సొంతిల్లు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. గత ప్రభుత్వ హయాంలో ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. ఇప్పుడు ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా స్థలం, ఇల్లు సమకూరాయి. ప్రభుత్వం చేస్తున్న సాయం మాకెంతో గొప్పది. అధికారంలో ఉండగా సెంటు భూమి ఇవ్వని టీడీపీని పవన్ ఎందుకు విమర్శించడం లేదు?

– శ్రీచందన, బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారి పల్లి గ్రామం, శ్రీసత్యసాయి జిల్లా

డీడీ కట్టించుకుని ఇల్లు లేదన్నారు..



గత ప్రభుత్వ హయాంలో పక్కా ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే డీడీ కట్టించుకుని చివరకు ఇల్లు లేదన్నారు. డబ్బులు వసూలు చేసి అనర్హులకు ఇళ్లు కేటాయించారు. దీంతో ఇక ఇల్లు వస్తుందనే ఆశ వదులుకున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనర్హులను తొలగించి మాలాంటి పేదలను గుర్తించి రూపాయికే ఇల్లు ఇచ్చింది. సొంతింటి కల నెరవేరినందుకు ఆనందంగా ఉంది. అన్ని వసతులతో పేదలకు ఇల్లు కేటాయించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– కమల, మంగళగిరి, గుంటూరు జిల్లా

ఫలించిన 40 ఏళ్ల నిరీక్షణ



సొంతింటి కోసం 40 ఏళ్లుగా ఎదురు చూశా. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే ఇంటి స్థలం, ఇల్లు మంజూరైంది. ప్రైవేట్ వెంచర్ల తరహాలో నీటి కోసం బోర్లు, కరెంట్ సరఫరా చేపట్టారు. సిమెంట్, ఐరన్, ఇసుక ఇంటి వద్దకే సరఫరా చేస్తున్నారు.

– పాలే ఈశ్వరరావు, చాటపర్రు, ఏలూరు జిల్లా

మా కన్నీళ్లు ఈరోజు గుర్తొచ్చాయా?



టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పవన్‌కు పేదలు ఎందుకు గుర్తు రాలేదు? ఈ ప్రభుత్వం మాకు నిలువ నీడ కల్పించి కన్నీళ్లు తుడుస్తుంటే బురద చల్లుతారా?

– ఇదుపుల రాజకుమారి, మాగల్లు, ఎన్టీఆర్ జిల్లా

తప్పుడు ప్రచారం..



పుత్తూరు పరిధిలోని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తి కావస్తోంది. నాలా ఎంతో మంది గృహ ప్రవేశాల కోసం ముహూర్తాలు పెట్టుకుంటున్నారు. కాలనీల్లో అన్నీ బాగున్నాయి. టీడీపీ, జనసేన, వారి అనుకూల పచ్చ మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నాయి.

– ఎ.రాధిక, రాజాజీ స్ట్రీట్, పుత్తూరు, చిత్తూరు జిల్లా

మా కష్టసుఖాలు మీకేం తెలుసు?



టీడీపీ, జనసేన, వాటి అనుకూల పత్రికలు, చానళ్లకు మా బాధలు, కష్టాలు ఏం తెలుసని మాట్లాడుతున్నారు? 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు మాకు ఇల్లు ఎందుకు కట్టించి ఇవ్వలేదు? ఆ పార్టీకి మద్దతిచ్చి గెలిపించిన పవన్ నాడు ఎందుకు ప్రశ్నించలేదు? మా బాధలు, కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం జగన్ ఒక్కడే. అందుకే మాకు ఈ రోజు సొంత ఇళ్లు సమకూరుస్తున్నారు.

– బొడసింగి పుణ్యవతి, జగతిమెట్ట కాలనీ , టెక్కలి, శ్రీకాకుళం జిల్లా

పవన్‌కళ్యాణ్.. నీకసలు కళ్లున్నాయా!

- గుంకలాంలోనే 10 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే.. ఏ పనులూ జరగడం లేదంటావా?
- దేశంలో ఎక్కడా లేని విధంగా 31 లక్షల ఇళ్ల పట్టాలిచ్చాం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ధ్వజం



సాక్షి, అమరావతి: 'దేశంలో ఎక్కడా లేని విధంగా 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్. రెండు దశల్లో 21 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. ఆ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అంతమంచిగా పనులు జరుగుతుంటే.. ఎందుకంత కడుపు మంట? గుంకలాంలో 10 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతుంటే.. ఏ పనులూ జరగడం లేదంటావా? నీకసలు కళ్లున్నాయా? ఎంత దుర్మార్గం. అక్కడ ఆస్థాయిలో పనులు జరుగుతుంటే.. ఏమీ జరగడం లేదని, కేవలం కమాన్ మాత్రమే ఉందని ఎలా అంటున్నారు?..' అంటూ గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'విజయనగరం జిల్లా గుంకలాంలో జగనన్న కాలనీ లేఅవుట్‌కు వెళ్లిన పవన్‌కళ్యాణ్ అక్కడ మాట్లాడిన మాటలు, ప్రవర్తన, వింత చేష్టలు చూసిన తర్వాత చెబుతున్నాం.. పవన్‌కళ్యాణ్, నీ ట్యాగ్‌లైన్ కాస్త మార్చుకో. జగనన్న ఇళ్లు.. పవన్, బాబుల కన్నీళ్లు.. అని ట్యాగ్‌లైన్ పెట్టుకో..' అంటూ ఎద్దేవా చేశారు. గుంకలాంలో లబ్ధిదారులంతా వచ్చి ప్రభుత్వంపై నిందలు వేసి, తనకు బాసటగా నిలుస్తారని ఆశించినా.. అక్కడి ప్రజల స్పందన చూసి పవన్‌కళ్యాణ్ నోరెళ్లబెట్టాల్సి వచ్చిందన్నారు. తమకు ఇళ్లు కట్టిస్తున్నారు.. బిల్లులు కూడా ఇస్తున్నారని అంతా చెప్పడంతో పవన్ గుండె జారిపోయిందన్నారు. పవన్ వెంట లబ్ధిదారులు ఎవరూ లేరని చెప్పారు. 'గుంకలాం వెళ్లిన నువ్వు అక్కడ ఏం చేశావు? ఏం చూశావు? వచ్చావు. 20 నిమిషాలు తిరిగావు. ప్రభుత్వం మీద బురద వేయడం కోసం ఒక వెహికిల్ ఎక్కి తిట్టి వెళ్లిపోయావు. అంటే వీకెండ్‌లో గెస్ట్ ఆర్టిస్ట్‌గా.. వచ్చి వెళ్లి పోయావు..' అని విమర్శించారు. 'మనసున్న సీఎం జగన్.. గుంకలాంలో సుమారు 12 వేలమంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన లేఅవుట్ నుంచి మాట్లాడావు. అది మా జగన్ ప్రభుత్వం ఇచ్చింది. నీవక్కడ నిల్చుని మాట్లాడావు. నీకసలు సిగ్గుందా?..' అని ప్రశ్నించారు. లోకేశ్ మోకాళ్లతో నడిచినా, దొర్లుకుంటూ నడిచినా, పంగనామాలు పెట్టి నడిచినా.. ఆయన, ఆయన తండ్రి చేసిన పాపాలు వదిలిపెట్టవని మంత్రి చెప్పారు.

ఆనాడెందుకు ప్రశ్నించలేదు?

'2014 నుంచి 2019 వరకు ఒక్కసెంటు భూమి కూడా ఇవ్వని చంద్రబాబు చొక్కాను అప్పుడెందుకు పట్టుకోలేదు. పవన్‌కళ్యాణ్ పిట్టకథలు చెబుతున్నాడు. పక్షికి కూడా గూడు ఉంటుందంటున్నాడు. మేము 31 లక్షల ఇళ్ల పట్టాలు ఇచ్చాం. 21 లక్షల ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. మరి ఆనాడు ఒక్క ఇంటిస్థలం కూడా ఇవ్వని దత్త తండ్రిని ఒక్కమాట ఎందుకు అనలేదు..' అని పేర్కొన్నారు.

జన్యు పంటలు వద్దు.. ప్రకృతి సేద్యమే ముద్దు!!

- మైసూరు కిసాన్ స్వరాజ్ సమ్మేళనం పిలుపు

మైసూరు, సాక్షి ప్రత్యేక ప్రతినిధి: వాతావరణ మార్పులను తట్టుకోవటంతో పాటు పౌష్టికాహార, ఆరోగ్య, పర్యావరణ భద్రత సాధించటానికి దేశీ విత్తనాలతో కూడిన ప్రకృతి సేద్యమే అత్యుత్తమ మార్గమని కిసాన్ స్వరాజ్ సమ్మేళనం పిలుపునిచ్చింది. ప్రమాదకరమైన జన్యుమార్పిడి పంటలను నెత్తిన పెట్టుకోవాల్సిన అవసరమే లేదన్న వాస్తవాన్ని పాలకులు, ప్రజలు గుర్తెరగాలని విజ్ఞప్తి చేసింది. రైతులందరికీ ఆర్థిక భద్రత చేకూర్చేలా అన్ని పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, దానికి చట్టబద్ధత కల్పించాలని కోరింది. మైసూరులో 3 రోజులుగా జరుగుతున్న జాతీయ రైతు సమ్మేళనం ఆదివారం ముగిసింది. ముగింపు సమావేశంలో మైసూరు డిక్లరేషన్‌ను వెలువరించారు.

క్లుప్తంగా

నాటుసారా రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతాం

డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర వ్యాప్తంగా నాటు సారా తయారీ గ్రామాలు 3,200 ఉన్నాయని అక్కడి ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే 3,485 మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్టు చెప్పారు. ఆయన ఆదివారం రాత్రి శ్రీకాకుళం ఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహించి.. నాటు సారా తయారు చేసే కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వమే ఉపాధి కల్పిస్తోందన్నారు. అరకు వంటి ప్రాంతాల్లో 7,500 ఎకరాల్లో గంజాయి పంటను పాడు చేసి వారిని ఉద్యాన పంటల వైపు మళ్లించినట్టు చెప్పారు. నాటుసారా రహిత రాష్ట్రంగా ఏపీ తయారు చేస్తామన్నారు. గతంతో పోలిస్తే గత నాలుగేళ్లలో నేరాల సంఖ్య తగ్గిందని, మావోల ప్రాబల్యం కూడా తగ్గించగలిగామన్నారు. భూ వివాదాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి వివరించారు.

సంక్షేమం అద్భుతంగా ఉందని ఒప్పుకున్న పవన్

గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏపీ నిలిపివేయబోమని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారంటే సంక్షేమ పథకాలు అద్భుతంగా ఉన్నట్లు ఆయన ఒప్పుకున్నట్లేనని గిరిజన సహకార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి అన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఏపీలోనే ఇళ్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేపడుతున్నారని తెలిపారు. ఈ ఘనతనూ త్వరలో పవన్ అంగీకరించబోతున్నారని ఆమె ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్‌కు అండగా ఉందాం

- ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం పిలుపు
- హైదరాబాద్‌లో ఏపీ బీసీ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

సాక్షి, అమరావతి: వెనుకబడిన కులాల పక్షపాతి అయిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలు ఎల్లప్పుడు వెన్నుదన్నుగా నిలవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్.మారేష్ అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో బీసీలకు పెద్దపీట వేసి సీఎం జగన్ తన పెద్ద మనసు చాటుకున్నారని ప్రశంసించారు. బీసీలంతా సంఘటిత శక్తిగా పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేలా పోరాటం చేయాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జు కృష్ణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి, జాతీయ బీసీ సంఘం కన్వీనర్ చెరుకుల రాజేందర్, సంఘ నేతలు హర్షద్, నీలం వెంకటేష్, అనంతయ్య, బలరాం పాల్గొన్నారు.

'కోర్ కమిటీ' పేరిట అవాస్తవ కథనాలు

- తప్పుడు రాతలపై ఆ పత్రికలు వివరణ ఇవ్వాలి
- ఎంపీ జీవీఎల్ నరసింహారావు



ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): ప్రధాని నరేంద్రమోదీ బీజేపీ నేతలతో కోర్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు ప్రచురించాయని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం సాయంత్రం విశాఖ బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 'ప్రధాని విశాఖలో గంటన్నరకు పైగా కోర్ కమిటీ సమావేశంలో బీజేపీ నేతలకు విలువైన సూచనలు చేశారు. కానీ.. ఆప్ కా నామ్ క్యాహై అంటూ వీర్రాజును ప్రధాని ప్రశ్నించినట్టు కొన్ని పత్రికలు తప్పుడు వార్తలు ప్రచురించాయి. అది పూర్తిగా అవాస్తవం. ఎవరికో లబ్ధి చేకూర్చడానికి అలా రాశారు. ఆ కథనాలు ఎవరో చెబితే రాశారా.. లేక మీరంతట మీరే వీర్రాజును పలచన చేయాలని రాశారా? దీనిపై ఆ పత్రికలే వివరణ ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. 2024 వరకు సోము వీర్రాజు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతారని ఇటీవల అధిష్టానం స్పష్టం చేసిందని, అది కొంతమందికి ఇబ్బంది కలిగించి ఉండవచ్చని తనకు అనిపిస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విశాఖకు కొత్తగా ఇంటర్నెట్ ఎక్స్ఛేంజీని మంజూరు చేసిందని, జనవరి నాటికి దీని నిర్మాణం జరుగుతుందని జీవీఎల్ తెలిపారు.

శాటిలైట్ సిటీలుగా వైఎస్సార్ జగనన్న నగరాలు

గేటెడ్ కమ్యూనిటీ తరహాలో టిడ్కో అపార్ట్‌మెంట్లు



నెల్లూరు వెంకటేశ్వరపురంలో నిర్మించిన టిడ్కో గృహసముదాయం

- 88 యూఎల్బీలలో 2.62లక్షల ఇళ్ల నిర్మాణం
- 163 ప్రాంతాల్లో కొత్తగా వైఎస్సార్ జగనన్న నగరాలు
- ఐదు ప్రాంతాల్లో 10 వేలకు మించి ఇళ్ల నిర్మాణం

సాక్షి, అమరావతి: పట్టణ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న టిడ్కో గృహాలు కొత్త పట్టణాలను తలపిస్తున్నాయి. నగరాలు, పట్టణాలకు సమీపంలోని అనువైన ప్రాంతాల్లో జీ+3 విధానంలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్లు అన్ని వసతులతో అందుబాటులోకి వస్తున్నాయి. రాష్ట్రంలోని 88 యూఎల్బీలలో పేదల కోసం 2,62,212 ఇళ్లను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మొత్తం 163 ప్రాంతాల్లో ఉన్న వీటికి 'వైఎస్సార్ జగనన్న నగరాలు'గా నామకరణం చేశారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కోచోట వెయ్యి నుంచి 12 వేల వరకు ఉన్న ఈ ఇళ్లు శాటిలైట్ సిటీలుగా మారబోతున్నాయి. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లోని టిడ్కో ఇళ్లలో 40 వేలకు పైగా యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

అన్ని వసతులతో ఆధునిక ఇళ్లు

చక్కటి రోడ్లు, తాగునీరు, మురుగు కాలువలు, ఇళ్లకు విద్యుత్ సౌకర్యం, ఎస్టీపీలు వంటి సకల వసతులతో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందిస్తుండటం గమనార్హం. ప్రాంతాన్ని బట్టి ఈ గ్రూప్ హౌస్‌లు వెయ్యి నుంచి 12 వేల వరకు ఉన్నాయి. గుడివాడ, నంద్యాల, కర్నూలు, నెల్లూరు యూఎల్బీల పరిధిలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లు 10 వేల నుంచి 12 వేల వరకు ఉండటం విశేషం. ఒక్క నెల్లూరు పరిధిలోనే (అల్లీపురం, వెంకటేశ్వరపురం) రెండుచోట్ల మొత్తం 27 వేల ఇళ్లు నిర్మిస్తున్నారంటే అవి ఎంత పెద్ద స్థాయిలో ఉన్నాయో అంచనా వేయవచ్చు. త్వరలో ఈ ప్రాంతాలు శాటిలైట్ సిటీలుగా మార్చేందుకు కసరత్తు జరుగుతోంది. కాగా, గత నెలలో కొందరు యజమానులు వారికి కేటాయించి ఇళ్లలో చేరగా, వచ్చే నెలలో మంచి ముహూర్తాలు ఉండటంతో మిగిలినవారు చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే మార్చి నాటికి మొత్తం 2.62 లక్షల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేసే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి అవసరాలను తీర్చేందుకు అవసరమైన సిబ్బంది నియామకం, సరఫరా వంటి పనుల కోసం మునిసిపాలిటీల్లోని ఆయా శాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎస్టీపీల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలను తలపిస్తున్న ఈ 163 ప్రాంతాల్లోని ఇళ్ల అంతర్గత నిర్వహణకు నివాసితులతో సంక్షేమ సంఘాలను సైతం ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. ఇక నగరాల పరిధి దాటి పంచాయతీల్లో మరో 38 చోట్ల టిడ్కో ఇళ్లు నిర్మించగా, వాటి అవసరాలను తీర్చేందుకు మునిసిపల్ శాఖ పంచాయతీ విభాగంతో సంప్రదింపులు చేపట్టింది. ఇవన్నీ కొద్దిరోజుల్లో కొలిక్కి రావడంతో పాటు ఆయా కొత్త టిడ్కో పట్టణాల అవసరాలను తీర్చేందుకు మార్గం సుగమం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

ఇళ్లపై కుళ్లు రాజకీయం ఆపండి

- ప్రజలు తిరగబడి తరుముతున్నా బుద్ధి రాదా?
- మంత్రి సురేష్ మండిపాటు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని కూడా రాజకీయం చేయాలని చూసే ప్రతిపక్ష పార్టీలు తమ పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే ప్రజలే తిరగబడి తరుముతారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హెచ్చరించారు. టిడ్కో ఇళ్లపై రాద్ధాంతం చేస్తూ జనసేన పార్టీ చేపట్టిన కార్యక్రమంపై ఆదివారం ఓ ప్రకటనలో మంత్రి మండిపడ్డారు. మంగళగిరిలో టిడ్కో లబ్ధిదారులు జనసేన నేతలను నిలదీసి వెళ్లిపోవాలని చెప్పడమే అక్కడ అన్ని వసతులు సమకూరాయనడానికి నిదర్శనమన్నారు. టిడ్కో ఇళ్లపై రాద్ధాంతం చేసి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులు ఆ పార్టీ నేతలను తరిమికొడతారన్నారు. అన్ని వసతులతో రాష్ట్రంలో ఇప్పటికే 40,576 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించామని, డిసెంబర్ నాటికి మరో 1,10,672 ఇళ్లను పూర్తిచేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా 1,43,600 మంది లబ్ధిదారులకు 300 చ.అ. ఇంటిని కేవలం రూపాయికే తమ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తోందని తెలిపారు. సకల వసతులతో సుందరంగా ఇళ్లను తీర్చిదిద్ది లబ్ధిదారులకు అందజేస్తుంటే, జనసేన తమ రాజకీయ ప్రయోజనాల కోసం దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని, ఇప్పటికైనా కుళ్లు రాజకీయాలు ఆపాలని హితవుపలికారు.

గుంకలాంలో పారని పాచిక



గుంకలాం లేఅవుట్ వద్ద ప్రసంగిస్తున్న పవన్

సాక్షి ప్రతినిధి, విజయనగరం/గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): విజయనగరంలో ఆదివారం జరిపిన పర్యటన పవన్‌కళ్యాణ్‌కు చేదు అనుభవాన్ని మిగిల్చింది. స్వయంగా జగనన్న కాలనీని చూసి అక్కడి లబ్ధిదారులతో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించాలని ఆయన వేసిన పాచిక పారలేదు. 'జగనన్న ఇళ్లు–పేదలకు కన్నీళ్లు' నినాదంతో ఆ కాలనీలపై సోషల్ ఆడిట్ చేస్తామంటూ విజయనగరం శివారు గుంకలాంలోని జగనన్న కాలనీకి మధ్యాహ్నం 1.30కు వచ్చిన పవన్‌కు అక్కడి లబ్ధిదారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం.. సోషల్ ఆడిట్‌కు ఎవరూ హాజరుకాకపోవడంతో ఆయన కేవలం రోడ్‌షోకే పరిమితమయ్యారు. ఫలితంగా దాదాపు రెండు గంటలపాటు విజయనగరం ప్రధాన రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. చివరకు గుంకలాంలో జగనన్న కాలనీకి చేరుకున్నా, అక్కడ లబ్ధిదారులెవరూ లేకపోవడంతో ఒకటీ రెండు ఇళ్లను మాత్రమే పవన్ మొక్కుబడిగా పరిశీలించారు. తర్వాత కొద్దిమంది పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీ నేతలపై ఆరోపణలు చేశారు. యువతను తప్పుదారి పట్టించేలా, రెచ్చగొట్టేలా మాట్లాడారు. 'గడపగడపకు వచ్చే వైఎస్సార్‌సీపీ నాయకులను, పనిచేయని నేతలను చొక్కా పట్టుకుని నిలదీయండి. వాళ్లకూ మనకూ సెపరేటు రక్తం ఏమైనా ఉంటుందా? లక్షల మందిని అరెస్టు చేయగలరా? స్వచ్ఛందంగా జైళ్లను నింపేద్దాం. అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేసి జనసేన జెండాను స్థాపిద్దాం. గుంకలాం జగనన్న కాలనీలో లబ్ధిదారులకు స్థలాలిచ్చేందుకు రైతుల దగ్గర తక్కువ ధరకే కొనుగోలు చేసి ఎకరాకు రూ.30 లక్షల చొప్పున చూపించి రూ.పది వేల కోట్ల నుంచి రూ.15వేల కోట్ల వరకూ దోచేశారు. దీనిపై మోదీకి స్వయంగా నివేదిక అందజేస్తా. మోదీపై అపార గౌరవం ఉన్నవాడిని. నా మీద కేసులు పెట్టినా భయపడను. నేను చాలా బలంగా ఉంటాను. ఓడిపోయిన వాణ్ణి.. గాయపడ్డవాణ్ణి. దెబ్బతిన్న పులిలా నిలబడ్డాను. ప్రజాస్వామ్యం అంటే ఏమిటో చూపిస్తాను. ఓట్లు రాకపోయినా నామినేషన్ వేస్తాం. నామినేషన్లు వేయకుండా ఆపినా.. బెదిరించినా తాటతీస్తాం. పరిశ్రమలు ఎందుకు రావడంలేదని అడగండి. పిచ్చిపిచ్చి సమాధానాలు చెబితే తిరగబడండి. 2024కు వైసీపీ ప్రభుత్వం పోవాలి, జనసేన ప్రభుత్వం రావాలి. బొత్స జేబులో డబ్బులు ఏమీ ఇవ్వడంలేదు. మనం కట్టిన పన్నుల డబ్బులతో పథకాలు పెడుతున్నారు.' అని పవన్ అన్నారు. అనంతరం 3.30 గంటలకు పవన్ విశాఖకు బయల్దేరారు. అక్కడ నుంచి ప్రత్యేక విమానంలో 4.20 గంటలకు హైదరాబాద్ వెళ్లారు.

68 ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులు



పాలవెల్లి రిసార్ట్స్

బిడ్ ఫీజు, అనుభవ అర్హత తగ్గింపు.. నేడు విజయవాడలో ప్రీ బిడ్ సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ప్రకృతి అందాలతో అలరారే రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో పర్యాటకరంగం కొత్త పుంతలు తొక్కేలా సరికొత్త ఆలోచనలతో పర్యాటకశాఖ ముందుకెళ్తోంది. పెట్టుబడుల రాకకు ప్రధాన అవరోధాలుగా ఉన్న నియమ నిబంధనలు మార్చి కొత్తదారుల్ని అన్వేషించింది. రాష్ట్రవ్యాప్తంగా 68 ప్రాంతాల్లో వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్, అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రాజెక్టులకు ప్రాధాన్యమిచ్చేందుకు నిబంధనల్ని మరింత సరళతరం చేసింది. కొత్తగా రాబోతున్న ప్రాజెక్టులకు కనిష్టంగా రూ.20 లక్షల నుంచి గరిష్టంగా రూ.70 లక్షల వరకు మాత్రమే పెట్టుబడులుగా నిర్దేశించింది. వాటర్ స్పోర్ట్స్‌లో బిడ్ వేయాలంటే ఐదేళ్ల అనుభవం ఉండాలనే నిబంధన ఉంది. దీన్ని ఏడాదికి తగ్గించింది. ఒకవేళ ఆసక్తి ఉండి అనుభవం లేని ఎవరైనా పాల్గొనాలని భావిస్తే కన్సార్టియం తీసుకున్నా సరిపోతుంది. టూరిజం ప్రాజెక్టులకు బిడ్ ఫీజును రూ.లక్ష నుంచి రూ.10 వేలకు తగ్గించింది. దీంతోపాటు టెండర్లలో కనీస ఆదాయం వాటా వాటర్ స్పోర్ట్స్‌కు 15 శాతం, అడ్వెంచర్ స్పోర్ట్స్‌కు 25 శాతం, ట్రెక్కింగ్‌కు 10 శాతంగా నిర్ణయించింది. ఇందులో ఎవరు ఎక్కువగా టెండర్లలో కోట్‌చేస్తే వారికి అవకాశం కల్పించేలా నిబంధనల్ని మార్చింది. ఈ నేపథ్యంలో సోమవారం విజయవాడలో ప్రీ బిడ్డింగ్ సమావేశం నిర్వహిస్తోంది. టూరిజం ఎండీ కన్నబాబు ఆధ్వర్యంలో పర్యాటకశాఖ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

పారిశ్రామిక జిల్లాగా అనకాపల్లి

సాక్షి, అనకాపల్లి: పారిశ్రామిక జిల్లాగా అనకాపల్లి అభివృద్ధి చెందుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. అచ్యుతాపురం, అనకాపల్లి రాష్ట్ర ముఖచిత్రంలో పారిశ్రామిక ప్రాంతాలుగా నిలవనున్నాయన్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం పూడిలో 'యమ రిబ్బన్ కంపెనీ' నిర్మాణానికి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యే రమణమూర్తిరాజులతో కలిసి అమర్‌నాథ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చైనాకు చెందిన యమ రిబ్బన్ కంపెనీ సుమారు రూ.300 కోట్ల వ్యయంతో 15.76 ఎకరాల్లో తమ శాఖను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇప్పటికే స్టీల్ ప్లాంట్, హెచ్‌పీసీఎల్, షిప్‌యార్డ్, బీహెచ్‌ఈఎల్ వంటి పరిశ్రమలతో విశాఖ పెద్ద పారిశ్రామిక నగరంగా వెలుగొందుతోందని గుర్తు చేశారు. ఇదే సమయంలో అచ్యుతాపురం సెజ్‌లో మరిన్ని పరిశ్రమలు కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయంటే.. పారిశ్రామిక ప్రగతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకుంటున్న నిర్ణయాలే కారణమన్నారు. యమ రిబ్బన్ కంపెనీ ద్వారా సుమారు రెండు వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఇందులో అధిక సంఖ్యలో మహిళలకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు.

అందుబాటులో 25 వేల ఎకరాల భూమి..

విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు సముద్ర తీర ప్రాంతంలో అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి, తుని, కాకినాడ వరకు పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. ఇప్పటికే 25 వేల ఎకరాల పారిశ్రామిక భూమి అందుబాటులో ఉందన్నారు. ఎన్ని పరిశ్రమలు వచ్చినా వాటికి భూమి కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. యలమంచిలి నియోజకవర్గం పూడిమడకలో త్వరలోనే ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేస్తారన్నారు. అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ తమ ప్రభుత్వం గత మూడేళ్ల నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీని నంబర్‌వన్ స్థానంలో నిలిపిందని తెలిపారు. టెక్స్‌టైల్స్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ యమ రిబ్బన్ కంపెనీ ద్వారా 2వేల మందికి ప్రత్యక్షంగా, మరో 2వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తామన్నారు. చైనా జనరల్ కాన్సులేట్ జాలియో మాట్లాడుతూ కంపెనీ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, న్యూఢిల్లీలో చైనా ఎంబసీ కార్యదర్శులు యు యాంగ్ డబ్ల్యు జూన్ నిమి, ఏపీఐఐసీ జెడ్‌ఎం త్రినాథ్‌రావు, చైనా జనరల్ కాన్సులేట్ (కోల్‌కతా) జాలియు, యమ రిబ్బన్ కంపెనీ ఇండియన్ డైరెక్టర్ శివప్రసాద్, మేనేజర్లు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌పీసీ సూచనల మేరకు పోలవరం పనులు

- ఈ సీజన్‌లో పనులు ముమ్మరం చేస్తాం
- జలవనరులశాఖ మంత్రి అంబటి



పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టులోని డయాఫ్రమ్ వాల్ పరిస్థితిని నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) వారు పరిశీలించిన అనంతరం వారి సూచనల మేరకు పనుల్లో ముందుకెళతామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఆయన ఆదివారం పోలవరం ప్రాజెక్టు అప్పర్, లోయర్ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్, గ్యాప్–1 పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు సైట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం గోదావరి నదికి వరద తగ్గుముఖం పట్టిందని, ఈ సీజన్‌లో ప్రాజెక్టు పనులు ముమ్మరంగా చేపట్టాలని భావిస్తున్నామని, ఏజెన్సీ వారు సర్వసన్నద్ధంగా ఉన్నారని తెలిపారు. ఉన్న ఇబ్బందల్లా డయాఫ్రమ్ వాల్ స్థితిగతులు తెలుసుకోవడమేనన్నారు. ఎన్‌హెచ్‌పీసీ వారు డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలించి నివేదిక ఇచ్చిన తర్వాత వారి సూచనల మేరకే పనులు చేపట్టాల్సి ఉంటుందని, వారి సూచనలు లేకుండా పనులు చేపట్టలేమని స్పష్టం చేశారు. వారు వచ్చి పరిశీలించడానికి డయాఫ్రమ్ వాల్ పూర్తిగా నీటిలో మునిగి ఉందని, ఆ నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడుతున్నామని చెప్పారు. త్వరలోనే డయాఫ్రమ్ వాల్ స్థితిగతులు తెలుస్తాయని తెలిపారు. ప్రస్తుతం లోయర్ కాఫర్ డ్యామ్ పనులు ప్రారంభించామన్నారు. మంత్రి వెంట జలవనరుల శాఖ ఎస్ఈ నరసింహమూర్తి, ఈఈ సుధాకర్, మెగా సంస్థ ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

పారిశ్రామికవేత్తలే ప్రచారకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపన, ప్రారంభోత్సవాల సందర్భంగా పరిశ్రమలు నెలకొల్పిన దిగ్గజాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు నూతన పెట్టుబడులను రప్పించేందుకు చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

పునాది సమయంలోనే విస్తరణ ప్రణాళికలు..

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహక విధానాన్ని మెచ్చి దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఆదిత్య బిర్లా, టాటా, ఐటీసీ, టెక్ మహీంద్రా, డిక్సన్, సెంచురీ ప్లై, అపాచీ ఫుట్‌వేర్, ఏటీజీ టైర్స్, రామ్‌కో, శ్రీ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్, అరబిందో, బ్లూస్టార్, హావెల్స్ లాంటి పలు సంస్థలు పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ఆదిత్య బిర్లా, ఐటీసీ గత ఏడాది కాలంలో రాష్ట్రంలో రెండేసి యూనిట్లు ఏర్పాటు చేయడమే కాకుండా విస్తరణ కార్యక్రమాలను కూడా చేపడుతున్నాయి. ఏటీజీ టైర్స్, సెంచురీ ప్లైవుడ్స్ లాంటి సంస్థలైతే ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తున్న వేగాన్ని చూసి పునాది సమయంలోనే విస్తరణ ప్రణాళికలను ప్రకటించాయి. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలకు నిదర్శనం. పూర్తిగా పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ప్రకటించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకుల్లో వరుసగా మూడో ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం ఇందుకు తార్కాణం. ఇటీవల రాష్ట్రంలో వివిధ ప్రతిష్టాత్మక యూనిట్ల ప్రారంభం, శంకుస్థాపన సందర్భంగా ఆయా సంస్థల అధినేతలు, ప్రతినిధులు ఏమన్నారో చూద్దాం..

రెండు నెలల్లో రెండు యూనిట్లు



ఏపీ కొత్తగా భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూపు రెండు నెలల్లో రెండు యూనిట్లు ఏర్పాటు చేయడమే దీనికి నిదర్శనం. రెండు నెలల క్రితం వైఎస్ఆర్ జిల్లాలో గార్మెంట్స్ తయారీ యూనిట్‌కు భూమి పూజ చేశాం. ఇప్పుడు తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురంలో కాస్టిక్‌సోడా యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. మా గ్రూపు సంస్థలకు ఆంధ్రప్రదేశ్ చాలా కీలకం. ఇప్పటికే ఆరు వ్యాపారాలకు సంబంధించి రెండు బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాం. వీటి ద్వారా 10,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే సత్తా రాష్ట్రానికి ఉంది.

– బలభద్రపురంలో క్లోర్ అల్కాలి (కాస్టిక్ సోడా) యూనిట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదిత్య బిర్లా గ్రూపు చైర్మన్ కుమార్ మంగళం బిర్లా

అర నిమిషంలోనే ఒప్పించారు..



మే నెలలో సీఎం వైఎస్ జగన్‌ను కలసి 30 సెకన్లు మాత్రమే మాట్లాడాను. ఎమర్జింగ్ టెక్నాలజీని ఏపీకి తేవడంలో సహకరించాలని సీఎం కోరారు. ఈ సందర్భంగా మా అబ్బాయి బయోఇథనాల్ ప్లాంట్ స్థాపనకు వివిధ రాష్ట్రాలను పరిశీలిస్తున్న విషయం చెప్పా. ఎక్కడో ఎందుకు? మా రాష్ట్రంలో పెట్టండి అని సీఎం ఆహ్వానించారు. ఏపీలో బయో ఇథనాల్ పాలసీ లేదని ఆయన దృష్టికి తేవడంతో యూనిట్ ప్రారంభమయ్యే సరికి రూపొందిస్తామని భరోసా ఇచ్చారు. ఇది జరిగిన ఆరు నెలల్లోనే రాజమహేంద్రవరంలో యూనిట్‌కు శంకుస్థాపన చేశాం. ఇలా మా అబ్బాయి ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడం గర్వకారణంగా ఉంది.

– అస్సాగో బయో ఇథనాల్ ప్లాంట్ ప్రారంభోత్సవ సభలో సీపీ గుర్నానీ, సీఈవో, టెక్ మహీంద్రా

పెట్టుబడుల ఆకర్షణలో ఫస్ట్



దేశ జీడీపీ వృద్ధి రేటులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండటమే కాకుండా అత్యధిక పెట్టుబడులను ఆకర్షిస్తున్న రాష్ట్రంగా రికార్డు సృష్టిస్తోంది. సామాజిక ఆర్థికాభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు చాలామందికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇటీవల గుంటూరులో వెల్‌కమ్ ఫైవ్‌స్టార్ హోటల్‌ను శరవేగంగా ప్రారంభించాం. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద సుగంధ ద్రవ్యాల పార్క్‌ను ప్రారంభిస్తున్నాం. ఇవన్నీ పరిశీలిస్తుంటే సులభతర వాణిజ్య ర్యాంకుల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండటం ఎటువంటి ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు.

– యడ్లపాడులో ఐటీసీ గ్లోబల్ స్పైసెస్ పార్క్ ప్రారంభోత్సవ సదస్సులో సంస్థ సీఈవో సంజయ్ పూరి

అత్యుత్తమ ఈఎంసీ కొప్పర్తి



కేవలం తొమ్మిది నెలల్లోనే అభివృద్ధి చేసిన వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ దేశంలోనే అత్యుత్తమ ఈఎంసీగా నిలుస్తుంది. ఇక్కడి యూనిట్ ద్వారా శామ్‌సంగ్, బాష్, షావోమి లాంటి పలు ప్రముఖ సంస్థలకు చెందిన ఎలక్ట్రానిక్ ఉపకరణాలను ఉత్పత్తి చేస్తాం. రావాలి జగన్.. కావాలి జగన్.. అనే నినాదం రాష్ట్రమంతా మారుమోగింది. ఇప్పుడు ఆ నినాదం జగన్ వచ్చారు... అభివృద్ధి తెచ్చారుగా మారింది

– కొప్పర్తిలో ఏఐఎల్ డిక్సన్ యూనిట్ భూమిపూజ కార్యక్రమంలో డిక్సన్ ప్రెసిడెంట్, సీవోవో పంకజ్‌శర్మ

రూ.6 వేల కోట్ల నుంచి రూ.26 వేల కోట్లకు..



తొలుత తమిళనాడులో యూనిట్ ఏర్పాటు చేయాలనుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో వైఎస్సార్ జిల్లా బద్వేల్‌లో యూనిట్ నెలకొల్పుతున్నాం. పెట్టుబడుల ప్రతిపాదనలు అందజేసిన రెండు నెలల్లోనే అన్ని అనుమతులను మంజూరు చేశారు. ప్రభుత్వ సహకారాన్ని చూశాక రూ.6,000 కోట్ల పెట్టుబడులను రూ.26,000 కోట్లకు పెంచాలని నిర్ణయించుకున్నాం.

– బద్వేల్‌లో సెంచురీ ప్లైవుడ్ కంపెనీ చైర్మన్ సజ్జన్ భజాంక

పారిశ్రామికవేత్తల మనోగతమే మాకు బ్రాండింగ్



రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ కోసం ప్రత్యేకంగా బ్రాండింగ్ అవసరం లేదు. ముఖ్యమంత్రి జగన్‌కు ఉన్న ప్రజాదరణే అతి పెద్ద బ్రాండింగ్. రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న దిగ్గజ సంస్థల అభిప్రాయాలనే వచ్చే మార్చిలో విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు బ్రాండింగ్‌గా వినియోగించుకుంటాం. 100 శాతం పారిశ్రామికవేత్తల అభిప్రాయాల ఆధారంగా ప్రకటించిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ మూడేళ్లుగా మొదటి స్థానంలో నిలవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.

– గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమలు, పెట్టుబడులు, ఐటీ శాఖ మంత్రి

పేదల ఇళ్లతో పవన్ నీచ రాజకీయాలు


- చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇళ్ల పరిశీలన డ్రామాలు
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: పేదలకు మంజూరు చేసిన ఇళ్లతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నీచ రాజకీయాలు చేయడం చూసి రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కేఎంపాలెంలో పంచాయతీ శివారు యండపల్లిపాలెంలో జగనన్న లే ఔట్‌లో ఇళ్ల నిర్మాణాలను ఆదివారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో 30.25 లక్షల ఇళ్ల పట్టాలు మంజూరు చేశారని, వీటిలో 21.25 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. లక్షలు విలువ చేసే ఆస్తిని అక్కచెల్లెమ్మల పేరిట అందజేసి సీఎం జగన్ వారి జీవితాల్లో వెలుగు నింపుతున్నారన్నారు. కళ్లెదుటే రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలో యజ్ఞంలా ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటే పవన్ కళ్యాణ్ లబ్ధిదారులను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్‌కళ్యాణ్ ఇళ్ల నిర్మాణాల పరిశీలన పేరిట డ్రామాలకు తెరలేపారని ధ్వజమెత్తారు. జగనన్న కాలనీల్లో ఏకంగా ఊళ్లే నిర్మితమవుతున్నాయని, ఇవి నిర్మాణం పూర్తయితే తమ అడ్రస్ గల్లంతవుతుందనే భయంతోనే పేదల ఇళ్లను అడ్డుకునేందుకు చంద్రబాబుతో కలిసి పవన్ కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ డ్రామాలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. పవన్ పిచ్చి చేష్టలను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

నేటి భవితలో..

- నిఫ్ట్ 2023: కెరీర్ షైనింగ్..ఫ్యాషన్ డిజైనింగ్: నేడు ఫ్యాషన్ రంగం వేగంగా విస్తరిస్తోంది. ఫ్యాషన్ రంగంలో ఎవర్‌గ్రీన్ కెరీర్స్‌ను సొంతం చేసుకోవాలంటే.. ప్రత్యేక నైపుణ్యాలు అవసరం!వాటిని అందించేవే.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) క్యాంపస్‌లు! బ్యాచిలర్, పీజీ, డాక్టోరల్ స్థాయి కోర్సులను అందిస్తున్న నిఫ్ట్.. 2023–24లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో..నిఫ్ట్ ప్రవేశ ప్రక్రియ, అందుబాటులో ఉన్న క్యాంపస్‌లు, కోర్సులు.. ఎంపిక విధానం, కెరీర్ అవకాశాలు తదితర అంశాలపై విశ్లేషణ..
- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం– కరెంట్ అఫైర్స్: జాతీయం, అంతర్జాతీయం, రాష్ట్రీయం, వర్తమాన అంశాలు, క్రీడలు, వార్తల్లో వ్యక్తులు తదితర వివరాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండ్ అప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



అందమైనది, మంచిది అనుకునే మాయ
ఎంత పరిపూర్ణమోనని ఆశ్చర్యం కలుగుతుంది.
– లియో టాల్‌స్టాయ్

సాక్షి
సోమవారం, నవంబర్, 14

అక్షరాల రెక్కలనిద్దాం!

బాల్యంలోనే పిల్లల ఊహలకు రెక్కలొస్తాయి. ఆట పాటలతో గడిపే పిల్లలకు ఆటవిడుపుగా కథలు చెప్పాలి. పాటలు పాడించాలి. బొమ్మలు గీయాలని ఉబలాటపడే చిట్టి చేతులకు పెన్సిళ్లు, రంగులు, కాగితాలు అందివ్వాలి. వాళ్ల లేత భుజాల మీద చదువుల భారాన్ని తగ్గించాలి. విజ్ఞానాన్ని వినోదాత్మకంగా పెంపొందించు కోవడానికి ఉపయోగపడే సాధనం బాలసాహిత్యం. పిల్లలకు ప్రత్యేకమైన సాహిత్యం ఉండాల్సిన అవసరాన్ని పాశ్చాత్య ప్రపంచం పద్దెనిమిదో శతాబ్ది నాటికి గాని గుర్తించలేదు. మన దేశం పిల్లలకు ప్రత్యేకమైన సాహిత్యాన్ని క్రీస్తుశకం తొలి సహస్రాబ్ది ప్రారంభంలోనే సృష్టించింది. విష్ణుశర్మ 'పంచతంత్ర' ద్వారా పిల్లలను ఆకట్టుకునే కథలు రాశాడు.

విష్ణుశర్మ రాసిన 'పంచతంత్ర' కథలలో ఎక్కువగా జంతువులు, పక్షులే ప్రధాన పాత్రలు. ఇందులోని కథలేవీ పుక్కిటి పురాణాలు కావు. ఇందులోని కథలు పిల్లల ఆలోచనలకు పదును పెడతాయి. వారికి లోకం పోకడను అవగతం చేస్తాయి. 'పంచతంత్ర' కథలు పిల్లలను మాత్రమే కాదు, పెద్దలనూ ఆకట్టుకుంటాయి. 'పిల్లల పుస్తకాన్ని మీరు పిల్లల కోసం మాత్రమే రాసేటట్లయితే, మీరు విఫలమైనట్లే' అని అమెరికన్ రచయిత, సినీ దర్శకుడు డాన్ రాఫ్ నిర్మొహమాటంగా తేల్చిచెప్పాడు. సార్వజనీనతే ఉత్తమ బాలసాహిత్యానికి గీటురాయి.

ఒకప్పుడు తెలుగులో విరివిగా బాలల పత్రికలు ఉండేవి. రేడియోలో బాలల కార్యక్రమాలు వచ్చేవి. టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లు లేనిరోజుల్లో పిల్లలకు వాటితోనే చక్కని కాలక్షేపం జరిగేది. చక్రపాణి, నాగిరెడ్డి ప్రారంభించిన 'చందమామ' దాదాపు ఆరున్నర దశాబ్దాలు ఆబాల గోపాలాన్నీ అలరించింది. 'చందమామ' తెలుగు సహా పదకొండు భాషలలో ప్రచురితమయ్యేది. అగ్రశ్రేణి రచయిత కొడవటిగంటి కుటుంబరావు దాదాపు మూడు దశాబ్దాల పాటు 'చందమామ'కు సంపాదకుడిగా వ్యవహరించి, 'చందమామ'ను భారతీయ బాలల పత్రికల్లోనే ధ్రువతారగా తీర్చిదిద్దారు. 'చందమామ' ప్రచురణ నిలిచిపోయినా, పాత సంచికలన్నీ ఇంట ర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. పెద్దలుగా ఎదిగిన తర్వాత కూడా కొందరు మనసులో బాల్యాన్ని నింపుకొనే ఉంటారు. బహుశా అలాంటి వాళ్లను గురించే 'పెద్దలు కాలం చెల్లిన పిల్లలు' అని అమెరికన్ బాలల రచయిత డాక్టర్ సూస్ చమత్కరించాడు. 'చందమామ' పాత సంచికలను ఇప్పటికీ ఇష్టంగా చదువుకునే కాలం చెల్లిన పిల్లలు చాలామందే ఉన్నారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో బాలసాహిత్యానికి పంతొమ్మిదో శతాబ్దిలోనే పునాదులు పడ్డాయి. రావిపాటి గురుమూర్తి 1834లో 'పంచతంత్ర కథలు' సంస్కృతం నుంచి అనువదించారు. ఆ తర్వాతి కాలంలో 'పంచతంత్ర' కథలకు తెలుగులో దాదాపు అరడజను అనువాదాలు వెలువడ్డాయి. పూడూరి సీతారామశాస్త్రి 1845లో 'పెద్దబాలశిక్ష'ను తొలిసారిగా ప్రచురించారు. ఆయనే 1856లో పిల్లల కోసం 'నీతి కథలు–చిత్ర కథలు' ప్రచురించారు. 'జనవినోదిని' పత్రిక 1884లో పిల్లల పాటలను ప్రచురించింది. 'వివేకవతి' పత్రిక 1908 నుంచి పిల్లల రచనలను ప్రచురించేది. ఆనాటి సుప్రసిద్ధ రచయితల్లో దాదాపు అందరూ బాలల కోసం ప్రత్యేకమైన రచనలు చేశారు. కందుకూరి వీరేశలింగం 'నీతికథామంజరి' రాశారు. గిడుగు సీతాపతి పిల్లల కోసం 'చిలకమ్మ పెండ్లి', 'రైలుబండి పాటలు' రాశారు. వేంకట పార్వతీశ కవులు 'బాలగీతావళి' రాశారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, అడివి బాపిరాజు, వావిలికొలను సుబ్బారావు, చింతా దీక్షితులు వంటి సుప్రసిద్ధులు బాలల సాహిత్యాన్ని సృష్టించారు. 'భారతి', 'గృహలక్ష్మి', 'ఆంధ్రభూమి' వంటి పత్రికలు బాల సాహిత్యానికి చెందిన రచనలను కూడా ప్రచురించేవి. తొలి బాలల పత్రిక 'బాలకేసరి' 1940లో ప్రారంభమైంది. దానికి ఏడాది ముందే– 1939లో మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుంచి న్యాపతి రాఘవరావు బాలల కార్యక్రమాలను ప్రారంభించారు. తెలుగు బాలసాహిత్యంలో ఇవన్నీ ముఖ్యమైన మైలురాళ్లు. తెలుగులో బాలల సాహిత్యానికి ఆనాటి కాలం స్వర్ణయుగం అని చెప్పుకోవచ్చు. ఇరవై ఒకటో శతాబ్ది మొదలయ్యాక తెలుగు బాలల పత్రికలు ఒక్కొక్కటే కనుమరుగవడం మొదలైంది. ఇంగ్లిష్, హిందీ సహా మిగిలిన పలు ప్రధాన భారతీయ భాషల్లో బాలల పత్రికలు ఇంకా ప్రచురితమవుతున్నా, తెలుగులో మాత్రమే కొంత భిన్నమైన పరిస్థితి కనిపిస్తుంది. తెలుగులో ప్రధాన దినపత్రికల ఆదివారం అనుబంధాలకు మాత్రమే ప్రస్తుతం బాలసాహిత్యం పరిమితమవుతోంది. జనాదరణ గల బాలల పత్రిక తెలుగులో ఒక్కటైనా ప్రస్తుతం మనుగడలో లేకపోవడం దురదృష్టకర పరిణామం. ఇంతటి గడ్డు పరిస్థితుల్లోనూ కేవలం బాలల కోసమే ప్రత్యేకంగా రచనలు సాగిస్తున్న రచయితలు ఇంకా ఉండటమే విశేషం.

కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీలు ఏటేటా బాల సాహితీవేత్తలకు కూడా అవార్డులు అందిస్తున్నాయి. అయితే, బాల సాహిత్యాన్ని ప్రత్యేకంగా వ్యాప్తిలోకి తెచ్చేందుకు తగినంత చొరవ తీసుకోవడంలో మాత్రం విఫలమవుతున్నాయి. 'బాల సాహిత్యాన్ని తక్కువ ధరకు అందించాలి. ప్రచురణలకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. పుస్తకం ఆకర్షణీయంగా ఉండాలి' అని కొడవటిగంటి కుటుంబరావు చెప్పిన మాటలను ప్రభుత్వాలు కాస్త పట్టించుకుంటే బాగుంటుంది. రేపటి పౌరులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దాలంటే, వారికి తగిన సాహిత్యాన్ని విరివిగా అందుబాటులోకి తేవడం, ఆ సాహిత్యాన్ని ఆసక్తిగా చదివేలా వారిని ప్రోత్సహించడమే సరైన మార్గం. ఇదంతా కాలం చెల్లిన పిల్లలు తప్పనిసరిగా నెరవేర్చాల్సిన బాధ్యత.

ఎల్లో ఎజెండాకు లిక్కర్ కిక్కు

రాష్ట్రంలో డిస్టిలరీలన్నిటికీ అనుమతులిచ్చింది చంద్రబాబు ప్రభుత్వమే

- ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్కటంటే ఒక్క డిస్టిలరీకీ అనుమతివ్వలేదు
- మొత్తం 20లో 14 డిస్టిలరీలు ఏర్పాటు చేసింది కూడా బాబు హయాంలోనే
- పదేపదే అదాన్ డిస్టిలరీస్ పేరు... దాన్ని ఏర్పాటు చేసిందే అయ్యన్న పాత్రుడు
- రాష్ట్రంలో విక్రయించిన మద్యంలో అదాన్ నుంచి కొన్నది కేవలం 1.55 శాతం
- ఈ వాస్తవాలను ప్రస్తావించకుండా 'వేల కోట్లు' అంటూ ఎల్లో ఆరోపణలు
- తాజా ఘటనలపై విజయసాయిరెడ్డి చెప్పిన నిజానిజాలివిగో...




మీడియా మారింది. జనానికి నిమిషాల్లో నిజాలు తెలుస్తున్నాయి. అయినా సరే... చంద్రబాబు ముఠాది పాత స్కీమే. తమ వ్యతిరేకులకు సంబంధించి నోటికొచ్చిన ఆరోపణలు చేయటం... అవన్నీ నిజాలైనట్లుగా పతాక శీర్షికల్లో ప్రచురించటం... వాటిని ప్రచారంలో పెట్టడం!!. అరబిందో ఫార్మా డైరెక్టరు శరత్ చంద్రారెడ్డి ఢిల్లీలో అరెస్టయిన నాటి నుంచీ ఈ ఎల్లో ముఠాలకు పట్టపగ్గాల్లేకుండా పోయాయి. ఆ సంఘటనకు లేని లింకులు పెడుతూ... ఏపీ ప్రభుత్వాన్ని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పక్ష నేత వి.విజయసాయి రెడ్డిని లక్ష్యంగా చేసుకుని నోటికొచ్చిన ఆరోపణలకు దిగుతున్నారు. ఎద్దు ఈనిందంటే... దూడను కట్టేయమన్న చందంగా... అన్ని వేలకోట్లు, ఇన్ని వేల కోట్లు అంటూ చెలరేగిపోతున్నారు. ఈ ఎల్లో అరాచకాలపై విజయసాయిరెడ్డి వాస్తవాలను వెల్లడించారు. దుష్టచతుష్టయం ఎందుకిలా చెలరేగిపోతున్నదో... విశాఖ విషయంలోనూ ఎందుకు రోజూ విషం గక్కుతోందో నిజానిజాలు ఆయన మాటల్లోనే...

అరబిందో ఫార్మాది 36 ఏళ్ల చరిత్ర. అంచెలంచెలుగా ఎదుగుతూ ఈ దేశంలోని ఫార్మా కంపెనీల్లో టాప్–2 స్థాయికి చేరుకుంది. ఏడాదికి 2,600 కోట్లకు పైగా నికరలాభాన్ని ఆర్జిస్తున్న దిగ్గజ సంస్థ. ఇలాంటి సంస్థలు ఏ రాష్ట్రంలో ఇన్వెస్ట్ చేసినా... ఇతర పెట్టుబడిదారులు ముందుకొస్తారు. అందుకే అవుకు, శింగనమల ప్రాంతాల్లో 800 మెగావాట్ల చొప్పున రెండు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థకు అప్పగించింది. రాష్ట్రంలో అరబిందోకు ఇప్పటికే రెండు ప్లాంట్లు ఉండగా... 2000 కోట్లతో తొలిసారి భారతదేశంలో పెన్సిలిన్–జిను ఉత్పత్తి చేసే ప్లాంటును కాకినాడ సెజ్‌లో ఏర్పాటు చేస్తోంది. 2024లో ఈ ప్లాంటులో ఉత్పత్తి మొదలు కావచ్చునని సంస్థ ప్రకటించింది. ఇతర రంగాల్లోనూ వేగంగా విస్తరిస్తున్న ఈ సంస్థకు పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టులిస్తే తప్పేంటి? దీనివల్ల రాష్ట్రానికి లాభమే కదా? ప్రాజెక్టు కోసం ప్రభుత్వ స్థలమిస్తే దానికి లీజు చెల్లిస్తారు. ప్రయివేటు స్థలాలైతే కొనుక్కుంటున్నారు. పైపెచ్చు ప్రతి మెగావాట్‌కు ఏడాదికి లక్ష రూపాయల చొప్పున ప్రతి ఫలాన్ని ప్రభుత్వానికి కంపెనీయే చెల్లిస్తుంది. విద్యుత్‌కు అత్యధిక డిమాండ్– అతి తక్కువ డిమాండ్ ఉన్నపుడు ఈ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు దాన్ని బ్యాలెన్స్ చేస్తాయి. దీనివల్ల గ్రిడ్ స్థిరంగా ఉంటుంది. ఇలా ఏ రకంగా చూసినా రాష్ట్రానికి మంచిదే కదా?

ఆంధ్రప్రదేశ్‌కు ఏం సంబంధం?

అరబిందో అనేది ప్రధానంగా వ్యాపార సంస్థ. దాదాపు ప్రపంచమంతటా దీని ఫార్మా వ్యాపారం విస్తరించి ఉంది. ఇతర వ్యాపారాల్లోనూ ఉంది. ఢిల్లీలో మద్యం సరఫరాకు టెండర్లు పిలిస్తే ఈ సంస్థ కూడా పాల్గొంది. అది తప్పేమీ కాదు కదా? టెండర్లు ఖరారయ్యాక కొన్ని నిబంధనల్లో సడలింపు ఇచ్చారనే ఆరోపణలు ప్రధానంగా ఢిల్లీ ప్రభుత్వానికి– కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవి. కొంత మేర తెలంగాణ ప్రభుత్వంపైనా ఆరోపణలొచ్చాయి. మరి ఆంధ్రప్రదేశ్‌కు ఏం సంబంధం? కనీసం ఏపీ పేరును సీబీఐ గానీ, ఈడీ గానీ ఎక్కడా మాటమాత్రంగానైనా ప్రస్తావించలేదు కదా? మరి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏం సంబంధం? విజయసాయిరెడ్డి అల్లుడి సోదరుడిని కంపెనీ ప్రతినిధిగా అరెస్టు చేసి ఉండొచ్చు. దాంతో విజయసాయి రెడ్డికి ఏం సంబంధం? ఏ కాస్త ఇంగిత జ్ఞానం ఉన్నవారైనా ఇవన్నీ ఆలోచిస్తారు కదా? అలాకాకుండా ప్రతిరోజూ తెలుగు దేశం నేతలు పనిగట్టుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, విజయసాయిరెడ్డిని దీన్లోకి లాగుతూ... వేల కోట్లంటూ పసలేని ఆరోపణలు చేయటం సమంజసమా? దాన్నో ఉద్యమం మాదిరి ప్రచురిస్తున్న రామోజీరావు ఇంకెంత కిందికి దిగజారిపోతారు? ఒక పత్రికగా మీ బాధ్యత మీకు ఉండక్కర్లేదా?



చంద్రబాబుతో సంబంధం ఉన్నట్టేగా?

ఇదే అరబిందో గ్రూపును అభ్యర్థించి వారి భాగస్వామ్యంతో చంద్రబాబు నాయుడు తాను ముఖ్యమంత్రిగా ఉండగా 2000వ సంవత్సరంలో తన కుటుంబీకుల చేత ఆంధ్రా ఆర్గానిక్స్ పెట్టించారు. మరి అరబిందో ఫార్మాతో చంద్రబాబుకు సంబంధం ఉన్నట్టేగా? ఇవెక్కడి తలతిక్క ఆరోపణలు? బోడిగుండుకూ మోకాలికీ ముడిపెట్టిన చందాన ఏ వ్యవహారంలోనైనా పదేపదే అదాన్ డిస్టిలరీస్ పేరు తెరపైకి తెస్తోంది ఈ పచ్చ ముఠా. అసలు ఈ అదాన్ డిస్టిలరీస్ ఎవరిది? దీన్ని ఏర్పాటు చేసింది అయ్యన్న పాత్రుడు కాదా? అసలు రాష్ట్రంలో మద్యం సరఫరా చేయటానికి అనుమతి ఇస్తూ 20 డిస్టిలరీలను ప్యానెల్‌లో చేరిస్తే... అందులో ఒక్కటంటే ఒక్కటైనా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏర్పాటయినది ఉందా? అందులో ఒక్క కంపెనీనైనా ఈ ప్రభుత్వం ప్యానెల్‌లో చేర్చిందా? అవన్నీ అప్పటికే ఏర్పాటయినవి కదా? చంద్రబాబు ప్రభుత్వమే ప్యానెల్‌లో చేర్చింది కదా? పెపెచ్చు ఆ 20 డిస్టిలరీల్లో 14 డిస్టిలరీలు చంద్రబాబు హయాంలోనే ఏర్పాటయ్యాయి. అంటే వాటన్నిటి వెనకా చంద్రబాబు నాయుడి హస్తం ఉన్నట్టే కదా? తాను అధికారంలోంచి దిగిపోతూ కూడా ఈ డిస్టిలరీలపై ప్రేమ చావక బోలెడన్ని బ్రాండ్లకు అనుమతిస్తూ దిగిపోయాడు. ఇప్పుడేమో ఆ బ్రాండ్లను ఈ ప్రభుత్వానికి అంటగడుతూ తెలుగుదేశం నేతలు నోటికొచ్చిన ఆరోపణలు చేస్తున్నారు. ఇదెక్కడి దుర్మార్గం? మీడియా మీ చేతుల్లో ఉన్నంత మాత్రాన అబద్ధాలు నిజమైపోతాయా రామోజీరావు?

ముడుపులన్నీ చంద్రబాబుకేగా?

డిస్టిలరీలకు లైసెన్సులిచ్చి, వాటిని ఏర్పాటు చేశాక... వాటి నుంచి ప్రభుత్వం మద్యం కొనేందుకు వీలుగా వాటిని ప్యానెల్‌లో పెట్టిన చంద్రబాబుకు ముడుపులిస్తారా? లేకపోతే వాటినే కొనసాగిస్తున్న వై.ఎస్.జగన్ ప్రభుత్వానికి ముడుపులిస్తారా? ఇది తెలిసి కూడా తెలుగుదేశం నేతలు రోజూ నోటికి వచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారంటే ఏమనుకోవాలి? అదాన్ డిస్టిలరీస్ అనేది అయ్యన్న పాత్రుడికి సంబంధించిన సంస్థ అనే విషయాన్ని రాయరెందుకు రామోజీ? ఆ విషయాన్ని తెలుగుదేశం కూడా ఎప్పుడూ ప్రస్తావించదెందుకు?

■ ఇక ఆంధ్రప్రదేశ్ బ్రూవరీస్ సంస్థ ఈ మూడున్నరేళ్లలో 70,000 కోట్ల విలువైన మద్యాన్ని వివిధ డిస్టిలరీస్ నుంచి కొనుగోలు చేసింది. అందులో అదాన్ వాటా 1,100 కోట్లు. అంటే దాదాపు 1.55 శాతం. నిండా 2 కూడా లేదు. వీళ్లద్వారా ఇంత తక్కువ మద్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారన్న విషయాన్ని ఎప్పుడూ ఎందుకు ప్రస్తావించరెందుకు? మొత్తం మద్యాన్ని ఈ కంపెనీ నుంచే కొన్నట్టు పదేపదే ఈ పేరు తీస్తూ చెలరేగిపోతున్నారెందుకు? అబద్ధాలతో ఎన్నాళ్లని నమ్మించగలరు? మీకు అర్ధసత్యాలు, అసత్యాలు తప్ప వాస్తవాలు అక్కర్లేదా? ఎన్నాళ్లిలా జనాన్ని మోసం చేస్తారు? 'ఈనాడు' అంటేనే వక్రీకరణ. ఎల్లో మీడియా అంటేనే అబద్ధాల పుట్ట. ఎన్ని సార్లు రాసినా... టీడీపీ ఆరోపణల్ని ఎంత మోసినా ఇవే కదా? ఇంత వయసు మీదపడ్డా... మీరు మారరా రామోజీ?

■ నిజం చెప్పాలంటే ఈ దుష్టచతుష్టయం ఒక డీపీటీ బ్యాచ్. అంటే దోచుకో–పంచుకో– తినుకో అనే సూత్రాన్ని అక్షరాలా తమ హయాంలో అమలు చేసి చూపించిన గజదొంగల ముఠా. గతంలో ఎవరి వాటా వారికి అందింది. కాబట్టి ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్. ఒక్క వార్తా రాయలేదు. ఇప్పుడు ప్రశ్నించడానికి బయలుదేరిన దత్తపుత్రుడు నాడు ఒక్క ప్రశ్నా వేయలేదు. ఇప్పుడు అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. వాళ్ల వాటాలు ఆగిపోయాయి. అందుకే ఈ గజదొంగల ముఠా కడుపు మండుతోంది. అందుకే గంటకో ఆరోపణ. పూటకో వేషం. రోజుకో నాటకం!. వీటన్నిటి గురించీ ఫిలిం సిటీ కొండమీద కట్టుకున్న కోటలో రామోజీరావు– చంద్రబాబు మంతనాలు. అవేమైనా రాజకోట రహస్యాలా? రాజకీయ వ్యభిచారపుటెత్తులే కదా?



విశాఖలో కబ్జాలకు కేరాఫ్ రామోజీ, టీడీపీ

అంతా మీకు నచ్చినట్లే... మీరు అనుకున్నట్లే జరగాలంటే ఎలా రామోజీరావు? మీరు మహా భూ కుంభకోణానికి స్కెచ్ వేసిన అమరావతి నాటకం కొనసాగనివ్వలేదని... విశాఖపై విషం కక్కుతారా? అసలు విశాఖలో కబ్జాలకు శ్రీకారం చుట్టిందెవరు? విశాఖ నగరానికి అక్షర ఫ్యాక్షనిజాన్ని నేర్పించింది రామోజీరావు కాదా? లీజు స్థలాన్ని కాజేయాలనే దుర్బుద్ధితో స్థల యజమానుల్ని న్యాయ స్థానాలకు ఈడ్చింది రామోజీరావు కాదా? తనది కాకపోయినా లీజు స్థలాన్ని ప్రభుత్వానికిచ్చి, పరిహారంగా వచ్చిన స్థలాన్ని తన కొడుకు కిరణ్ పేరిట కాజేసిన చరిత్ర ఆయనది కాదా? దీనికోసం ఏకంగా దొంగ సంతకాలు పెట్టి, ఇతరుల సంతకాలను సైతం ఫోర్జరీ చేసేసిన వ్యక్తి నీతులు చెప్పటం ఎంతవరకు సమంజసం? గీతం కాలేజీ పెట్టి ఏకంగా 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ఎంవీవీఎస్ మూర్తి తెలుగుదేశం నాయకుడు కాదా? దసపల్లా హిల్స్‌లో ఇరు పక్షాల మధ్య వివాదం ఉండగా... ఏకంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం ముఖ్యమంత్రి హోదాలో కబ్జా చేసిందెవరు? అయ్యన్న పాత్రుడిదీ ఫోర్జరీ చరిత్రేగా? భూముల పరిహారం విషయంలో నకిలీ పట్టాలు సృష్టించి మరీ కాజేసిన 'బండారు' సత్యం బయటపడలేదా? ఇవన్నీ మీ 'ఈనాడు'లో ఏనాడూ రాయరెందుకు రామోజీ? ఎందుకంటే వాళ్లు మీ భాగస్వాములనా? మరిప్పుడు ప్రతిరోజూ విశాఖపై విద్వేషం చిమ్మటమెందుకు? అక్కడకు రాజధాని రాకూడదనా? విశాఖ నగరానికున్న వెయ్యేళ్ల ఘన చరిత్రను... భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఆ నగరానికున్న ప్రాధాన్యాన్ని సాక్షాత్తూ ఈ దేశ ప్రధానే చెప్పారు. అయినా మీ బుద్ధి మారదెందుకు? ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న ఒకే ఒక్క అగ్రశ్రేణి నగరంపై మీకెందుకింత కక్ష? బౌన్సర్లను పెట్టుకుని మరీ విశాఖకు వ్యతిరేకంగా సాగించిన యాత్ర నకిలీదని న్యాయ స్థానాల సాక్షిగా తేలిపోయింది కదా!! అయినా సరే బుద్ధి లేకుండా ప్రతిరోజూ వైఎస్సార్ సీపీ నాయకులపై ఆరోపణలెందుకు? రోజూ పనిగట్టుకుని చెబితే అబద్ధాలు నిజాలైపోతాయా? మీరే తప్పుడు వార్తలు రాసి... మీరే నానా యాగీ చేస్తే ఎలా? పేదలకు ఇంగ్లిష్ మీడియం వద్దంటూ కోర్టులకెక్కి యాగీ చేసేదీ మీరే!!. పేదలకు ఇళ్లు రాకుండా న్యాయ స్థానాలకెళ్లి అడ్డుపడ్డదీ మీరే. ప్రతి స్థలాన్నీ వివాదాస్పదం చేసిందీ మీరే. కానీ ఒక్కటి మాత్రం నిజం!. మీ ముఠా వ్యూహాలను చిత్తు చేసే సంకల్ప బలం ఈ ప్రభుత్వానికి... ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఉంది. దానికి ప్రజాశీస్సులూ మెండుగా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అమ్మకాలు

ఇవి ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్-మద్యం, బీరు కేసుల అమ్మకాలు (లక్షల్లో)

ఆర్థిక సంవత్సరం	మద్యం (ఐఎంఎల్)	బీరు	మొత్తం
2014-15 (అవశేష రాష్ట్రం)	288.69	174.58	463.27
2015-16	306.73	168.98	475.71
2016-17	332.26	174.49	506.75
2017-18	360.85	227.26	588.11
2018-19	384.36	277.16	661.52
2019-20	308.49	212.91	521.40
2020-21	187.55	56.97	244.52
2021-22	266.08	81.67	347.75
2022-23 (ఏప్రిల్ టు అక్టోబర్)	199.04	75.67	274.71

ఆధునిక దేశ నిర్మాత

సందర్భం




వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ఆధునిక భారతదేశ నిర్మాణానికి పునాదులు వేసినవాడు జవహర్‌లాల్ నెహ్రూ. వలసవాద వ్యతిరేకిగా, లౌకికవాదిగా, మానవతావాదిగా, ప్రజాస్వామ్యవాదిగా, స్వాతంత్ర్య ఉద్యమ నేతగా ప్రసిద్ధి గాంచిన వ్యక్తి నెహ్రూ... భారతదేశ సమగ్రాభివృద్ధికి దాదాపు 17 ఏళ్ల ప్రధానమంత్రిగా కృషి చేశారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో 9 సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. ఆ రోజుల్లో 1936లో ఆటో బయోగ్రఫీ, 1946లో 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' రచించి, ఆనాటి రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక విషయాలను ప్రజలకు తెలియజేసి ప్రముఖ రాజనీతిజ్ఞునిగా ప్రసిద్ధి కెక్కారు.

తండ్రి మోతీలాల్ నెహ్రూ కుమారుని విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో సైన్స్‌లో డిగ్రీ చదివించారు. లండన్‌లోని 'ఇన్నర్ టెంపుల్ ఇన్'లో న్యాయ శాస్త్రాన్ని అధ్యయనం చేసి లాయర్‌గా జీవితాన్ని ప్రారంభించారు నెహ్రూ. 1912 నుండి అఖిల భారత కాంగ్రెస్‌లో చురుకైన పాత్ర పోషించారు. 1920లో జరిగిన సహాయ నిరాకరణ ఉద్యమంలో, 1930లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో గాంధీజీతో పాటు పాల్గొన్నారు. 1946లో ఏర్పడిన ప్రావిజనల్ ప్రభుత్వంలో ప్రధానిగా ఎన్నికయ్యారు.

నెహ్రూ భారతదేశం లౌకిక తత్వంతో సోషలిస్టు భావజాలంతో ముందుకు వెళ్లడానికి తోడ్పడ్డారు. ప్రైవేటు రంగంలో పెట్టుబడులు సమీకరించడం కష్టమవుతున్న నాటి పరిస్థితులలో వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులతో ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసిన ధీశాలి నెహ్రూ. బహుళార్థ సాధక భారీ నీటి పారుదల ప్రాజెక్టులు, రైల్వేల అభివృద్ధి, రోడ్డు మార్గాలు, విమానాశ్రయాలు, ఇనుము, ఉక్కుకర్మాగారాలు, శాస్త్ర పరిశోధన సంస్థలను ప్రభుత్వ రంగంలోనే ప్రారంభించిన దార్శనికుడాయన. ప్రముఖ ఆర్థిక వేత్త మహలనోబిస్ నేతృత్వంలో పంచవర్ష ప్రణాళికలకు రూపకల్పన చేసి ప్రణాళికాబద్ధ అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి నెహ్రూ. అమెరికా, రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో తటస్థ వైఖరి అవలంబించి, అలీన ఉద్యమానికి నేతృత్వం వహించారు.

ప్రతిరోజు భారత ప్రజలు వివిధ సమస్యలపై దాదాపు రెండు వేలకు పైగా ఉత్తరాలు రాసేవారు. ప్రతి రాత్రి అదనంగా నాలుగు లేదా ఐదు గంటలు పని చేసి, ఆ ఉత్తరాలను అధ్యయనం చేసి సమాధానాలను రాయడం ఆయన నిరంతర కృషికి నిదర్శనం. 12 శాతం అక్షరాస్యతతో ప్రపంచంలో అత్యధిక పేదలు ఉన్న దేశంగా ఉన్న భారత దేశాన్ని నెహ్రూ తన రాజకీయ పరిజ్ఞానంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలబెట్టారు.




జవహర్‌లాల్ నెహ్రూ

ఇంతటి గొప్ప దార్శనికుడు నెహ్రూజీకి బాలల పట్ల అమితమైన ప్రేమ, వాత్సల్యం ఉండేవి. అందుకనే పిల్లలందరూ చాచా నెహ్రూగా పిలిచేవారు. అందుకే ఆయన జన్మదినమైన నవంబర్ 14వ తేదీని బాలల దినోత్సవంగా జరుపుకొంటున్నారు. నిజానికి 1956 నుంచి అంతర్జాతీయ బాలల దినోత్సవం జరిగే రోజునే ఇండియాలోనూ బాలల దినోత్సవాన్ని జరిపేవారు. అయితే 1964 మే 27న పిల్లల్ని ఎంతగానో ఇష్టపడే నెహ్రూజీ తుదిశ్వాస విడిచిన తర్వాత... ఆయన పుట్టిన రోజును భారత ప్రభు త్వం బాలల దినోత్సవంగా జరపాలని నిర్ణయించింది. ఈ తరుణంలో ఆ మహనీయుని స్ఫూర్తిని ఆవాహన చేసుకోవడం అవసరం.

వ్యాసకర్త ఏపీ అధ్యక్షులు, జన చైతన్య వేదిక
మొబైల్: 99499 30670

ఉత్తమాంధ్రగా నిలుపుతామంటే...

సందర్భం



డాక్టర్ టి. షారోన్ రాజు

ఉత్తరాంధ్ర అన్ని రంగాలలోనూ వెనకబడి ఉందన్న సంగతి అందరికీ తెలిసిందే. పదుల సంఖ్యలో ప్రభుత్వరంగ సంస్థలు, రోడ్డు, రైలు, విమాన, నౌకా రవాణా వ్యవస్థలతో అనుసంధానమైన ప్రాంతం అయినప్పటికీ వెనుకబాటుతనం మాత్రం జనాన్ని వీడలేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థ లకు, పరిశ్రమలకు స్థానం కల్పించిన నేల ఇది. వ్యవసాయ, వాణిజ్య, వ్యాపార రంగాలకు ఆయువు పట్టుగా నిలుస్తూ ఆర్థిక వ్యవస్థకు ఇతోధికంగా దోహద పడుతున్న ప్రాంతం. సాంస్కృతిక రాజధానిగా విరాజిల్లిన విజయనగరం, పోరా టాల నేల శ్రీకాకుళం, ఆదివాసీ మన్యం తన సిగలో పెట్టు కున్న విశాఖ... ఈ మూడు జిల్లాల సమాహారమే ఉత్త రాంధ్ర ప్రాంతం.

2019లో ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో దార్శనికతతో విశాఖను పరిపాలనా రాజధా నిగా, అమరావతిని శాసన రాజధానిగా, కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేసి న్యాయ రాజధానిగా చేయాలని నిర్ణయించారు. ఇది మూడు ప్రాంతాల అభివృద్ధికీ ఉప యుక్తంగా నిలుస్తున్న అంశం.

రాష్ట్ర సమగ్ర వికాసం, అన్ని ప్రాంతాల అభివృద్ధి నినాదంతో తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేవలం కొద్దిమంది వ్యతిరేకిస్తూ అడ్డుపడుతున్నారు. అమరావతి నుంచి అరసవల్లి వరకు రైతుల పాదయాత్ర పేరుతో పెట్టుబడిదారులు ఉత్తరాంధ్రపై దాడి చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రజా స్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటి చర్య. ఒకవైపు పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తూ, యాత్రను ఆకాశానికి ఎత్తేస్తు న్నాయి ఎల్లో పత్రికలూ, ఛానళ్లూ అదే సమయంలో ఉత్త రాంధ్రపై విషపు రాతలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి తన పత్రికా ప్రయాణాన్ని ప్రారంభించి నేడు అతిపెద్ద సామ్రాజ్యాన్ని విస్తరించిన 'ఈనాడు' రాతలు మహారోత పుట్టిస్తు న్నాయి. కేవలం కొందరి కరపత్రంగా ఇది మారిపోయి ఇష్టారాజ్యంగా వారికి నచ్చినట్లు వండి వడ్డిస్తూ ఉత్తరాం ధ్రపై విషం కక్కుతున్నది. ప్రజాస్వామ్యాన్ని కాపాడ వలసిన పత్రికలు, సమాచార మాధ్యమాలే అప్రజాస్వామిక విధానాలను అవలంబించడం బహుశోచనీయం.

ఉత్తరాంధ్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలు, మనో భావాలు, అభివృద్ధి, వికాసం వంటివి ఈ పచ్చపత్రికలు, టీవీ చానళ్లకు, వాటిని నడిపిస్తున్న వారికి పట్టవు. కొంద రికి దోచుకోవడానికి, దాచుకోవడానికి ఎన్నికల సమ యంలో ఇక్కడ ప్రజల ఓట్లు, తద్వారా పదవులు పొంద డానికి విశాఖ నగరం కావాలి. ఈ ప్రాంతం, ప్రజలు అభివృద్ధి చెందుతామంటే మాత్రం వీరు ఓర్వలేక పోతున్నారు. నేడు సాంకేతిక విప్లవం పుణ్యాన వీళ్లు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు రాష్ట్రంలో ప్రజలంతా చూస్తున్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి అడ్డుపడే ప్రతీ వ్యక్తినీ, వ్యవస్థనూ ఉత్తరాంధ్ర ప్రజలు ఊరికే వదలరు. ఉత్తరాంధ్ర నుంచి ఉద్యమం ఆరంభం అయితే దానిని ఆపడం ఎవ్వరి తరమూ కాదు. పోరాటాల పురిటిగడ్డ శ్రీకాకుళం నుంచి ఉద్యమ స్ఫూర్తినీ, విజ యనగరం నుంచి సాంస్కృతిక వారస త్వాన్నీ, విశాఖ నుంచి విజయగీతికనూ అందు కుని ఉత్తరాంధ్రను అభి వృద్ధి పథంలో నడిపి 'ఉత్తమ ఆంధ్ర'గా నిలిపే దిశగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలంతా వెన్నంటి నిలుస్తారు. కేవలం 29 గ్రామాల ప్రజల కోసం 26 జిల్లాలతో కూడిన రాష్ట్ర అభివృద్ధిని పణంగా పెట్టాలంటే ప్రజలు సహించరు.

పరిపాలనా రాజధానిగా విశాఖ కాకుండా అడ్డుకునే ప్రతీ వ్యవస్థకూ, పార్టీకీ ఎదురొడ్డి నిలుస్తూ... అసాంఘిక శక్తులను, విద్వేషాలు రగిలించే వ్యవస్థలను కూకటివేళ్లతో పెకిలిస్తారు ప్రజలు. రాష్ట్ర సమగ్ర వికాసం లక్ష్యంగా, అభివృద్ధి మంత్రంగా... ప్రజలంతా ముందడుగు వేస్తారు. తూర్పు తీరం నవ చరిత్రకు నాందీ వాచకంగా నిలుస్తుంది!

వ్యాసకర్త విభాగాధిపతి, విద్యావిభాగం
ఆంధ్ర విశ్వవిద్యాలయం | 94907 98631

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: బ.షష్ఠి రా.12.14 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: పునర్వసు ఉ.11.28 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.8.20 నుండి 10.05 వరకు, దుర్ముహూర్తం: ప.12.05 నుండి 12.50 వరకు, తదుపరి ప.2.20 నుండి 3.06 వరకు, అమృతఘడియలు: ఉ.8.51 నుండి 10.34 వరకు: రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు: సూర్యోదయం 6.08 : సూర్యాస్తమయం 5.21.

క్లుప్తంగా

సత్యదేవుని దర్శించిన లక్ష మంది



సత్యదేవుని ఆలయం వద్ద భక్తుల రద్దీ

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై కొలువైన సత్యదేవుని ఆలయానికి ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి వేల సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వ్రత మండపాలు, క్యూలు అన్నీ నిండిపోయాయి. సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. లక్ష మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించారు. స్వామి వారి వ్రతాలు 10 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.1.20 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తుల రద్దీ కారణంగా ఒక దశలో తూర్పు రాజగోపురం వద్ద తోపులాట జరిగింది. దేవస్థానం అధికారులు, పోలీసులు సకాలంలో చర్యలు తీసుకుని రద్దీని నియంత్రించారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి స్నపన తిరుమంజనం



స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల: కార్తీక వనభోజనం సందర్భంగా ఆదివారం తిరుమలలోని వైభవోత్సవ మండపంలో శాస్త్రోక్తంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ప్రతి ఏడాదీ కార్తీక మాసంలో పార్వేటి మండపం వద్ద కార్తీక వనభోజనాలు నిర్వహించడం ఆనవాయితీ. వర్షాల కారణంగా ఈ సారి కార్తీక వనభోజనాన్ని టీటీడీ రద్దు చేసింది. వైభవోత్సవ మండపంలో స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనములతో అభిషేకం చేశారు.

దర్శనానికి 30 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 30 గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది.

శ్రీవారి సేవలో ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్



తిరుమల శ్రీవారిని ఆదివారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిప్యూటీ గవర్నర్ ఎంకే జైన్, టీటీడీ ఆస్థాన గాయని శోభా రాణి తదితరులు దర్శించుకున్నారు.

అరసవిల్లిలో సతీసమేతంగా సీఎస్ పూజలు



సూర్య నమస్కార పూజలు చేస్తున్న సమీర్‌శర్మ

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత శ్రీసూర్యనారాయణ స్వామి కొలువైన శ్రీకాకుళంలోని అరసవిల్లి క్షేత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ సమీర్ శర్మ ఆదివారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసి సూర్య నమస్కారాలు చేశారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్, ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆయనకు స్వాగతం పలికారు. సూర్యనమస్కార పండితుడు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఆరోగ్యం కోసం ప్రత్యేకంగా సూర్య నమస్కార పూజలను నిర్వహించారు.

అద్భుతం... యుక్తా వైష్ణవి నృత్యరూపకం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రముఖ కూచిపూడి నృత్యగురువులు రాజా రాధారెడ్డి, కౌశల్యారెడ్డి శిష్యురాలు యుక్తా వైష్ణవి అరంగేట్ర ప్రదర్శన అద్భుతంగా సాగింది. ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. ఏలూరుకి చెందిన ఐఏఎస్ అధికారి ఎస్.సుధాకర్, శిరీష దంపతుల కుమార్తె యుక్తా వైష్ణవి ఢిల్లీలోని కమాని ఆడిటోరియంలో తన తొలి నృత్య ప్రదర్శన చేశారు. రాజా రాధారెడ్డి, కౌశల్యారెడ్డి వద్ద 13 ఏళ్లుగా నాట్య తరంగిణి కళా రూపాన్ని అధ్యయనం చేసిన వైష్ణవి పలు ఉత్సవాల్లో నృత్య ప్రదర్శన చేశారు. పరంపర సిరీస్, పాటియాలా హెరిటేజ్ ఫెస్టివల్–2020, యూత్ ఫెస్టివల్–2016, టీటీడీ ఆలయ బ్రహ్మోత్సవాలు, ఆంధ్రా అసోసియేషన్ వేదికల్లో యుక్తా వైష్ణవి తన నృత్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు పొందారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీలో పాకశాస్త్రం అభ్యసించిన వైష్ణవి కరోనా సమయంలో క్లౌడ్ బేకరీ సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి కిరణ్ నాడార్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ చైర్‌పర్సన్ కిరణ్‌నాడార్, ఆంధ్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటగిరి సత్యనారాయణ, వందలాది మంది హాజరయ్యారు.



ఉత్సాహంగా నేవీ మారథాన్

విశాఖ సాగరతీరం ఆదివారం నీలంరంగు పులుముకుంది. వైజాగ్ నేవీ మారథాన్‌లో భాగంగా ఏకంగా 18 వేలమంది చిన్నాపెద్దా వయోభేదం లేకుండా నీలిరంగు టీషర్ట్‌లు ధరించి పరుగందుకున్నారు. రాష్ట్రాన్ని ప్లాస్టిక్ రహితంగా చేసేందుకు రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ నినాదంతో ఈ ఏడాది నేవీ మారథాన్‌ను తూర్పునావికాదళం ఆధ్వర్యంలో నిర్వహించారు. సాగరతీరంలో కాళీమాత ఆలయం చెంత నుంచి ఫుల్‌మారథాన్ (42 కిలోమీటర్లు), హాఫ్ మారథాన్ (21 కిలోమీటర్లు), 10కె (10 కిలోమీటర్ల) పరుగుపందెంతోపాటు ఐదుకిలోమీటర్ల ఫన్‌రన్‌లోను ఉత్సాహంగా పాల్గొన్నారు. తూర్పునావికాదళ అధికారులతో పాటు ఐదుకిలోమీటర్ల పరుగును సినీనటుడు అడవి శేష్ జెండా ఊపి ప్రారంభించారు. విజేతలకు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి అమర్‌నాథ్ నగదు ప్రోత్సాహకాల్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సీ స్టాఫ్‌చీఫ్ సంజయ్‌వాత్సాయన్ పాల్గొన్నారు. - విశాఖ స్పోర్ట్స్



మబ్బుల్లో మునిగిన తిరుగిరులు

ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమల అద్వితీయమైన ప్రకృతి రమణీయతతో అలరారుతోంది. చేతికందే ఎత్తులోనే మంచు మబ్బులు..కొండల మాటున పచ్చని అందాలు..వర్షపు నీటిలో కట్టిపడేస్తున్న సప్తగిరుల ప్రతిబింబాలను చూస్తే ఎక్కడో హిమాలయాల్లో ఉన్నట్లు అనిపిస్తోంది. మూడు రోజులుగా కురుస్తోన్న వర్షాలతో తిరుమల కొండలు హిమగిరులను తలపిస్తున్నాయి. అలిపిరి నడక మార్గంలోని మూడు నామాలను తాకుతూ వెళ్తోన్న మబ్బులు చూపరులను విశేషంగా కట్టిపడేస్తున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారి..



బాపట్ల జిల్లా కారంచేడు ప్రాంత ప్రజలు నాట్లు దగ్గర నుంచి కోతల వరకు యంత్రాల సాయంతో సాగు పద్ధతులు అవలంబిస్తున్నారు. కారంచేడు మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన లక్కాకుల శ్రీనివాసరావు, లక్కాకుల పూర్ణచంద్రరావు తమ వరి పొలంలో ఉన్న చీడ, పీడలను పోగొట్టేందుకు పురుగుమందుల పిచికారి కోసం డ్రోన్‌లను ఉపయోగించారు. ఆదివారం స్వర్ణ–కారంచేడు రోడ్డులోని వరి చేలల్లో డ్రోన్‌లతో పురుగు మందులను పిచికారి చేయించారు. - స్వర్ణ (కారంచేడు)

గడప గడపకు మన ప్రభుత్వం



ప్రకాశం జిల్లా కంద్లగుంట గ్రామంలో మహిళ చెబుతున్న సమస్యను వింటున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



నంద్యాల 7వ వార్డులో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాకలగరువులో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



ఏలూరు జిల్లా పడమటిపాలెంలో అవ్వకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

జంతువులు అడవికే పరిమితం!

మనుషులు, జంతువులకు మధ్య సంఘర్షణ నివారణకు అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణ

- ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఏనుగులు జనావాసాల్లోకి రాకుండా చర్యలు
- ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్‌లు, బారికేడ్లు, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు కసరత్తు
- పులులు, కృష్ణజింకలు బయటకు రాకుండా చూసేందుకు ప్రయత్నాలు
- ఒడిశా, తమిళనాడు అధికారులతో సమన్వయం చేసుకోవాలని నిర్ణయం



సాక్షి, అమరావతి: ఏనుగులు, పులులు వంటి జంతువులు జనావాసాలు, పొలాల వద్దకు వచ్చి బీభత్సం సృష్టించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీ శాఖ నిర్ణయించింది. జంతువులను అడవికే పరిమితం చేయాలని భావిస్తోంది. ఈ మేరకు మనుషులు, జంతువులకు మధ్య సంఘర్షణను నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం ఒడిశా, తమిళనాడు అటవీ శాఖాధికారులతో సమన్వయం చేసుకోవాలని కూడా నిర్ణయించింది. ఈ విషయంపై ఇటీవల నిర్వహించిన అటవీ శాఖాధికారుల సదస్సులో విస్తృతంగా చర్చించారు.

ఎనిమిదేళ్లలో 38 మంది మృత్యువాత

ఉత్తరాంధ్ర, రాయలసీమలోని పలు జిల్లాల్లో ఏనుగులు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఇటీవల రెండు పులులు దారి తప్పి తూర్పుగోదావరి, అనకాపల్లి ప్రాంతాల్లోకి రావడంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కృష్ణజింకలు రోడ్లపైకి, పొలాల్లోకి వస్తున్నాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఎలుగుబంట్లు, అడవి పందులు తరచూ గ్రామాల్లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో జంతువులు, మనుషులకు మధ్య సంఘర్షణలో 2014 నుంచి ఇప్పటివరకు 38 మంది మృత్యువాత పడ్డారు. ఇలాంటి ఘటనలపై 15,198 కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనల్లో మృతి చెందిన, గాయపడిన కుటుంబాలు, పంట, ఇతర నష్టాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లకుపైగా పరిహారం చెల్లించింది.

పటిష్ట భద్రత ఏర్పాట్లు.. అవగాహన కార్యక్రమాలు..

ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల్లో ఏనుగులు ఎక్కువగా ఆవాస ప్రాంతాల్లోకి వస్తున్నాయి. వాటిని అడ్డుకునేందుకు ఏనుగులు వచ్చే మార్గాల్లో కందకాలు తవ్వడం (ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్‌లు), ఆర్‌సీసీ పిల్లర్లతో స్ట్రీమ్ బారికేడ్లు, రోడ్లపైకి వచ్చే మార్గాల్లో గేట్లు, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో 24గంటలు తిరుగుతూ వాటిని గ్రామాల్లోకి రాకుండా చూసేందుకు ప్రత్యేక బృందాలను, ఎలిఫెంట్ ట్రాకర్లను నియమించనున్నారు. అదేవిధంగా ఏనుగులు గ్రామాల్లోకి వచ్చినప్పుడు మిరపకాయ పొగ వేయడం, ఆముదం స్ప్రే చేయడం, తేనెటీగల సౌండ్ చేయడం ద్వారా వాటిని తిరిగి అడవి వైపు మళ్లించే అంశాలపై స్థానికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఏనుగులు బయటకు రాకుండా అడవుల్లోనే వాటి కోసం నీటి గుంటలు ఏర్పాటు చేయనున్నారు. ఉత్తరాంధ్రలో ఎలిఫెంట్ రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల అధికారులతో సమన్వయం పెంచుకుని ఏనుగుల కదలికలపై సమాచారాన్ని వేగంగా మార్పిడి చేసుకోవడానికి ప్రయత్నాలు చేయాలని ప్రణాళిక రూపొందించారు.

పులులను ట్రాప్ చేసేలా...



తమ ఆవాసాల్లోకి వేరే పులులు రావడంతో అక్కడక్కడా పులులు దారి తప్పి అడవి నుంచి బయటకు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలా బయటకొచ్చిన పులులు ఆహారం కోసం గ్రామాల్లోకి వచ్చి ఆవులు, మేకలు వంటి జంతువులను చంపుతున్నాయి. ఇలాంటి ఘటనల నివారణ కోసం వాటిని ట్రాప్ చేసే కేజ్‌లు సమకూర్చుకోవడంతోపాటు కెమెరాల ట్రాప్‌లను పెంచడానికి చర్యలు తీసుకోనున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కృష్ణజింకలు రోడ్లపైకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. పొలాల్లోకి వచ్చి పంటను ధ్వంసం చేస్తున్నాయి. అవి అడవి దాటి రాకుండా చర్యలు చేపడుతున్నారు.

నేడు విశాఖ తీరంలో శ్రీవారి కార్తీక మహా దీపోత్సవం

- విశాఖ చేరుకున్న శ్రీవారి ఉత్సవ విగ్రహాలు
- దీపోత్సవంలో పాల్గొనేందుకు 2,500 మందికి పాస్‌లు



పూజలందుకుంటున్న సతీసమేత శ్రీవారు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు) : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో కార్తీక మహా దీపోత్సవం కనులపండువగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆదివారం ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీవారి భక్తి చానల్ సీఈవో షణ్ముఖ్‌కుమార్ వెల్లడించారు. మూడు వేల మంది వరకు భక్తులు కుటుంబంతో సహా పాల్గొని దీపాలు వెలిగించేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి ఇప్పటికే 2,500 పాస్‌లు జారీ చేశామన్నారు. పాస్‌లు ఉన్న భక్తులకు మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. పూజ వివరాలతో కూడిన బుక్‌లెట్, దీపోత్సవం సామగ్రిని వేదిక వద్ద అందిస్తామని చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటలకు పార్కు హోటల్ కూడలి నుంచి ఆర్కే బీచ్ వరకు శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. యాత్ర అనంతరం ఆర్కే బీచ్‌లో సాయంత్రం 5.30 గంటలకు దీపోత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో దీపోత్సవ కమిటీ అధ్యక్షుడు గ్రంధి రాజేష్, టీటీడీ ఎస్‌ఈ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారికి పూజలు

కార్తీక మహా దీపోత్సవంలో కోసం సతీసమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను కల్యాణరథంలో విశాఖ తీసుకొచ్చారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉంచిన ఉత్సవ విగ్రహాలను పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

శ్రీశైలం మార్గంలో స్తంభించిన ట్రాఫిక్

ఆత్మకూరు: శ్రీశైలం–పెద్దదోర్నాల మార్గంలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి వాహనాల రద్దీ కారణంగా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించింది. దీంతో భక్తులు అవస్థలు పడ్డారు. శ్రీశైల మహాక్షేత్రం నుంచి శిఖరేశ్వరానికి దూరం కేవలం 7 కిలోమీటర్లు అయినా ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనాలు వెళ్లేందుకు ఆరు గంటల వరకు పట్టింది. శ్రీశైలక్షేత్రం నుంచి సాక్షిగణపతి, హఠకేశ్వరం, ముఖద్వారం, సున్నిపెంట మలుపు వద్ద వాహనాలు నిలిచిపోయాయి. మల్లన్న దర్శనం అనంతరం తిరిగి వెళ్లే వారి వాహనాలు, దర్శనానికి వచ్చేవారి వాహనాలు వేలాదిగా ఉండటంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు చాల కష్టపడి ఆదివారం సాయంత్రానికి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

'దొంగతనం పాపం' రా బాబులు!

కాకర పంటను రక్షించుకునేందుకు ఓ రైతు పొలంలో ప్లకార్డులు



ఏర్పేడు : తమ పంటను దొంగల బారి నుంచి రక్షించుకునేందుకు ఓ రైతు ఆదివారం వినూత్న ప్రయోగాన్ని చేపట్టాడు. 'దొంగతనం పాపం.. ఓం నమశ్శివాయ' అంటూ ప్లకార్డులపై రాయించి వాటిని పొలంలో ఏర్పాటు చేశాడు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కొండ్రాజుపల్లికి చెందిన రామ్మూర్తినాయుడు శ్రీకాళహస్తిలో ఉంటూ పదేళ్లుగా ఏర్పేడు మండలంలోని చిందేపల్లిలో కూరగాయలు పండిస్తున్నాడు. ప్రస్తుతం కాకర పంట వేశాడు. అప్పుడప్పుడు బైక్‌పై వెళ్లి కాకర పంటను చూసుకుంటున్నాడు. అయితే పలువురు తోటలోని కాకర కాయలను దొంగిలిస్తున్నారు. దీంతో రామ్మూర్తినాయుడు పైవిధంగా ప్లకార్డులు ఏర్పాటు చేశాడు. మరి ఇది ఎంతవరకు ఫలితాన్నిస్తుందో చూడాలి.

నేడు స్వధర్మ వాహిని ప్రచార యాత్ర ప్రారంభం

కాణిపాకం (యాదమరి): విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి ఆశీస్సులతో ఆయన శిష్యులు చేపడుతున్న స్వధర్మ వాహిని ప్రచార యాత్రను విజయవంతం చేయాలని కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో రాణాప్రతాప్ కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సంప్రదాయాలను, ఆలయ వ్యవస్థలను పటిష్టం చేయడంలో భాగంగా శారదా పీఠం బృందం సోమవారం కాణిపాక వినాయక ఆలయం నుంచి ప్రచార యాత్రను ప్రారంభించనున్నట్టు తెలిపారు.

న్యాయస్థానాలను తప్పుదారి పట్టించేలా కేసులు

- 777వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ: న్యాయస్థానాలను తప్పుదారి పట్టించేలా వందల సంఖ్యలో కుల వాదులు కోర్టుల్లో తప్పుడు కేసులు వేస్తూ బహుజనులకు సంక్షేమ ఫలాలు అందకుండా చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 777వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో ఆదివారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. భారత రాజ్యాంగాన్ని సైతం ప్రజల అవసరాలకనుగుణంగా పలుమార్లు సవరించారని, కానీ సీఆర్డీయే చట్టంలో సవరణలు చేసేందుకు చట్ట సభలు ఆమోదిస్తే.. కులవాదులు అడ్డుకోవాలని యత్నించడం వెనుక కుట్రకోణం దాగి ఉందన్నారు. 29 గ్రామాల్లో నిర్మిస్తున్న కుల రాజధానికి నిధులు 5 కోట్ల మంది ప్రజల కష్టం నుంచి వచ్చిన ఆదాయం కాదా అని ప్రశ్నించారు. బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ గుండె ధైర్యం ఎంతో గొప్పది

- రీ సర్వే చేయాలంటే ఎంతో దమ్ముండాలి
- తెలంగాణ రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతల ప్రశంసలు



ఆంధ్ర రెవెన్యూ ఉద్యోగులతో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగులు

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుండె ధైర్యం ఎంతో గొప్పదని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగసంఘాల నాయకులు ప్రశంసించారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఎస్‌ఆర్ఏ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజులపాటు జరిగిన ఏపీ రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి ఏఎన్‌యూలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.రవీందర్‌రెడ్డి ప్రసంగిస్తూ భూములు రీ సర్వే చేయించాలంటే ఆ ముఖ్యమంత్రికి ఎంతో దమ్ముండాలని చెప్పారు. ఏపీలో భూముల రీ సర్వే ప్రారంభించిన సీఎం ఎంతో ధైర్యవంతుడన్నారు. రెవెన్యూకి సంబంధించిన సంస్కరణలు, సేవల్లో ఏపీ ప్రభుత్వం కీలకంగా ముందడుగు వేస్తోందని, ఎన్నో అంశాలలో ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.గౌతంకుమార్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో రెవెన్యూకి పూర్వవైభవం తెచ్చిన మహోన్నత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. అంతకుముందు కొన్ని ప్రభుత్వాలు, పాలకులు రెవెన్యూని నిర్వీర్యం చేసే చర్యలు చేపట్టినా.. వైఎస్సార్ ముఖ్యమంత్రి కాగానే కొత్త ఉద్యోగాలు కల్పించడం, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం వంటి ప్రత్యేక చర్యలు చేపట్టి రెవెన్యూకి జీవం పోశారని చెప్పారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రెవెన్యూలో ఆదర్శవంతమైన సంస్కరణలు తెస్తున్నారని ప్రశంసించారు.

సహజీవనం చేసి పెళ్లాడకుంటే... మోసగించినట్టు కాదు

దీనికి సెక్షన్ 420 వర్తించదు
కర్నాటక హైకోర్టు తీర్పు

బెంగళూరు: సహజీవనం చేసి పెళ్లాడకపోతే అది మోసగించడం కిందకు రాదని కర్నాటక హైకోర్టు పేర్కొంది. సదరు వ్యక్తిపై ఐపీసీ సెక్షన్ 420 కింద కేసు పెట్టలేమని న్యాయమూర్తి జస్టిస్ కె.నటరాజన్ స్పష్టం చేశారు. తన బోయ్‌ఫ్రెండ్ ఎనిమిదేళ్ల సహజీవనం చేసి చివరికి పెళ్లికి నిరాకరించాడంటూ ఓ మహిళ చేసిన ఫిర్యాదును కొట్టేస్తూ ఆయన తీర్పు వెలువరించారు. ఇద్దరి మధ్య ఉన్న సహజీవన ఒప్పందాన్ని అతను మోసపూరిత ఉద్దేశంతో ఉల్లంఘించాడని చెప్పలేమని ఈ సందర్భంగా న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఇంట్లోవాళ్లు ఇంకో అమ్మాయితో పెళ్లి కుదిర్చిన కారణంగా సహజీవనాన్ని వైవాహిక బంధంగా మార్చుకునేందుకు సదరు అబ్బాయి నిరాకరించాడు.

అమ్మకానికో ఊరు

మాడ్రిడ్: పట్నవాసంతో విసిగిపోయారా? అక్కడి ఆస్తిపాస్తులన్నీ అమ్మేసి ఏ మారుమూలకో పోయి ప్రశాంత వాతావరణంలో ఇల్లు కొనుక్కుని స్థిరపడదలచుకున్నారా? మీ దగ్గర ఓ 2.59 లక్షల డాలర్లు, అంటే రూ.2 కోట్లుంటే ఇల్లేం ఖర్మ, స్పెయిన్‌లో ఎంచక్కా ఓ ఊరినే కొనేసుకోవచ్చు! దేశ వాయవ్య ప్రాంతంలో జామోరా ప్రావిన్స్‌లో పోర్చుగల్ సరిహద్దులను ఆనుకుని ఉన్న సాల్టో డీ కాస్ట్రో అనే ఊరు అమ్మకానికి సిద్ధంగా ఉంది. రాజధాని మాడ్రిడ్ నుంచి కేవలం మూడు గంటల ప్రయాణ దూరంలో ఉన్న ఈ గ్రామంలో 44 చూడచక్కని నివాస భవనాలు, చిన్న చిన్న ఇళ్లు, ఓ హోటల్, చర్చి, స్కూలు, ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్, పోలీస్ స్టేషన్ తదితర హంగులన్నీ ఉన్నాయి. లేనిదల్లా... జనం మాత్రమే! అవును!! దాదాపు మూడు దశాబ్దాల క్రితం ఈ ఊరు పూర్తిగా ఖాళీ అయిపోయింది. ఓ విద్యుదుత్పత్తి సంస్థ తన వర్కర్లు, వారి కుటుంబాల కోసం రిజర్వాయర్ పక్కనే 1950ల్లో ఈ ఊరిని కట్టించింది. పని పూర్తయ్యాక వారంతా ఊరొదిలి వెళ్లిపోయారు. ఈ ఊరి ప్రస్తుత యజమాని దాన్ని టూరిస్టు కేంద్రంగా తీర్చిదిద్ది భారీగా ఆర్జించొచ్చనే ఆశతో 2000లో కొనుక్కున్నాడు. కానీ ఈ ప్రాంతమంతా యూరో గ్రీన్ జోన్లో ఉండటంతో ఎలాంటి అభివృద్ధి పనులూ చేయటానికి వీల్లేక అతని ప్లాన్లన్నీ అటకెక్కాయి. ఇప్పుడతనికి 80 ఏళ్లు దాటాయి. దాంతో ఊరిని చూసుకునే ఓపిక లేక ఇంటర్నెట్లో అమ్మకానికి పెట్టాడట. వారంలోనే ఏకంగా 50 వేల మంది ఈ ప్రకటనపై ఆసక్తి వెలిబుచ్చారు! వారిలో రష్యా, ఫ్రాన్స్, బెల్జియం, బ్రిటన్ వంటి దేశాలకు చెందిన 300 మందికి పైగా కొనేందుకు ముందుకొచ్చారట కూడా. ఇది చాలా చౌకబేరమని యజమాని చెబుతున్నాడు. నిజమేనేమో. ఎందుకంటే మాడ్రిడ్ వంటి నగరాల్లో 2.59 లక్షల డాలర్లకు సింగిల్ బెడ్రూం ఫ్లాట్ రావడం కూడా కష్టమేనట!



క్లుప్తంగా...

అమెరికా సెనేట్‌పై పట్టు నిలుపుకున్న డెమొక్రాట్లు

వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు ఎదురు దెబ్బ తగిలింది. కాంగ్రెస్‌లో అత్యంత కీలకమైన ఎగువ సభ సెనేట్‌పై డెమొక్రాట్లు పట్టు నిలుపుకున్నారు. మూడు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో రెండింట్లో డెమొక్రాటిక్ అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. నెవడాకు చెందిన డెమొక్రాటిక్ సెనేటర్ కేథరిన్ కార్టెజ్ మాస్టో తన రిపబ్లికన్ ప్రత్యర్థి ఆడం లక్సల్ట్‌పై విజయం సాధించారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన ఆడం ఓటమి ట్రంప్‌కు వ్యక్తిగతంగా ఎదురు దెబ్బే. అరిజోనాలోనూ డెమొక్రాటిక్ సెనేటర్ మార్క్ కెల్లీ గెలిచారు. దీంతో 100 మంది సభ్యులున్న సెనేట్‌లో డెమొక్రాట్ల సంఖ్య 50కి చేరింది. రిపబ్లికన్లకి 49 మంది సభ్యుల బలముంది. జార్జియాలో ఫలితం వెలువడాల్సి ఉంది.

కిమ్‌కు సమష్టిగా చెక్

అమెరికా, జపాన్, కొరియా నిర్ణయం

నాంఫెన్ (కంబోడియా): వరసగా క్షిపణి పరీక్షలతో కొరకరాని కొయ్యగా మారిన ఉత్తర కొరియాను కట్టడి చేయడానికి కలసికట్టుగా పని చేయాలని అమెరికా, జపాన్, దక్షిణ కొరియా నిర్ణయించాయి. కంబోడియాలో జరుగుతున్న తూర్పు ఆసియా సదస్సులో జపాన్ ప్రధాని కిషిడా, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యెల్‌తో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విడిగా సమావేశమై ఈ మేరకు చర్చించారు. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు అన్నివిధాలా అండగా ఉండాలని తీర్మానించారు. పసిఫిక్ ప్రాంతంలో చైనాను ఎదుర్కోవడంపైనా మూడు దేశాలు చర్చించాయి.

'విక్రమ్' ప్రయోగం వాయిదా

న్యూఢిల్లీ: భారత్‌లో తొలిసారిగా ప్రైవేట్‌రంగంలో రూపుదిద్దుకున్న విక్రమ్–ఎస్ రాకెట్ ప్రయోగం ప్రతికూల వాతావరణం కారణంగా మూడ్రోజులు వాయిదాపడింది. నవంబర్ 15న చేపట్టాల్సిన ప్రయోగాన్ని నవంబర్ 18న ఉదయం 11.30కి నిర్వహిస్తామని దాని తయారీదారు, హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధి ఆదివారం వెల్లడించారు. శ్రీహరికోటలోని ఇస్రోకు చెందిన సతీష్ ధవన్ అంతరిక్ష ప్రయోగకేంద్రం వేదిక నుంచి దీనిని ప్రయోగిస్తారు.



908 రోజులకు భూమ్మీదికి...

అంతరిక్షంలో ప్రభుత్వ, ప్రైవేట్ ప్రయోగాలు చేసి 908 రోజుల తర్వాత అమెరికాలో కెన్నడీ స్పేస్‌సెంటర్‌లో దిగిన అమెరికా ఎక్స్–37బి సైనిక డ్రోన్. అంతరిక్షంలో ఎక్కువ రోజులు గడిపిన స్పేస్ ప్లేన్‌గా కొత్త రికార్డ్ సృష్టించింది. సౌర విద్యుత్‌తో పనిచేసే ఈ డ్రోన్ చిన్నపాటి అంతరిక్ష నౌకలా ఉంటుంది. 2010 నుంచి చాలాసార్లు అంతరిక్షంలోకి వెళ్లొచ్చింది. 3,774 రోజులు గడిపింది. మొత్తం 130 కోట్ల మైళ్ల దూరం పయనించింది!

ఖెర్సన్.. గేమ్ చేంజర్?

అవమానకర రీతిలో నిష్క్రమించిన రష్యా • పుతిన్‌కు గట్టి ఎదురుదెబ్బ • యుద్ధ గతినే మార్చే అవకాశం

ఎస్.రాజమహేంద్రారెడ్డి



ఖెర్సన్. ఈ ఓడరేవు పట్టణం ఇక తమదేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆర్భాటంగా ప్రకటించి ఎన్నో రోజులు కాలేదు! ఉన్నట్టుండి 'ఖెర్సన్‌ను వీడుతున్నాం. మా సేనలను అక్కణ్నుంచి వెనక్కు రప్పిస్తున్నాం' అంటూ రష్యా అధికారులు ప్రకటించడంతో ఏం జరిగిందో ఎవరికీ అర్థం కావడం లేదు. రష్యా హఠాత్తుగా ఒక అడుగు వెనక్కు ఎందుకేసింది? నిజంగానే రష్యా సేనలు ఖెర్సన్‌పై పట్టు కోల్పోయాయా? లేదంటే ఈ వెనకడుగు వ్యూహాత్మక ఎత్తుగడలో భాగమా...?

జీవితం ఎన్నో పాఠాలు నేర్పుతుందంటారు. పుతిన్‌కు అది ఇప్పుడిప్పుడే తెలిసొస్తున్నట్టుంది. ఖెర్సన్ సహా ఉక్రెయిన్‌లోని నాలుగు పట్టణాలు తమ అధీనంలోకి వచ్చాయని దాదాపు నెలకింద చిరునవ్వులు చిందిస్తూ పుతిన్ కాస్త ఆర్భాటంగానే ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ తాజాగా ఖెర్సన్ నుంచి సేనల ఉపసంహరణ విషయాన్ని మాత్రం రష్యా రక్షణ మంత్రి సెర్గీ షొయిగు వెల్లడించారు. రష్యా ప్రజలకు రుచించని విషయాల వెల్లడికి వీలైనంత దూరంగా ఉండటం పుతిన్‌కు అలవాటే. అందుకే షరామామూలుగా ఖెర్సన్ నుంచి వెనకడగు ప్రకటనలోనూ ఆయన మొహం చాటేశారు. ఆ బాధ్యతను రక్షణ మంత్రికి, ఇతర సైనిక ఉన్నతాధికారులకు అప్పగించడం ద్వారా వారిని వ్యూహాత్మకంగా టీవీల ముందుకు తీసుకొచ్చారు. తద్వారా ఉక్రెయిన్‌తో యుద్ధంలో జరిగే అన్ని పరిణామాలకూ ఇకపై వాళ్లే బాధ్యులవుతారని పుతిన్ చెప్పినట్టయింది. కాకపోతే ఓటమిని రష్యా బహిరంగంగా అంగీకరించడమే చాలా ఆసక్తికరం. ఎందుకంటే ఇలాంటి ఎదురుదెబ్బలను రష్యా అధికారికంగా అంగీకరించడం అత్యంత అరుదు. అదీ ప్రత్యక్ష ప్రసారంలో!

యుద్ధగతినే మార్చే పరిణామం!

ఖెర్సన్ నుంచి రష్యా సేనల ఉపసంహరణను ఉక్రెయిన్ తొలుత నమ్మలేదు. రష్యా వ్యూహాత్మకంగా వల విసిరిందని ఉక్రెయిన్ సైనికాధికారులు భావించారు. ఈ ప్రకటన పాచికేనని, రష్యా సైనికులు పౌరుల వేషంలో ఉక్రెయిన్ జనంతో కలిసిపోయి దొంగ దెబ్బ తీసేందుకు అదను కోసం ఎదురు చూస్తున్నారని అనుమానించారు. ఆ ఆస్కారమూ లేకపోలేదన్నది పరిశీలకుల మాట. ''ఖెర్సన్ నుంచి సేనలను ఉపసంహరించాలని రష్యా చాలా రోజులుగా ఆలోచిస్తోంది. సుశిక్షితులైన సైనికుల స్థానంలో బలవంతంగా ఆర్మీలో చేర్చుకున్న పౌరులను ఖెర్సన్‌లో మోహరించడమే ఇందుకు నిదర్శనం'' అని వారంటున్నారు. ఉక్రెయిన్ దాడులను ముమ్మరం చేయడంతో ఖెర్సన్‌పై పట్టు బిగించడం తమకు దాదాపు అసాధ్యంగా మారిందని రష్యా సైనికాధికారి ఒకరన్నారు. ఖెర్సన్‌ను వదిలేసి నిప్రో నది పశ్చిమ తీరాన సేనలను మోహరిస్తే తమ స్వాధీనంలోని మిగతా ప్రాంతాలను కాపాడుకోవచ్చని రష్యా భావించినట్టు కన్పిస్తోంది. ఉధృతమైన నిప్రో ప్రవాహమే ఉక్రెయిన్ సేనలను నది దాటకుండా అడ్డుకుంటుందన్నది వారి ఆలోచన. మొత్తంమీద ఖెర్సన్ నుంచి రష్యా నిష్క్రమణ యుద్ధగతిని పూర్తిగా మార్చేయడం ఖాయంగా కన్పిస్తోంది. గెలుపోటముల భవిష్యత్తును శాసించేలా ఉంది. స్థూలంగా ఇది రష్యాకు మింగుడు పడని పరిణామమే.

ఈ మూడే ముఖ్యం

వ్యూహాత్మకంగా అతి కీలకం

ఖెర్సన్‌కు వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఉక్రెయిన్ ఓడరేవుల్లో ఇది ప్రధానమైనది. రష్యా ఆక్రమించుకున్న డోన్బాస్ ప్రాంతాల నుంచి క్రిమియా మీదుగా ఉక్రెయిన్ అధీనంలోని ఒడెసా పట్టణానికి ఇదే ప్రధానమైన రవాణా మార్గం. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌ను కైవసం చేసుకోవడంలో యుద్ధం తొలినాళ్లలోనే పూర్తిగా విఫలమైన రష్యా, ఆ తర్వాత తన దృష్టినంతా డోన్బాస్‌ను క్రిమియా కారిడార్‌కు అనుసంధానించడంపై కేంద్రీకరించింది. తద్వారా ఉక్రెయిన్ సేనలను నల్లసముద్రం దరిదాపుల్లోకి రాకుండా నిరోధించాలనుకుంది. ఈ నేపథ్యంలో ఖెర్సన్‌ను చేజేతులా జారవిడుచుకోవడం రష్యాకు కోలుకోలేని ఎదురుదెబ్బే. దీనివల్ల నిప్రో నది పశ్చిమాన సేనలను మోహరించే అవకాశం రష్యా చేజారింది. ఏదో అద్భుతం జరిగితే తప్ప ఈ ప్రతిబంధకాన్ని రష్యా అధిగమించడం ఇక కష్టమే!

క్రిమియాకు కష్టాలే...!

ఖెర్సన్‌లో ఉక్రెయిన్ దళాల మోహరింపు పూర్తయితే రష్యా అధీనంలోని క్రిమియాను కష్టాలు చుట్టుముట్టినట్టే. దానిపై దాడులకు ఉక్రెయిన్‌కు మార్గం సుగమమవుతుంది. అదే జరిగితే రష్యా సేనలకు, పర్యాటకులకు స్వర్గధామంగా ఉన్న క్రిమియా నరకప్రాయంగా మారొచ్చు. ఖెర్సన్ చిక్కడంతో ఉక్రెయిన్ ఇకపై దృష్టినంతా క్రిమియాకు తూర్పున ఉన్న ప్రాంతాలపై కేంద్రీకరిస్తుంది. 2014లో క్రిమియాను ఆక్రమించాక పుతిన్ ఆ ప్రాంతానికి నిప్రో నది నుంచే తాగునీరు అందిస్తున్నారు. ఇకపై దీన్ని ఉక్రెయిన్ పూర్తిగా అడ్డుకునే అవకాశమూ లేకపోలేదు. శాంతి చర్చలంటూ జరిగితే ఈ తాగునీటి అంశం కీలకం కానుంది.

పుతిన్‌కు చావో రేవో

ఉక్రెయిన్ యుద్ధ ఫలితం పుతిన్ రాజకీయ భవితవ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడం ఖాయం. ఖెర్సన్ నుంచి సేనల ఉపసంహరణ ఆయన్ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతుంది. తన వ్యూహాత్మక తప్పిదాలను సైనిక వైఫల్యాలుగా చూపడం ఇకపై కుదరకపోవచ్చు. అలాగే ఓటములను సమర్థించుకోవడమూ ఇక నుంచి అసాధ్యమే కావచ్చు. అంతేగాక తన వ్యూహాత్మక వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఉక్రెయిన్‌పై పుతిన్ మరిన్ని హింసాత్మక దాడులకు దిగే ప్రమాదమూ లేకపోలేదు. అలా గనక జరిగితే బహుశా యుద్ధానికి అదే ఏదోరకమైన ముగింపు పలకవచ్చు కూడా!

రష్యాను పూర్తిగా తరిమేస్తాం: జెలెన్‌స్కీ

- ఖెర్సన్‌లో ప్రజల విజయోల్లాసం
- సైనికులకు సాదర స్వాగతాలు
- ఖఖోవా నుంచీ రష్యా పీఛేముడ్



ఖెర్సన్‌లో ఉక్రెయిన్ సైనికున్ని ఆనందంతో ఆలింగనం చేసుకుంటున్న ఓ యువతి

మైకోలైవ్ (ఉక్రెయిన్): ఖెర్సన్ నుంచి రష్యా పైదొలగడాన్ని ఉక్రెయిన్ పండుగ చేసుకుంటోంది. ఆ ప్రాంత వాసులంతా తమ సైనికులను హర్షాతిరేకాల నడుమ స్వాగతిస్తూ వారిని ఆలింగనం చేసుకుంటూ, ముద్దులు పెట్టుకుంటున్నారు. ఖెర్సన్‌లో నగరమంతా కలియదిరుగుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. ఈ విజయోత్సాహాన్ని ఇలాగే కొనసాగిస్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. ''రష్యా సేనలను దేశమంతటి నుంచీ తరిమేసి తీరతాం. అనేక ప్రాంతాల్లో మా సేనలకు సొంత పౌరుల నుంచి త్వరలో ఇలాంటి మరెన్నో స్వాగతాలు లభించనున్నాయి'' అన్నారు. పడిపోయిన కరెంటు స్తంభాలు, ధ్వంసమైన తాగునీరు తదితర మౌలిక వసతులు. ఎక్కడపడితే అక్కడ మృత్యుఘంటికలు విన్పిస్తున్న మందుపాతరలు. ఇవీ... ఖెర్సన్‌కు వెళ్లే ప్రాంతాల్లో దారి పొడవునా కన్పిస్తున్న దృశ్యాలు. రష్యా సేనల విధ్వంసకాండకు ఇవి అద్దం పడుతున్నాయి. నగరవాసులు తిండి, నీరు, మందులకు అల్లాడుతున్నారు. పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఉక్రెయిన్ అధికార వర్గాలు శాయశక్తులా శ్రమిస్తున్నాయి. మరోవైపు ఖెర్సన్ బాటలోనే ఖఖోవా జిల్లా నుంచి కూడా రష్యా తప్పుకుంటోంది. అక్కడి నుంచి తమ అధికారులు తదితరులను మొత్తంగా వెనక్కు పిలిపిస్తున్నట్టు స్థానిక రష్యా పాలక వర్గం పేర్కొంది. ఉక్రెయిన్ దాడులకు లక్ష్యం కారాదనే ఈ చర్య తీసుకుంటున్నట్టు చెప్పుకొచ్చింది.

రేపట్నుంచి జీ 20 సదస్సు

- నేడు బాలికి ప్రధాని
- ఇండొనేసియా నుంచి భారత్‌కు అధ్యక్ష బాధ్యతలు

న్యూఢిల్లీ/బాలి: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన జీ 20 కూటమి దేశాల సదస్సుకు హాజరవడానికి ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఇండొనేసియా బయల్దేరి వెళుతున్నారు. ఇండొనేసియాలోని బాలిలో 15, 16 తేదీల్లో జరిగే 17వ జీ 20 శిఖరాగ్రంలో మూడు ముఖ్యమైన సెషన్స్‌లో పాల్గొంటారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, జర్మనీ ఛాన్సలర్ ఒలఫ్ స్కోల్జ్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లు కూడా హాజరవనున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ రావడం లేదు.

అధ్యక్ష బాధ్యతలు భారత్‌కు

20 దేశాల కూటమి అయిన జీ 20 18వ సదస్సుకు 2023లో భారత్ అధ్యక్షత వహించనుంది. బాలి సదస్సులో ఇండొనేసియా నుంచి సారథ్య బాధ్యతలను భారత్ అందుకోనుంది.



సునాక్‌తో ప్రత్యేకంగా భేటీ!

జీ 20 సదస్సుకు హాజరయ్యే దేశాధినేతలతో మోదీ ప్రత్యేకంగా భేటీ అయి ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపే అవకాశాలున్నాయి. దీంతో అందరి దృష్టి భారత సంతతికి చెందిన బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో మోదీ భేటీపై ఆసక్తి నెలకొంది. అయితే వీరిద్దరి మధ్య భేటీ ఉంటుందో లేదో ఇరుపక్షాలు కూడా స్పష్టం చేయలేదు.

కడు పేదరికం నుంచి 'అగ్ర' శాస్త్రవేత్త దాకా...

తిండికి కరువైన రోజుల నుంచి ఉన్నతస్థాయికి • గడ్చిరోలి గిరిజన యువకుని స్ఫూర్తిదాయక గాథ



నాగ్‌పూర్: కటిక పేదరికంలోనూ అకుంఠిత దీక్షతో చదువుపై దృష్టిపెట్టి శాస్త్రవేత్తగా ఎదిగాడు మహారాష్ట్రకు చెందిన ఓ గిరిజన వ్యక్తి. కష్టపడే తత్వంతో ఎలాంటి సమస్యలనైనా దీటుగా ఎదుర్కోవచ్చని చాటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన అతని పేరు భాస్కర్ హలామీ (44). ఆయన కుటుంబం కుర్ఖేదా తహసీల్ పరిధిలోని చిర్చాది గ్రామంలో ఉండేది. అక్కడి నుంచి అమెరికాలోని మేరీలాండ్‌లో ప్రఖ్యాత బయోఫార్మా సంస్థ సిర్నావోమిక్స్‌లో సీనియర్ సైంటిస్ట్ (రీసెర్చ్, డెవలప్‌మెంట్) స్థాయికి ఎదిగారు బాస్కర్. ఆ క్రమంలో ఆయన పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ''మాది నిరుపేద కుటుంబం. ఒక్కపూట భోజనం కూడా కష్టంగా ఉండేది. ఇప్పుడు తలచుకుంటే ఆ కష్టాలన్నీ ఎలా గట్టెక్కామా అని ఆశ్చర్యం వేస్తుంది. చేయటానికి పని ఉండేది కాదు. వర్షాకాలంలో మరీ దారుణం. తింటానికే ఉండేది కాదు. అస్సలు అరగని మహువా పూలను తెచ్చుకుని వండుకుని వాటినే తినేవాళ్లం. కొద్దిగా దొరికే ముడి బియ్యంతో గంజి కాచుకుని తాగేవాళ్లం. మా కుగ్రామంలో 90 శాతం కుటుంబాలది ఇదే దీనావస్థ. మా తల్లిదండ్రులు ఇతరుల ఇళ్లలో పనిచేసేవారు. నాన్నకు ఊరికి 100 కి.మీ. దూరంలో స్కూల్లో వంటమనిషిగా పని దొరికాక అక్కడికి వెళ్లిపోయాం. యవత్మాల్‌లోని విద్యానికేతన్ ప్రభుత్వ పాఠశాలలో పది దాకా చదివా. అమ్మానాన్నలకు చదువు విలువ బాగా తెలుసు. వాళ్లు పస్తులుండి మాకు అన్నం పెట్టారు. ఉన్నదంతా మా చదువుకే ఖర్చు పెట్టేవారు. గడ్చిరోలీలో సైన్స్‌లో డిగ్రీ చేశాక నాగ్‌పూర్‌లో కెమిస్ట్రీలో పీజీ చేశా. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యా. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలోనూ పాసయ్యా. కానీ నాకు పరిశోధనపై ఆసక్తి. అందుకే అమెరికా వెళ్లి మిషిగన్ వర్సిటీలో డీఎన్ఏ, ఆర్ఎన్ఏలో పీహెచ్‌డీ చేశా. ఇప్పటికీ ఈ రంగంలో నియామక కంపెనీలు నా సలహాల కోసం కుప్పల కొద్దీ మెయిల్స్ పంపుతుంటాయి. మా సొంతూళ్లో అమ్మానాన్నలకు ఇల్లు కట్టిచ్చా'' అని భాస్కర్ చెప్పుకొచ్చారు. భాస్కర్ స్ఫూర్తిదాయక గాథ అందరికీ తెలిసేలా రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ 'టీ విత్ ట్రైబల్ సెలబ్రిటీ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది!

18 ఏళ్లుగా ఎయిర్‌పోర్ట్‌లోనే.. అక్కడే తుదిశ్వాస



ప్రఖ్యాత హాలీవుడ్ దర్శకుడు స్టీఫెన్ స్పీల్‌బర్గ్ 'ది టర్మినల్' హిట్ సినిమాకు స్ఫూర్తి అయిన ఇతని పేరు మెహ్రాన్ కరిమి నసీరి. ఇరాన్‌లోని మస్జిద్ సులేమాన్ సిటీలో పుట్టాడు. బ్రిటన్‌లో స్థిరపడాలనుకున్నాడు. అందుకు బ్రిటన్ నిరాకరించింది. బ్రిటన్‌లో భాగమైన స్కాట్లాండ్ తన తల్లి స్వస్థలం గనుక తనకు బ్రిటన్‌లో నివసించే హక్కుందని వాదించినా లాభంలేకపోయింది. ఆ సమయానికి పారిస్‌లోని చార్లెస్ డిగాల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన మెహ్రాన్ అక్కడే ఆగిపోయాడు. ఇక దాన్నే తన స్థిరనివాసంగా మార్చుకున్నాడు. ఏకంగా 18 ఏళ్లు అక్కడే గడిపాడు! అనారోగ్యంతో కొన్నేళ్లు బయటికెళ్లినా ఇటీవల మళ్లీ తిరిగొచ్చి ఎయిర్‌పోర్ట్‌లోనే నివసిస్తున్నాడు. శనివారం తీవ్రమైన గుండెపోటుతో మరణించాడు. అలా... ఎన్నో ఏళ్లుగా గడపిన విమానాశ్రయంలోనే శాశ్వత విశ్రాంతి తీసుకున్నాడు!!

61 కిలోల బంగారం పట్టివేత

ముంబైలోని ఛత్రపతి శివాజీ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.32 కోట్ల విలువైన 61 కేజీల బంగారం. ఈ ఎయిర్‌పోర్ట్‌లో ఒకేరోజులో ఇంతమొత్తంలో బంగారం స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి. ఈ ఘటనలో టాంజానియా, దుబాయ్‌ల నుంచి వస్తున్న ఇద్దరు మహిళలుసహా ఏడుగురిని అధికారులు అరెస్ట్ చేశారు.



ఎయిర్ షోలో విషాదం



అమెరికాలోని డాలస్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ షోలో రెండు చారిత్రక అమెరికా యుద్ధ విమానాలు ఇలా ఢీకొని కుప్పకూలాయి. ఇందులో ఆరుగురు బలయ్యారు.

చెన్నైని ముంచెత్తిన వాన



చెన్నై, మొగలివాక్కంలో బాధితులను పడవల్లో తరలిస్తున్న సిబ్బంది

సాక్షి, చెన్నై: తమిళనాడులోని సముద్ర ప్రభావిత జిల్లాల్లో వరుణ బీభత్సం కొనసాగుతోంది. దీంతో చెన్నైలో భారీ వర్షం కురిసింది. చాలా చోట్ల రహదారులు నీటమునిగాయి. మరోవైపు ఆదివారం కడలూరు, మైలాడుతురై జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. మైలాడుతురై జిల్లా శీర్గాలిలో గత 24 గంటల్లో 44 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఫలితంగా ఈ పట్టణం దీవిని తలపిస్తోంది. ఇక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. శీర్గాలిలో 14 వేల మంది శిబిరాలకు తరలించారు. లక్ష ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. నాగపట్నం, తంజావూరు, తిరువారూర్, దిండిగల్ జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం వేకువ జామున చెన్నై శివారులోని మొగలివాక్కం, మాంగాడు పరిసరాల్లో కుండ పోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో 1000 కుటుంబాలకు చెందిన 2500 మంది నిరాశ్రయులయ్యారు. వరద బాధితులను అధికారులు పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. చెన్నై ఓట్టేరి, తిరువీకానగర్, కొళత్తూరు పరిసరాలలో చేపడుతున్న వర్షపు నీటి తొలగింపు పనులను సీఎం స్టాలిన్ ఆదివారం పరిశీలించారు.

సాక్షి
విజయనగరం

సోమవారం । 14 । నవంబర్ । 2022



పేదలకు పరమాన్నం

పేదలకు ప్రతి నెలా నాణ్యమైన రేషన్ బియ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

- 8లో



తప్పిన ముప్పు

విశాఖ-రాయగడ రైల్వేలైన్‌లో సీతానగరం రైల్వే స్టేషన్ పరిధి చినభోగిలి రైల్వే గేటు సమీపంలో ఆదివారం రైలు డ్రైవర్ అప్రమత్తం కావడంతో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది.

- 8లో

ఐఎంఏకు అవార్డులు

విజయనగరం ఫోర్ట్: ఇండియన్ మెడికల్ అసిసోసియేషన్ (ఐఎంఏ) విజయనగరం శాఖ ఏడు అవార్డులు సాధించింది. నంద్యాలలో ఆదివారం జరిగిన రాష్ట్ర సదస్సులో అవార్డులను ఐఎంఏ ప్రతినిధులు అందుకున్నారు. రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు (ఎలక్ట్)గా విజయనగరానికి చెందిన డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు (జె.సి.నాయుడు) బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం బ్రాంచికు రెండు అవార్డులు, ఎక్సలెన్స్ అవార్డులు ఐదు అందుకున్నారు. ఎక్సలెన్స్ అవార్డులను డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ జేసీ నాయుడు, డాక్టర్ మధుకర్, డాక్టర్ బలరాం నాయుడు, డాక్టర్ వివేక్‌లు అందుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు డీజీపీ రాక

విజయనగరం క్రైమ్: రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం జిల్లాకు రానున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.

పరీక్ష ప్రశాంతం



కొట్టాం పాఠశాలలో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న సుగుణాకరరావు

విజయనగరం అర్బన్: అక్షరాస్యత నమోదు అర్హత కోసం జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ప్రాథమిక స్థాయి పరీక్ష (అసెస్‌మెంట్ టెస్ట్) ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 27 మండలాల్లో చిట్టిగురువుల ద్వారా బోధన పూర్తి చేసుకున్న లక్షా రెండు వేల 345 మంది అభ్యాసకులకు ఈ పరీక్ష నిర్వహించారు. 87.6 శాతంతో 74,694 మంది అభ్యాసకులు మాత్రమే హాజరయ్యారు. వీరిలో పురుషులు 25,833 మంది, స్త్రీలు 48,861 మంది ఉన్నారు. ఎస్.కోట మండలంలోని కొట్టాం, గోపాలపురం గ్రామాల్లో పరీక్ష కేంద్రాలను వయోజన విద్య ఉప సంచాలకులు పర్యవేక్షించారు.

చట్టాలపై అవగాహన అవసరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కళ్యాణ్ చక్రవర్తి

నెల్లిమర్ల రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. మండలంలోని సతివాడ గ్రామంలో న్యాయ అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాల గురించి తెలుసుకుంటే సమస్యలు నుంచి దూరం కావచ్చునని అన్నారు. స్త్రీల పట్ల గౌరవ భావంతో మెలగాలని సూచించారు. స్త్రీలు, చిన్నారులకు జరిగిన అన్యాయాల పట్ల ప్రత్యేక దృష్టి సారించామని, ఆ కేసుల్లో బాధితులకు నష్ట పరిహారం వెంటనే అందుతుందన్నారు. మధ్యవర్తిత్వంతో సమస్యలను పరిష్కరించుకోవచ్చునని అన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు, ఎరువుల సమస్యలపై సదస్సులో అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జిలు లక్ష్మీకుమారి, శ్రీనివాసరావు, అదనపు జిల్లా జడ్జి సికింద‌ర్ భాషా, ఎస్ఐ నారాయణ రావు, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ఇద్దరు పర్యాటకుల గల్లంతు

- కాపాడి ఒడ్డుకు చేర్చిన మత్స్యకారులు, మెరైన్ హోంగార్డులు



ప్రాణాలతో సురక్షితంగా బయటపడిన బాలకృష్ణ, శేఖర్‌తో మెరైన్ పోలీసులు

పూసపాటిరేగ : మండలంలోని చింతపల్లి బీచ్‌లో ఆదివారం సాయంత్రం ఇద్దరు పర్యాటకులు గల్లంతయ్యారు. క్షణాల్లో అప్రమత్తమైన మత్స్యకారులు, మెరైన్ హోంగార్డులు వారిని కాపాడారు. వివరాల్లోకి వెళ్తే... పూసపాటిరేగ మండలం కొవ్వాడకు చెందిన కొవ్వాడ బాలకృష్ణ, పూసపాటిరేగ మండలం కొత్తకొప్పెర్లకు చెందిన సోమాదులు శేఖర్ ఆదివారం చింతపల్లి బీచ్‌కు సందర్శనకు వచ్చారు. బీచ్‌లో స్నానానికి దిగిన సమయంలో కెరటాల ఉధృతికి రెప్పపాటు కాలంలో సముద్రంలోకి కొట్టుకుపోయారు. అక్కడ ఉన్న పర్యాటకులు పెద్దగా కేకలు వేశారు. దీన్ని గమనించిన చింతపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారులు అమరరాము, మైలపల్లి అప్పన్న, బర్రి రాంబాబుతో పాటు మెరైన్ హోంగార్డులు మైలపల్లి నూకయ్య, కొమర కొర్లయ్య సముద్రంలోకి దుమికి ఈదుకుంటూ లోపలికి వెళ్లి ఆ ఇద్దరిని అతి కష్టం మీద కాపాడారు. మెరైన్ ఎస్ఐలు వి.శ్రీనివాస్, పి.రమేష్‌తో పాటు మెరైన్ సిబ్బంది, మత్స్యకారులను పలువురు అభినందించారు.

కేజీబీవీల్లో కొత్త ఒరవడి

- అభ్యసనా సామర్థ్యాలకు అనుగుణంగా గ్రేడ్‌లు
- సీ-గ్రేడ్ బాలికలు ఏ-గ్రేడ్‌కు చేరుకునేలా ప్రత్యేక బోధన
- జిల్లాలోని 26 కేజీబీవీల్లో వినూత్న ప్రయోగం
- పదోతరగతిలో సత్ఫలితాల సాధనకు 'సూపర్-60' పేరుతో ప్రత్యేక శిక్షణ
- పాఠశాలలో బోధన సిబ్బంది సెల్‌ఫోన్ వినియోగం నిషేధం



విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ప్రమాణాలతో కూడిన విద్యా బోధనతో పాటు రుచికరమైన భోజనం అందిస్తూ నాణ్యమైన చదువులను అందిస్తోంది. కేజీబీవీలలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. బాలికల అభ్యసనా సామర్థ్యాలు ఆధారంగా గ్రేడ్‌లు కేటాయించి ప్రత్యేక బోధన సాగిస్తోంది. వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తోంది.

విజయనగరం అర్బన్/పూల్‌బాగ్:

కేజీబీవీలు... చదువును మధ్యలోనే ఆపేసిన, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన, నిరుపేద కుటుంబాల బాలికలకు దారిచూపే విద్యాదీపాలు. వారి భవిష్యత్‌కు బాటలు వేసే సరస్వతీ నిలయాలు. కేజీబీవీ బాలికల చదువుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఇందులో భాగంగా కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో చదువుతున్న బాలికల బంగారు భవిష్యత్‌కు జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు గట్టిపునాది వేస్తున్నారు. అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ప్రత్యేక బోధనా ప్రణాళికను అమలు చేస్తున్నారు. చదువులో ప్రతిభ చూపేవారిని సూపర్-60 బ్యాచ్‌కు ఎంపిక చేసి శతశాతం మార్కులు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే కేజీబీవీల్లో బోధన సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించిన అధికారులు.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. అభ్యసనా సామర్థ్యాలను బట్టి ఏ,బీ,సీ గ్రేడ్‌లుగా విభజిస్తున్నారు. విద్యాసంవత్సరం పూర్తయ్యే సరికి సీ గ్రేడ్‌లో ఉన్న బాలికలందరూ ఏ గ్రేడ్‌లోకి వచ్చేలా తర్ఫీదునిస్తున్నారు.

వినూత్న ప్రయోగం

కేజీబీవీలో 6వ తరగతిలో చేరిన బాలికల అభ్యసనా సామర్థ్యాలను ముందుగా గుర్తిస్తారు. ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో రాయడం, చదవడం పూర్తిస్థాయిలో రానివారికి సీ గ్రేడ్ ఇస్తారు. వారికి ప్రాథమిక స్థాయి నుంచి బోధన సాగిస్తారు. ప్రతి రోజూ వారి అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేస్తారు. చదువుపై శ్రద్ధ చూపేలా మానసికంగా సిద్ధం చేస్తారు. చదవడం, రాయడం పూర్తిస్థాయిలో వచ్చాక పాఠ్యాంశాలను సులభపద్ధతుల్లో, అర్థమయ్యేలా బోధిస్తారు. విద్యాసంవత్సరం పూర్తయ్యే సరికి సీ-గ్రేడ్‌లో ఉన్నవారిని ఏ గ్రేడ్‌లోకి చేర్చేలా చక్కని విద్యాప్రణాళికను అమలుచేస్తున్నారు. ఆరో తరగతిలో చేరిన బాలిక ఇంటర్మీడియట్ పూర్తయ్యే సరికి ప్రతిభావంతురాలిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సర్వశిక్ష అధికారులు ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని 26 కేజీబీవీలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 6,875 మంది బాలికలు చదువుతున్నారు. వీరిని గ్రేడ్‌లుగా విభజించారు. గ్రేడ్-ఏ అత్యధికంగా 2,713 మంది, బీ-లో 2,344 మంది, గ్రేడ్ సీలో 1,800 మంది ఉన్నారు.



గంట్యాడ కేజీబీవీలో గ్రేడ్-సీ బాలికలకు రెమిడీ తరగతులు

జిల్లాలోని కేజీబీవీల్లో తరగతుల వారీగా బాలికల సంఖ్య ఇలా..

తరగతి	బాలికల సంఖ్య
6వ	1,094
7వ	1,084
8వ	1,049
9వ	1,064
10వ	1,048
ఇంటర్ ఫస్టియర్	725
సెకండియర్	793

సూపర్-60 బ్యాచ్

కార్పొరేట్ తరహాలోనే అన్ని కేజీబీవీలలోనూ చదువులో ప్రతిభ చూపుతున్న పదోతరగతి బాలికలను సూపర్-60 బ్యాచ్‌కు ఎంపిక చేస్తున్నారు. బొబ్బిలి, జామి, విజయనగరం కేజీబీవీలలో మూడు బ్యాచ్‌లను నిర్వహిస్తూ, నిపుణులైన బోధకులతో పాఠ్యాంశ బోధన సాగిస్తున్నారు. రాష్ట్రస్థాయిలోనే చదువులో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దుతున్నారు. గత ఏడాది ఒకే కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ఈ సారి మూడుకేంద్రాల్లో అధిక మంది బాలికలకు ప్రయోజనం కలిగేలా తరగతులు కొనసాగిస్తున్నారు. మరోవైపు కేజీబీవీలలో బోధించే టీచర్ల, అధ్యాపకులు ఫోన్ల వినియోగాన్ని నిషేధించారు. విద్యాలయాలకు వెళ్లిన వెంటనే ఫోన్లు తీసుకుని ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన లాకర్లలో భద్రపరుస్తున్నారు.

సంవత్సరం	విద్యార్థుల భోజనం కోసం అయిన ఖర్చు
2022-21	రూ.63 లక్షల 86 వేలు
2021-22	రూ.కోటి 75 లక్షలు
2022-23	రూ.కోటి 80 లక్షలు

నాణ్యమైన భోజనం

కేజీబీవీ, మోడల్‌స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన భోజనం వడ్డిస్తోంది. ఓ వైపు చదువుపై శ్రద్ధ చూపుతూనే విద్యార్థినీ విద్యార్థులు ఆరోగ్యంగా ఎదిగేలా రుచికరమైన భోజనం వడ్డిస్తోంది. గత జనవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న రైతు భరోసా కేంద్రాలలో రిజిస్టర్ అయిన ఫుడ్ ప్రోసెసింగ్ ఆర్గనైజర్స్‌తో అగ్రిమెంట్ కుదుర్చుకుని తాజా కూరగాయలు సరఫరా చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 14 ఎఫ్‌పీఓలు కూరగాయలు సరఫరా చేస్తున్నాయి. అలాగే, విద్యార్థులకు గుడ్లు, పాలు, పండ్లును ప్రభుత్వం సమకూర్చుతోంది. మూడున్నరేళ్లలో విద్యార్థుల భోజనం కోసం సుమారు రూ.3కోట్లు ఖర్చు చేసింది.



జామి కేజీబీవీలో బాలికల కోసం సిద్ధమైన పౌష్టికాహారం

బాలికల చదువుపై ప్రత్యేక శ్రద్ధ



కేజీబీవీల్లో చదువుతున్న బాలికలంతా దాదాపు పేద, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వారే. వారి విద్యాభ్యసన సామర్థ్యాలకు అనుగుణంగా బోధన ప్రణాళికలను రూపొందించాం. కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు బాలికల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. చదువు ఆధారంగా బాలికలను గ్రేడ్‌లుగా విభజించి బోధన సాగిస్తున్నాం. నిరాటంకంగా బోధన తరగతుల నిర్వహణ కోసం సెల్‌ఫోన్ల వినియోగాన్ని అదుపులో ఉంచే చర్యలు చేపట్టాం. ప్రిన్సిపాల్ పర్యవేక్షణలో లంచ్ అవర్‌లో మినహా బోధన సమయంలో ఫోన్ వినియోగాన్ని నిషేధించాం.

– డాక్టర్ వి.ఎ.స్వామినాయుడు, ఏపీసీ, సర్వశిక్ష

• జాతీయ జెండాకు అగౌరవం



జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విజయనగరం జిల్లా పర్యటనకు ఆదివారం వచ్చారు. ఈ క్రమంలో రోడ్డు షో నిర్వహించారు. ఏ పార్టీ కార్యక్రమాలైనా ఆ పార్టీ జెండాలతో ర్యాలీలు, సభలు నిర్వహించడం సహజం. జనసేన నేత పవన్‌కల్యాణ్ రోడ్డు షోలో ఆ పార్టీ అభిమానులు జాతీయ జెండాను అవమానించారు. జాతీయ జెండాకు వేరే జెండా కలిపి ఎగురవేయడం అగౌరవం. కానీ జనసేన కార్యకర్తలు జాతీయ జెండాకు దిగువన జనసేన జెండా పెట్టి రెండూ ఒకే కర్రకు జోడించి ర్యాలీలో షో చేశారు. పట్టణంలో రహదారి బంగ్లా రోడ్డులో ర్యాలీ జరిగిన సమయంలో ఈ జెండాలు కార్యకర్తలు చేతబూని పాల్గొన్నారు. దీంతో పలువురు విస్తుపోయారు. జాతీయ జెండాను ఇలా అగౌరవ పరచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ఔరా.. కాంతార

- ఆకట్టుకున్న కొత్తవలస తహసీల్దార్
- అభినందించిన గుంటూరు కలెక్టర్

కొత్తవలస : ఆయనో తహసీల్దార్... కళలంటే ఆయనకు ఎనలేని అభిమానం. అవకాశం దొరికితే తనలో ఉన్న కళను ప్రదర్శించిన పదుగురిని ఆకర్షించి అభినందనలు అందుకుంటారు. ఆయనే కొత్తవలస తహసీల్దార్ డి.ప్రసాదరావు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల విడుదలైన సూపర్ డూపర్ హిట్ తమిళ డబ్బింగ్ చిత్రం కాంతారలో ఒక సీనుకు సంబంధించి తహసీల్దార్ ప్రసాదరావు ఏకపాత్ర అభినయం చేసి ప్రశంసలు అందుకున్నారు. గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఆరో ఆంధ్రప్రదేశ్ స్టేట్ రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో ఆయన విజయనగరం జిల్లా తరపున పాల్గొని అలరించారు. కల్చరల్ కార్యక్రమంలో భాగంగా కాంతార సినిమాలో హీరో పాత్రను ఏకపాత్ర అభినయంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి రెవెన్యూ సిబ్బంది పోటీ పడిన ఈ కార్యక్రమంలో కాంతార అభినయం ప్రశంసలు అందుకొంది. కాంతార హీరోకు సమాంతరంగా ప్రసాదరావు మేకప్ అయి అలరించారు. ఈ సందర్భంగా గుంటూరు కలెక్టర్ ఢిల్లీరావు ప్రశంసల జల్లు కురిపించి సెల్ఫీ దిగారు. ప్రసాదరావుకు ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. ఈయనను రెవెన్యూ సిబ్బంది అభినందించారు.



కాంతార ఏకపాత్ర అభినయంలో ఉన్న ప్రసాదరావును అభినందిస్తున్న గుంటూరు కలెక్టర్ ఢిల్లీరావు

రాజకీయాల్లో పరిపక్వత లేని పవన్

- పవన్ జగనన్న కాలనీకి వచ్చారు.. చూశారు.. వెళ్లారు..
- ఒక్క రూపాయైనా అవినీతి జరిగిందని నిరూపించగలరా!
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- కేఏ పాల్‌కు.. పవన్‌కల్యాణ్‌కు తేడా లేదు..: ఎంపీ బెల్లాన
- పవన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు : ఎమ్మెల్సీ సురేష్‌బాబు



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

ప్రజాస్వామ్యం అంటే తెలియని, పరిపక్వత లేని నాయకుడు పవన్ కల్యాణ్ అని రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, శాసనమండలి సభ్యులు డాక్టర్ పివి.సూర్యనారాయణరాజు విమర్శించారు. విజయనగరంలోని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ కారణం తెలియకుండా పర్యటనకు వచ్చి అవినీతి జరిగిందంటూ ప్రకటనలు చేయటం సరికాదన్నారు. అసలు పవన్‌కల్యాణ్ ఎందుకు వచ్చారు...? వెనుక కేకలు వేసిన అభిమానులు ఎందుకు వచ్చారో ఎవ్వరికీ తెలియదని... కేవలం రాజకీయ ఉనికిని చాటుకునేందుకు మాత్రమే వచ్చారని ఎద్దేవా చేశారు. అవినీతి జరిగింది నిరూపిస్తామని చెప్పే దమ్మున్న పరిస్థితి ఉందా! పవన్ కల్యాణ్‌కు అంటూ ప్రశ్నించారు. వచ్చావు... చూశావు... వెళ్లావు..... ? గుంకలాం జగనన్న కాలనీలో రూ.1 అవినీతి చూపించగలరా అంటూ సవాల్ విసిరారు. చంద్రబాబును సంతోష పెట్టేందుకే పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో జనసేనకు ఘోర పరాభవం తప్పదన్నారు. లబ్ధిదారుల్లో గృహ నిర్మాణం చేసుకుంటున్న ఒక్క మహిళా కూడా రాని పరిస్థితిని చవి చూశారన్నారు. యావత్ రాష్ట్ర ప్రజలు ప్రభుత్వం చేస్తోన్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కళ్లారా చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ నేతృత్వంలో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు.

కేఏ పాల్‌కు... పవన్‌కల్యాణ్‌కు తేడా లేదు... : ఎంపీ బెల్లాన

విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ కేఏ పాల్‌కు, పవన్ కల్యాణ్‌కు తేడా లేదని అన్నారు. మాట్లాడుతున్న మాట, భాష ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, యువతను పెడత్రోవ పెట్టే విధంగా ఉన్నాయని అన్నారు. ప్యాకేజీ ఉంటేనే పవన్ కల్యాణ్ రోడ్డు మీదకు వస్తాడని అన్నారు. ఒక్క సీటు కూడా గెలవలేని పవన్ కల్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ పివి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ పర్యటనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని జనసేన నాయకులు చెబుతున్న మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని అన్నారు. ఉత్తరాంధ్ర గురించి మాట్లాడే అర్హత పవన్ కల్యాణ్‌కు లేదన్నారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతీ దేవి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు, నియోజకవర్గ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ ఆరోపణలు అవాస్తవం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: జగనన్న లేఅవుట్లు, కాలనీల నిర్మాణంపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గుంకలాంలో ఆదివారం పర్యటించిన అనంతరం అక్కడ వేల సంఖ్యలో నిర్మితమవుతున్న ఇళ్లను చూసి అవాక్కై ఏమి మాట్లాడలేక అవాస్తవాలు మాట్లాడి వెనుదిరిగారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి తారతమ్యం లేకుండా పేదలందరికీ అర్హత ప్రాతిపదికన ఇళ్లు మంజూరు చేసి అందించిన ఘనత ఆయనదేనన్నారు. పవన్ కల్యాణ్ పార్ట్‌టైమ్ రాజకీయ నాయకుడని, రాష్ట్రంలో ఏ అంశంపైనా ఆయనకు అవగాహన లేదని విమర్శించారు. గుంకలం లే అవుట్‌లో జగనన్న కాలనీ సందర్శించిన ఆయన ఏ ఒక్క లబ్ధిదారునితో మాట్లాడకుండా అవాస్తవమైన ఆరోపణలు ప్రభుత్వంపై చేయడం సహేతుకం కాదన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో లబ్ధి కాలనీల్లో విద్యుత్, రోడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించిందని, లేఅవుట్ వద్ద ఇసుక, ఇనుము వంటి మెటీరియల్ సరఫరా చేస్తోందని వివరించారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా పేదలకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామని, ఈ ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

శృంగవరపుకోట: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో డాక్టర్ అప్పలనాయుడు ఉక్కు క్రీడా మైదానంలో జరిగిన 42వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయగనరం జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఏకంగా 123 పతకాలు వివిధ క్రీడల్లో సాధించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారని జిల్లా సంఘం కార్యదర్శి ఎం.ఎస్.ఎస్.మూర్తి తెలిపారు. క్రీడాకారులను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్.నరసింహులు సత్కరించారు. భవిష్యత్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

క్లుప్తంగా

పాత పెన్షన్ అమలుచేయాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు

విజయనగరం టౌన్: ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సీపీఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోమని పాతపెన్షన్‌ను మాత్రమే అమలుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ మినిస్టీరియల్ హాల్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య వక్తగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ మాత్రమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు జేఆర్‌సీ పట్నాయక్, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, గౌరవాధ్యక్షుడు ఎ.సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: సీతానగరం మండల కేంద్రానికి కోట నాగరాజు పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా కడుపునొప్పి, నరాల బలహీనతతో బాధపడుతున్న నాగరాజు ఎన్ని ఆస్పత్రులు తిరిగినా తగ్గకపోవంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగు మందు తాగేశాడు. అనంతరం వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108 లో పార్వతీపురం జిల్లా ఆస్పత్రి తరలించారు. వైద్యులు చికిత్స అందజేశారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం


బస్సు ఢీకొన్న లారీ

పార్వతీపురంటౌన్: మండలంలోని నర్సిపురం బస్టాప్ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును ఓ లారీ ఢీకొన్న సంఘటనలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. బస్టాప్ వద్ద ఆగి ఉన్న బస్సును శంబరనుంచి పార్వతీపురం వస్తున్న క్వారీ లారీ వెనుకనుంచి ఢీకొంది. ఈ ఘటనలో బస్సు వెనుకభాగం దెబ్బతింది. అయితే బస్సు ఆగి ఉన్నందున పెనుప్రమాదం తప్పిందని, బస్సులోవున్న ప్రయాణీకులంతా సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోగా రూరల్ పోలీసుల జోక్యం చేసుకుని క్రమబద్ధీకరించారు.

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య


చింపి షైనీ (ఫైల్)

విజయనగరం క్రైమ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయత్‌పూర్‌కు చెందిన చింపి షైనీ (20)స్థానిక తోటపాలెంలో ఆదివారం వేకువజామున ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. చింపి షైనీ విశాఖలోని ప్రైవేట్‌హోటల్‌లో పనిచేస్తోంది. ఆమె మరో ఇద్దరు యువతులతో కలిసి విజయనగరంలోని తోటపాలెం షిర్డీసాయినాథ్ కాలనీలో నెలరోజుల క్రితం అద్దెకు దిగింది. వారు ముగ్గురూ శనివారం రాత్రి పార్టీ చేసుకుని అర్ధరాత్రి 2.30 గంటలకు నిద్రలోకి జారుకున్నారు. ఆదివారం ఉదయం 6.30గంటల ప్రాంతంలో ఇంటి యజమాని చూసేసరికి షైనీ బెడ్‌రూంలో కిటికీకీ చున్నీ బిగించుకుని ఉరివేసుకుంది. అయితే ఆమె అనాథ. ఆత్మహత్యకు ప్రేమవ్యవహారం కారణమై ఉంటుందా? లేక ఏదైనా వ్యవహారంలో మనస్తాపం చెందిందా? ఇంకేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇంటియజమాని ఫిర్యాదు మేరకు వన్ టౌన్ ఎస్సై విజయ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి కేసు నమోదు చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	52,640-00
బంగారం(22క్యా. 10గ్రా.)	48,260-00
వెండి (కిలో)	67,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

పేదలకు పరమాన్నం

- రేషన్ షాపుల ద్వారా నాణ్యమైన బియ్యం సరఫరా
- సార్టెక్స్ రకం ఇచ్చేందుకు మిల్లర్ల సుముఖత
- 2 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు ప్రభుత్వం చర్యలు
- ధాన్యం కొనుగోలు లక్ష్యం: 2,98,935 మెట్రిక్ టన్నులు


వీరఘట్టంలో ఓ రైస్ మిల్లులో అమర్చుతున్న సార్టెక్స్ మెషినరీ

వీరఘట్టం: పేద ప్రజలకు ప్రతి నెలా నాణ్యమైన రేషన్ బియ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా ఏటా ఖరీఫ్‌లో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించి, తర్వాత వారి నుంచి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పేరిట బియ్యం సేకరిస్తోంది. ఇలా సేకరించిన బియ్యం మరింత నాణ్యంగా ఉండేలా తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మిల్లర్లు కూడా నాణ్యమైన బియ్యం (సార్టెక్స్ రైస్) ప్రభుత్వానికి ఇచ్చేందుకు సముఖత వ్యక్తం చేశారు. అంతేకాకుండా కొన్ని మిల్లులు వాటి సామర్థ్యాన్ని పెంచుతూ నాణ్యమైన బియ్యం అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి.

సిద్ధమవుతున్న మిల్లులు

ఏటా ఖరీఫ్‌లో పండిన ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఇలా సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు 1:1 పూచీ కత్తుపై అందజేస్తూ మళ్లీ వారి నుంచి సీఎంఆర్ పేరిట క్వింటా ధాన్యానికి బదులుగా 67 కిలోల బియ్యం సేకరిస్తోంది. ఇలా సేకరిస్తున్న బియ్యం మరింత నాణ్యంగా ఉండేలా ఈ ఏడాది చర్యలు చేపట్టింది. ఇక మీదట మిల్లరు తాము తీసుకున్న ధాన్యానికి బదులు సార్టెక్స్ బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం కోరింది. దీనికి మిల్లర్లు కూడా సుముఖత వ్యక్తం చేశారు. ప్రస్తుతం జిల్లాలో 92 రైస్ మిల్లులుండగా వాటిలో 27 వరకు సార్టెక్స్ మిల్లులు. ప్రభుత్వ నిర్ణయంతో మరో 40 మిల్లులు సార్టెక్స్ బియ్యం ఇచ్చేందుకు వాటి మెషినరీ సామర్థ్యాన్ని పెంచుతున్నాయి.

ఇదీ పరిస్థితి...

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 1,71,105 ఎకరాల్లో వరి పంట సాగులో ఉండగా 3,27,921 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నారు. ఇందులో 2,98,935 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సకాలంలో కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించి వారి నుంచి కస్టమ్స్ మిల్లింగ్ రైస్ పేరిట సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల సార్టెక్స్ బియ్యం సేకరించేందుకు అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

సార్టెక్స్ బియ్యం మాత్రమే సేకరిస్తాం

ఈ ఏడాది పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించేందుకు వారి నుంచి బ్యాంకు గ్యారంటీలు అడిగాం. అందుకు మిల్లర్లు అంగీకరించారు. అలాగే సార్టెక్స్ బియ్యం ఇచ్చేందుకు అనుగుణంగా మిల్లులను ఆధునికీకరించాలని సూచించాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 27 సార్టెక్స్ మిల్లులు ఉన్నాయి. మరో 40 మిల్లుల్లో కొత్తగా మెషినరీ అమరుస్తున్నారు. ఈ సీజన్‌కే ఆ మిల్లులు అందుబాటులోకి వస్తాయి. **దేవుళ్ల నాయక్**, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్, పార్వతీపురం మన్యం జిల్లా

సార్టెక్స్ మిల్లులుగా సామర్థ్యం పెంపు



ప్రతి మిల్లుకు అప్పగించే ధాన్యానికి బదులు సార్టెక్స్ బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది. అందుకు అంగీకారం తెలిపాం. ఈ మేరకు సార్టెక్స్ మిల్లులుగా సామర్థ్యం పెంచుతున్నాం. ప్రస్తుతం జిల్లాలో 92 మిల్లులకు గాను వాటిలో 67 సార్టెక్స్ మిల్లులు ఉన్నాయి. మిల్లర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లిస్తే బ్యాంకు గ్యారంటీలు అందజేసేందుకు సౌలభ్యంగా ఉంటుంది. **పొట్నూరు గౌరీశంకరరావు**, కన్వీనర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్

దళారులకు ధాన్యం అమ్మవద్దు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెంకటేశ్వరరావు


రేగిడి : విలేకరులతో మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెంకటేశ్వరరావు

రేగిడి: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు కోరారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని చాలామంది రైతులు తొందరపడి దళారులకు విక్రయిస్తున్నారని, ఈ విధానానికి స్వస్తి పలకాలని సూచించారు. ఆదివారం మండలంలోని ఉనుకూరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధాన్యం కొనుగోలుకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలను అధికారులకు జారీ చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఇప్పటికే అదనంగా సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఈకేవైసీ చేసుకున్న ప్రతి రైతు నుంచి ఒక్క గింజ కూడా విడిచిపెట్టకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నారని వెల్లడించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటికే అధికారులు సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలను అందజేసినట్లు తెలిపారు. వాతావరణం చక్కగా ఉండడంతో రైతులు పండించిన ధాన్యం ఈ ఏడాది బాగుంటాయని, ప్రభుత్వం ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు తొందరపడి దళారులకు విక్రయించి అనవసరంగా నష్టానికి గురికావద్దని హితవు పలికారు. ఇప్పటికే కలెక్టర్ సూర్యకుమారి, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల సూచనలు, సలహాలతో వ్యవసాయశాఖ సిబ్బందితో తాను మాట్లాడినట్లు చెప్పారు. సమావేశంలో ఆయనతో పాటు వ్యవసాయాధికారి జి. మురళీకృష్ణ, లక్ష్మీపురం, అప్పాపురం సర్పంచ్‌లు కెంబూరు వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

- ప్రమాదాన్ని తప్పించిన రైలు డ్రైవర్


చినభోగిలి రైల్వేగేటువద్ద ఆగిన ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్

సీతానగరం: విశాఖ-రాయగడ రైల్వేలైన్‌లో సీతానగరం రైల్వే స్టేషన్ పరిధి చినభోగిలి రైల్వే గేటు సమీపంలో ఆదివారం రైలు డ్రైవర్ అప్రమత్తం కావడంతో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌కు పెనుప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. చినభోగిలి వద్ద డౌన్‌ట్రాక్‌పై పనులు జరుగుతున్నాయి. అలెప్పి నుంచి ధన్‌బాద్ వైపు వెళ్లే ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ బొబ్బిలి రైల్వేస్టేషన్ నుంచి పార్వతీపురం వస్తుండగా మధ్యాహ్నం 3.50 గంటల సమయంలో డౌన్‌ట్రాక్‌పై మూడోలైన్ కోసం పట్టాలు తరలిస్తున్న ఐఆర్ రోప్ ఒకటి పట్టాల మధ్య ఇరుక్కుపోయింది. ట్రాక్‌పై పనిచేస్తున్న సిబ్బంది సకాలంలో తీయలేక పోయారు. అప్పటికే రైల్వే స్టేషన్ సిబ్బంది సిగ్నల్ ఇవ్వడంతో ట్రైన్ గేటు దాటి పనుల ప్రాంతానికి చేరుకుంటుండగా ట్రాక్‌పై ఇరుక్కుపోయిన రోప్ తొలగించే పనిలో కొంతమంది కూలీలు ఉండి మరికొంతమంది ట్రైన్ నిలపండి అని కేకలు వేశారు. సిగ్నల్ ఇవ్వడంతో మళ్లీ ట్రైన్ నిలిపే అధికారం తనకు లేదని చినభోగిలి గేట్‌మన్ కూలీలకు చెప్పాడు. అయితే రైలు దగ్గరకు చేరుతున్న సమయంలో డ్రైవర్ అప్రమత్తమై స్థానికుల కేకలు విని ఒక్కసారిగా నిలుపుదల చేశారు. దీంతో రైలు సుమారు అరగంట సేపు నిలిచిపోయింది. అంతలో ట్రాక్‌పై ఇరుక్కుపోయిన రోప్‌ను కూలీలు తొలగించారు. పెద్ద ఎత్తున ట్రాక్‌పై పనులు జరుగుతుండగా ట్రైన్‌కు ఎలా సిగ్నల్ ఇచ్చారని స్థానికులు, రైలు ప్రయాణికులు ప్రశ్నించారు. డ్రైవర్ అప్రమత్తం కాకపోతే బోగీలు తిరగబడి పెద్ద ఎత్తున ప్రమాదం జరిగేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైవర్ తీరును అంతా అభినందించారు.

బైక్ బోల్తాపడి వ్యక్తి మృతి


ఆస్పత్రిలో మృతుడు నారాయణ

భామిని: మండలంలోని నేరడి-బికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సరిసాభద్ర నారాయణ(48) బైక్ బోల్తా పడి ఆదివారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బుల్లెట్ బైక్‌పై నారాయణ వెళ్తుండగా నేరడి బ్యారేజ్ వద్ద బైక్‌తో తహా ఇసుకగోతిలో పడిపోయాడు. ప్రమాదంలో నారాయణపై బైక్ పడడంతో తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో భామిని పీహెచ్‌సీకి నారాయణను తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడని 108 సిబ్బంది తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు టింగ అన్నాజీరావు, ముగడ మిన్నారావు, సరిసాభద్ర బాలయ్యలు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య రజని, కొడుకు నవీన్, కుమార్తె లక్ష్మి, తల్లిదండ్రులు భాస్కరరావు, రమణమ్మలున్నారు. మృతుని భార్య రజని, సోదరుడు తేజ, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తరలిస్తున్నట్లు బత్తిలి ఎస్సై సీతారాములు తెలిపారు.

చేపలవేటకువెళ్లి యువకుడు..


శశికుమార్ మృతదేహం

పాచిపెంట: మండల కేంద్రం పరిధి కూనం బందవలస గ్రామానికి చెందిన యువకుడు చేపల వేటకు వెళ్లి ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గిరిజన యువకుడు చీమల శశికుమార్(25) గ్రామస్తులతో కలిసి విశ్వనాథపురం సమీపంలో ఉన్న వాగులోచేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాగులో మునిగిపోయాడు. కొద్దిసమయం తరువాత శశికుమార్ కనిపించకపోవడంతో తోటి యువకులు వాగులో వెతికి బయటకు తీశారు.కొన ఊపిరితో ఉన్న శశికుమార్‌ను సాలూరు సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి సీతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని హెచ్‌సీ కృపారావు తెలిపారు మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఆందోళన


నూతనంగా నియమించిన రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులకు కండువా కప్పుతున్న ఇసరపు శేఖర్ యాదవ్

విజయనగరం టౌన్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఆందోళన ఉద్ధృతం చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసరపు శేఖర్ యాదవ్ పిలుపునిచ్చారు. విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌లో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో సమితి రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధుల నియామకం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా సీనియర్ నాయకుడు పినబోయిన అప్పారావు యాదవ్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా ధూళి సూర్యచంద్రరావు యాదవ్, ఈపు భూలోక యాదవ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా, యువజన అధ్యక్షుడిగా దేవర అప్పారావు యాదవ్, ప్రచార కమిటీ కార్యదర్శిగా పల్లా రమణ యాదవ్‌లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా గొర్రెల కొనుగోలుకు సహకార సంఘాలకు రుణాలు మంజూరు, సామాజిక భవనాల నిర్మాణం వంటి డిమాండ్ల పరిష్కారానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారుకొండ వీరేంద్ర యాదవ్, పట్టణ అధ్యక్షుడు పడగల శ్రీనివాస యాదవ్, సానబోయిన గోవింద యాదవ్, ముద్దాడ బాబాజీ , సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైనిక పాఠశాల డైమండ్ జూబ్లీ వార్షికోత్సవం

- పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు విగ్రహావిష్కరణ


కె.సురేంద్రనాథ్‌కు జ్ఞాపికను అందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, కల్నల్ అరుణ్‌కులకర్ణి


అమరవీరుడు, కల్నల్ సంతోష్‌బాబు సతీమణిని సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: పాఠశాల విద్యార్థులు సైనిక దళాల్లో చేరి భారతదేశ రక్షణ రంగం ఖ్యాతిని చాటి చెప్పాలని కోరుకొండ సైనిక పాఠశాల పూర్వ విద్యార్థులు, వైస్ అడ్మిరల్ ఎంఎస్ పవార్, లెఫ్టినెంట్ జనరల్ కె.సురేంద్రనాథ్, గ్రూప్ కెప్టెన్ కె.అరుణ్, ఐఆర్ఆర్ అధికారి జె.సురేష్‌లు పిలుపునిచ్చారు. కోరుకొండ సైనిక పాఠశాల డైమండ్ జూబ్లీ వార్షికోత్సవం రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన డైమండ్ జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థులు వారి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, కల్నల్ అరుణ్ ఎం.కులకర్ణి, పూర్వ విద్యార్థులు కార్యక్రమానికి ముందుగా యుద్ధ చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అమరవీరుడు, కల్నల్ సంతోష్‌బాబు సతీమణి, వారి తల్లిదండ్రులను పూర్వ విద్యార్థి, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కేఆర్ రావు సత్కరించారు. కల్నల్ సంతోష్‌బాబు జ్ఞాపకార్థం ఎంవీసీ మోటివేషన్ హాల్‌ను ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాల పూర్వ విద్యార్థి, పర్వతారోహకుడు దివంగత మల్లి మస్తాన్‌బాబు విగ్రహాన్ని, ఆయన సోదరి డాక్టర్ మల్లి ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా గౌరవ అతిథి, లెఫ్టినెంట్ జనరల్ వైవీకే మోహన్ చేతుల మీదుగా ఎన్‌డీఏలో చేరే ప్రయత్నంలో యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు, 2021- 22 ఏడాదిలో వివిధ తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్మీ బృందాలు, విద్యార్థులు నిర్వహించిన భాంగ్రా, ఖుక్రీ, కలరిపట్టు ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతా హడావుడే..!

- ఓపెన్‌టాప్ కారులో అభివాదం చేస్తూ సాగిన పవన్ పర్యటన
- జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడకుండానే ముగిసిన కార్యక్రమం
- అవాక్కైన జనసేన పార్టీ స్థానిక నాయకులు
- రోడ్ షోలో బైక్‌లతో పవన్ అభిమానుల సందడి
- విశాఖ-రాయపూర్ రహదారిలో రాకపోకలకు అంతరాయం


రోడ్ షోలో పవన్ కల్యాణ్

విజయనగరం/విజయనగరం టౌన్: జగనన్న కాలనీల్లో సమస్యలు తెలుసుకునేందుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన పర్యటన ఆదివారం విజయనగరంలో ప్రజలు, వాహనచోదకులకు ఇబ్బందికరంగా మారింది. అసలు విషయాన్ని పక్కనపెట్టి రెండున్నర గంటల పాటు కేవలం రోడ్ షో ద్వారా ఆర్భాటం చేసి..జగనన్న కాలనీ లబ్ధిదారులను పట్టించుకోకుండా వెనుదిరగడం చర్చనీయాంశంగా మారింది. ముందస్తుగా నిర్ణయించిన షెడ్యూల్ కన్నా ఆలస్యంగా సాగిన పవన్ పర్యటనలో ముఖ్యమైన అంశంలో నిర్లక్ష్యం చేయడం గమనార్హం. కేవలం అభిమానులు, పార్టీ కార్యకర్తలు చేసిన హడావుడితో పవన్ పరిశీలించాల్సిన గుంకలాం జగనన్న కాలనీకి మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుకున్నారు. ముందుస్తుగా నిర్ణయించిన షెడ్యూల్ కన్నా సుమారు గంట ఆలస్యంగా 11.04 గంటలకు విజయనగరంలోని వై జంక్షన్‌కు చేరుకున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు స్వాగతం పలకగా..కారుపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం వీటి అగ్రహారం జంక్షన్ వద్ద విజయనగరం జిల్లా పార్టీ నాయకులు స్వాగతం పలకగా..ఎత్తుబ్రిడ్జి జంక్షన్, ఆర్అండ్‌బీ, కలెక్టరేట్ జంక్షన్, కేఎల్‌పురం, జేఎన్‌టీయూ జంక్షన్ మీదుగా గుంకలాం జగనన్న కాలనీకి చేరుకున్నారు. దారిపొడవునా పవన్ కల్యాణ్ వచ్చిన ఓపెన్‌టాప్ కారులో నుంచి అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఇదిలా ఉండగా పవన్‌కల్యాణ్ వెంట యువత బైక్‌లతో ర్యాలీ నిర్వహించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. బైక్‌లతో పవన్‌కల్యాణ్ వెంట సాగడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే ప్రధాన మార్గం కావడం, ఆ మార్గంలో భారీ సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించడంతో పోలీసులకు ట్రాఫిక్ నియంత్రణ కత్తి మీద సాములా మారింది.

లబ్ధిదారులతో మాట్లాడకుండానే వెనుదిరిగిన పవన్: మూడు రోజుల పాటు జనసేన ఇచ్చిన పిలుపు మేరకు గుంకలాంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించేందుకు వచ్చిన పవన్ కల్యాణ్ స్థానిక పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన లబ్ధిదారులతో మాట్లాడకుండానే వెనుదిరిగారు. కాలనీలోకి ప్రవేశించిన అనంతరం అక్కడ నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం సభాస్థలి వద్దకు చేరుకుని ప్రాంగణంలోకి రాకుండా తాను వచ్చిన కారుపైకి ఎక్కి ప్రజలనుద్దేశించి ప్రసంగించి వెనుదిరిగారు. దీంతో పవన్‌కల్యాణ్‌తో చర్చ కోసం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన లబ్ధిదారులు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

పవన్ పర్యటనకు పటిష్ట బందోబస్తు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో ఎస్పీ ఎం.దీపిక పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సై క్యాడర్ నుంచి రోప్ పార్టీల వరకూ పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. యువత ఎక్కువగా పాల్గొనడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మహిళా పోలీసులను సైతం మఫ్టీలో ఏర్పాటుచేశారు. వై జంక్షన్ నుంచి గుంకలాం వరకూ పోలీసులు శాంతియుత వాతావరణంలో విధులు నిర్వహించారు.

ఇద్దరు బాలలకు నారంశెట్టి పురస్కారాల ప్రదానం


మెమెంటోలు అందుకున్న చిన్నారులు

పార్వతీపురం: పార్వతీపురం పట్టణానికి చెందిన 'నారంశెట్టి బాలసాహిత్య పీఠం' ఆరవ వార్షికోత్సవ సభను స్థానిక కళింగ వైశ్య కల్యాణ వేదికలో ఆదివారం నిర్వహించి ఇద్దరు బాలలకు బాల సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు సమావేశంలో మాట్లాడుతూ గత ఆరేళ్లుగా తమ పీఠం బాలసాహిత్య అభివృద్ధికి పాటుపడుతూ బాల సాహితీ వేత్తలను, బాల సాహిత్యాన్ని ప్రోత్సహించిందని, ఈ ఏడాది ఇద్దరు బాలసాహితీవేత్తలకు నారంశెట్టి బాలసాహిత్య పురస్కారాలను ప్రదానం చేయడమే కాకుండా వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది ప్రముఖులకు ఉత్తరాంధ్ర ఆణిముత్యం పేరుతో సత్కరించినట్లు తెలిపారు.

పలువురికి సత్కారం

2022 సంవత్సరానికి 'నారంశెట్టి బాలసాహిత్య పురస్కారాలను' ఇద్దరు ప్రముఖ బాల సాహితీవేత్తలు బెహరా ఉమామహేశ్వరరావు, కొసరాజు సురేష్ గార్లకు ప్రదానం చేశారు. వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది ప్రముఖులను ఉత్తరాంధ్ర ఆణిముత్యం పేరుతో సత్కరించారు. వారిలో రౌతు వాసుదేవరావు,(నటుడు, రచయిత, దర్శకుడు), టంకాల సుధాకరరావు, (పత్రికా రంగం), బోనెల అసిరయ్య,(జముకుల కుండ పాట), చింత అప్పలనాయుడు(సాహిత్యం), మానాపురం రాజా చంద్రశేఖర్(కవిత్వం) బాసంగి సురేష్(నటనా రంగం), బొమ్మరిల్లు నాగేశ్వరరావు (వేదగణితం), సంకా గౌరీ శంకర నారాయణ(సామాజిక సేవ) బోటు రామకృష్ణ (సామాజిక సేవ) ఉన్నారు. కార్యక్రమంలో ఆచార్య కె. ఇనాక్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు, కళారత్న డాక్టర్ డి.పారినాయుడు, డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, బి.స్వరాజ్యమ్మ, తుంబలి శివాజీ, లంక వెంకటస్వామి, జె.బి.తిరుమలాచార్యులు, సి. హెచ్.చినసూర్యనారాయణ, దేవులపల్లి పద్మజ తదితరులు ప్రసంగించారు.

క్లుప్తంగా

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

నెల్లిమర్ల: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రకటనలో తెలిపారు. 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాలపై అవగాహన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల జీవితాలపై సదస్సు నిర్వహిస్తామన్నారు. 17న కవి సమ్మేళనాలు, 18న పాఠశాల విద్యార్థులకు పోటీలు, 19న దిశ చట్టంపై అవగాహనా సదస్సు, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహనా సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రక్తదానం ..



రక్తదానం చేస్తున్న శ్రీను

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన సాధనా యువజన సంఘ సభ్యుడు ఓ గర్భిణికి అత్యవసరంగా రక్తదానం చేశాడు. మెంటాడ మండలం కొంపంగి గ్రామానికి చెందిన గర్భిణి ప్రసవం నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ అస్పత్రిలో శనివారం చేరింది. ప్రసవం నిమిత్తం ఆమెకు బి నెగటివ్ రక్తం అవసరమైంది. దీంతో గర్భిణి బంధువులు సాధనా యువజన సంఘ ప్రతినిధులను సంప్రదించడంతో సంఘ సభ్యుడు నామాల శ్రీను రక్తదానానికి ముందుకొచ్చాడు. శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎన్‌పీఎస్ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశాడు.

రామయ్యను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు దంపతులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామిని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పద్మావతి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులను అర్చకులు శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. అనంతరం ప్రధానాలయంలో ఉన్న సీతారామ చంద్రస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు.

రామతీర్థంలో వన మహోత్సవం



వన సమారాధనలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మెన్ మజ్జి శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర కార్తీకమాసం పురస్కరించుకొని రామతీర్థంలో ఉమ్మడి జిల్లాల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమరాధన నిర్వహించారు. జెడ్పీ చైర్మెన్ మజ్జి శ్రీనివాసరావు హాజరై కాసేపు సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన శాలివాహన విద్యార్థులను సత్కరించారు.

సేవతోనే సంతృప్తి



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న గణపతిరావు

విజయనగరం ఫోర్ట్: పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి ఉందని వ్యాపారవేత్త గణపతిరావు అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో మారుతీ స్వయం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వంద మంది పేదలకు బియ్యం, గోధమనూక వంటి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేవాగుణాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవాలన్నారు. పేదలకు ఆపన్నహస్తం అందిస్తున్న మారుతీ సంఘం సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆదారి వెంకటేశ్వరావు, గుత్తురు చంద్రశేఖర్, అప్పలస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్యసమాజంలో గాయత్రీ మహాయజ్ఞం

చీపురుపల్లి: కొత్తఅగ్రహారంలోని ఆర్యసమాజంలో గాయిత్రీ మహాయజ్ఞం ఘనంగా కొనసాగుతోంది. కార్తీకమాసం సందర్భంగా ఆర్యసమాజంలో ఈ నెల 11 నుంచి 20 వరకు యోగ శిబిరము- గాయత్రీ మహాయజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దాదాపు 100 మంది దంపతులతో గాయిత్రీ మహాయజ్ఞం చేయిస్తున్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో దాదాపు 2 వేల మందితో యజ్ఞం నిర్వహించనున్నారు.

పవన్ స్వామిభక్తి చాటుకుంటున్నాడు..

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్:

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చంద్రబాబు వద్ద స్వామి భక్తిని బాగానే చాటుకుంటున్నాడని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు విమర్శించారు. మండలంలోని రామతీర్థంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు కొనసాగిస్తూ నీచ రాజకీయాలకు తెరతీస్తున్నాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల ఇళ్ల నిర్మాణాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. అక్క, చెల్లెమ్మలకు ఇచ్చిన పట్టాలపై టీడీపీ, జనసేన నాయకులు కోర్టులకు వెళ్లి మరీ అడ్డుకున్నారని..అయినప్పటికీ సమస్యలను అధిగమించి పేదలకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. భోగాపురం మండలంలోని సవరవిల్లిలో జగనన్న కాలనీకి వచ్చి ఇళ్ల నిర్మాణాలు ఏ విధంగా పూర్తయ్యాయో జనసేన నాయకులు పరిశీలించాలని సవాల్ విసిరారు. సెంటు రూ.5 లక్షలు పలికిన భూమిని పేదలకు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. విమా నశ్రయ నిర్మాణంలో భూములు కోల్పోయిన పేదల కు తాము అధికారంలోకి వచ్చాక ఇళ్ల స్థలాలు కేటాయించామని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధికోసం చిల్లరి ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు. పొత్తులతో గెలిచిన చంద్రబాబు హామీలన్నింటినీ విస్మరించి ప్రజలను మోసం చేశాడని.. అప్పుడెందు కు ప్రశ్నలేదని దుయ్యబట్టారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. కార్యక్రమంలో బొప్పడాం సర్పంచ్ అంబళ్ల కిర ణ్, నాయకులు పిన్నింటి శ్రీను, అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్యాకేజీ రాజకీయాలు మానుకోవాలి

● ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్యాకేజీ రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంపై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. కేవలం టీడీపీ అధినేత చంద్రబాబు కోసం డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించడమే గాకుండా ఇళ్లను నిర్మించి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఒకేసారి 30.25 లక్షల కుటుంబాలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేని చోట్ల భూములను కొనుగోలు చేసి మరీ కేటాయించామన్నారు. ఆయా లే అవుట్లలో ఇప్పటికే 21.25 లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. జగనన్న కాలనీల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి నీటి సరఫరా, సీసీ రోడ్లు, విద్యుత్ సరఫరా, తదితర మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు ఇలాంటి ఆలోచన ఎప్పుడైనా వచ్చిందా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తప్పులను పవన్ ఎప్పుడూ ప్రశ్నించలేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ వాస్తవాలు ఆలోచించి మాట్లాడాలని సూచించారు. ఇదిలా ఉంటే విశాఖలో సీఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభ విజయవంతమైందన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నెల్లిమర్ల: పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో పి. కోనవలసలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన పి. ప్రసాద్, పి. శ్రీరామ్, కె.రాహుల్ కబడ్డీలోను.. ఎస్.బాబూరావు, కె.వినోద్ వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 15వ తేదీన నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో వీరు పాల్గొంటారని పీడీ వి. రామచంద్రుడు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల హెచ్ఎం కె.సూర్యనారాయణ, వసతిగృహ సంక్షేమాధికారిణి అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంలో పాల్గొన్న సభ్యులు

భోగాపురం రూరల్: మండలంలోని పోలిపల్లి, సవరవిల్లి, అక్కివరం, కుంచెవానిపేట, గొల్లలపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు సీవీవీ నాయుడు, రాజేష్, ప్రసాద్, సూరిబాబు, శ్రీను, కోటి, దుర్గారావు, రాజప్పుడు, భానుమతి, పుణ్యవతి, త్రివేణి, ధాస్మి, పైడిరాజు, మౌనిక, నందన, రామచంద్ర, భారతి, గీత, మీన, తదితరులు పాల్గొన్నారు.

వివరణ ఇవ్వాల్సిందే..

● జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ నాసిర్



మాట్లాడుతున్న జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ నాసిర్

విజయనగరం టౌన్: వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్, విశాఖ కార్పొరేటర్ బరఖత్ అలీపైనా టీడీపీ మైనారిటీ నాయకుడు ఖాదర్ బాషా చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మహమ్మద్ నాసిర్ అన్నారు. చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆదివారం స్థానిక కంటోన్మెంట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎదుటవారిపై ఆరోపణలు చేసే ముందు కాస్త ఆలోచించాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు ఎంఎస్ఎస్ బాషా, జాకీర్, వజీద్ పాల్గొన్నారు.

అమ్మవారికి క్షీరాభిషేకం



చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ప్రతీ ఆదివా రం విశేషంగా పూజలు నిర్వహిస్తుంటారు. అందులో భాగంగానే దేవస్థానం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో అర్చకులు అమ్మవారికి అభిషేకా లు, పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

విజయనగరం పూల్‌బాగ్: పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ (రాష్ట్రోపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు ఎల్. సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అమర్‌భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు.

పదోన్నతులు, బదిలీలను అడ్‌హాక్ పద్ధతిలో వెంటనే చేపట్టాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాల ని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వై.అప్పారావు, ప్రధాన కార్యదర్శి డి. శ్యామ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. జోగారావు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి

● ఉత్తరాంధ్ర టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధి సత్యనారాయణ



మాట్లాడుతున్న అసోసియేషన్ కన్వీనర్ సత్యనారాయణ

విజయనగరం టౌన్: ఐకమత్యంతోనే టైలర్ల అభివృద్ధి సాధ్యపడుతుందని ఉత్తరాంధ్ర టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధి ఎ.సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక కోట జంక్షన్ వద్ద ఉత్తరాంధ్ర టైలర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేదోడుపథకం ప్రవేశపెట్టి ఏడాదికి రూ.10వేలు అందిస్తూ టైలర్లను ఆర్థికంగా ఆదుకుంటున్నాడని చెప్పారు. సరిపడినంత పనిలేక ఇబ్బంది పడుతున్న తరుణంలో విద్యార్థుల యూనిఫారాలు స్థానిక టైలర్లతోనే కుట్టించాలని ఆదేశించడం సంతోషించదగ్గ విషయమన్నారు. 50 ఏళ్లు నిండిన టైలర్లకు పింఛన్లు మంజూరు చేయాలని.. దుకాణాలకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు లక్క సత్యనారాయణ, వియ్యపు సత్యనారాయణ, కోన రమేష్, సూర్యనారాయణ, చిన్నారావు, సత్య, కల్యాణి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక వారోత్సవాలు ప్రారంభం

విజయనగరం పూల్‌బాగ్: విశాలాంధ్ర బుక్ హౌస్ ఆధ్వర్యంలో 55వ జాతీయ పుస్తక వారోత్సవాలు నగరంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ప్రారంభించిన జిల్లా ఇన్‌చార్జ్ సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ, వారోత్సవాలను పురస్కరించుకుని బుక్ హౌస్‌లో ప్రత్యేక పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. విశాలాంధ్ర ప్రచురణలపై 20 శాతం, ఇతర ప్రచురణలపై 10 శాతం ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. పుస్తక ప్రియులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉద్యోగ భద్రతకు ఉద్యమిద్దాం..

విజయనగరం పూల్‌బాగ్: ఉద్యోగ భద్రత, కనీస వేతనాలకు అసంఘటిత రంగ కార్మికులంతా ఉద్యమించాలని సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో సీఐటీయూ నాలుగో నగర మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కాలంలో కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిందని ఆరోపించారు. కరోనా కష్టకాలంలో కార్మికులను ఆదుకోవాల్సింది పోయి.. లక్షలాది మందికి ఉపాధి లేకుండా చేసిందని మండిపడ్డారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని కోరారు. పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం 13 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బి. రమణ, కె. సురేష్, కోశాధికారిగా ఎ. జగనమోహనరావు ఎన్నికయ్యారు.

జూదరుల అరెస్ట్

భోగాపురం: మండల కేంద్రం శివారులో పేకాటాడుతున్న ఎనిమిది మందిని ఆదివారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్. కృష్ణమూర్తి తెలిపారు. వీరి వద్ద నుంచి 20,680 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఏఎస్సై తవుడు, సిబ్బంది పాల్గొన్నారు.

'చిట్టి గురువులు' పరీక్షకు స్పందన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ కృష్ణారావు

నెల్లిమర్ల: నగర పంచాయతీతో పాటు మండలంలోని పలు కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన చిట్టి గురువులు పరీక్షకు విశేష స్పందన లభించింది. మూడు నెలలుగా నిర్వహించిన అభ్యసన కార్యక్రమంలో అక్షరాస్యులైన 16 నుంచి 50 ఏళ్ల వయసున్న వయోజనులు పెద్ద ఎత్తున పరీక్షకు హాజరయ్యారు. ఎంపీడీఓ జి. గిరిబాల, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. సచివాలయ, ఉపాధిహామీ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పరీక్షల నిర్వహణలో సహకారం అందించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు 3వ తరగతి స్థాయి పరీక్ష రాయటానికి అర్హులవుతారని ఎంఎల్‌ఓ ఆల్తి మురళీకృష్ణ తెలిపారు.

చిట్టి గురువులు పరీక్షకు స్పందన

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో ఆదివారం నిర్వహించిన చిట్టి గురువులు పరీక్షకు స్పందన లభించింది. 20 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 4550 మంది అభ్యాసకులు హాజరయ్యారని ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నగర కమిటీ ఎన్నిక



ఎన్నికైన నగర కమిటీ

విజయనగరం: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నగర నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఎన్నికలో నగర అధ్యక్షుడిగా సప్ప ప్రసాద్, ఉపాధ్యక్షులుగా పి.వెంకటరమణ, మజ్జి గీతారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకిబాబు, కార్యదర్శి పప్పు విశ్వనాథం, కోశాధికారిగా మహంతి అప్పలనాయుడులను ఎన్నుకున్నారు. అదేవి ధంగా సంఘ కార్యవర్గ సభ్యులుగా పఠాన్‌బహదూర్ ఖాన్, అజ్జుఖాన్, కె. గౌరీశంకర్, పి.శ్యామల, ఎం.సుభాషిణి ఎన్నికయ్యారు. ఎన్నిక ప్రక్రియను ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ టీవీవీ సత్యనారాయణ, జి.శ్రీరామమూర్తి పర్యవేక్షించారు.

అంకిత భావంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక మహిళా ప్రాంగణంలో తాత్కాలిక సూపర్‌వైజర్లకు జరుగుతున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు తరుచూ వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గల ఖాళీ ప్రదేశాలలో ఆకుకూరలు, కాయగూరలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి. శాంతకుమారి, డీసీపీయూ అరసవిల్లి, సీడీపీఓ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై అనవసర రాద్ధాంతం

గజపతినగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమంపై జనసేన పార్టీ అధ్యక్షుడు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, గృహ నిర్మా ణాలకు సంబంధించి ఆయన అనవసర రాద్ధాంతం చేస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఒకేసారి 30.25 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడమే గాకుండా ఇళ్లను కూడా మంజూరుచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వభూమి అందుబాటులో లేని చోట ప్రైవేటు వ్యక్తుల వద్ద భూములను కొనుగోలు చేసి మరీ ఇళ్ల పట్టాలు ఇచ్చామని చెప్పారు. ఏవైనా నిర్మాణాలు పూర్తి కావాలంటే రెండు, మూడేళ్ల సమయం పడుతుందని, ఆ విషయం పవన్‌కి తెలియదా అని ప్రశ్నించారు. విజయనగరంలోని గుంకలాంలోని జగనన్న లేఅవుట్‌లో పవన్ ఆదివారం పర్య టించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాలేదంటూ రాద్ధాంతం చేయడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ మూడేళ్ల కాలంలో రూ.1.62 లక్షల కోట్ల రూపాయలను తమ ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించిందని చెప్పారు. పవన్‌కు రాజకీయాలపై గాని, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధిపై గాని అవగాహన లేదని, ఆయన రాజకీయాలకు పనికిరాడని, సినిమాల్లోకి వెళ్లి రాణించాలని సూచించారు. చంద్రబాబు నాయుడు కోసం పని చేయకుండా, వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ రాష్ట్రంలో అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ప్రకటిస్తే ప్రజల్లో కొంతమందికి అయినా ఆయనపై నమ్మకం కలుగుతుందన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



టికెట్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధికి దేవస్థానం కమిటీ కృషి చేయాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచించారు. పట్టణానికి చెందిన పక్కి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సతీష్, అర్చన దంపతులు రూ.75 వేల విలువ చేసే టికెట్ కౌంటర్‌ను అమ్మవారి దేవస్థానానికి సమర్పించారు. ఆ టికెట్ కౌంటర్‌ను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు.

క్లుప్తంగా

ముగిసిన రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు

సంయుక్త విజేతలుగా విశాఖ, విజయనగరం

ఏఎన్‌యూ: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన రెవెన్యూ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడలు ఆదివారం ముగిశాయి. ఈ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విశాఖ, విజయనగరం జిల్లాల ఉద్యోగులు సంయుక్తంగా మొదటి స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఆదివారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో ఈ రెండు జిల్లాల ఉద్యోగులకు ఓవరాల్ ట్రోఫీని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ అందజేశారు. ఇంకా పలు క్రీడలలో మొదటి, రెండు, మూడు స్థానాలలో నిలిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖరరెడ్డి, శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, విప్ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ఏపీఎస్ఆర్ఏ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఇతర ఉద్యోగ సంఘ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాల్లో బాలల సంక్షేమ కమిటీలు

- ప్రభుత్వం కసరత్తు
- ఇప్పటికే 13 జిల్లాల్లో ఏర్పాటు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు బాలల సంక్షేమ కమిటీలు, బాల నేరస్తుల న్యాయ బోర్డుల ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇప్పటికే ఉమ్మడి 13 జిల్లాల్లోనూ బాలల సంరక్షణ కమిటీలు, న్యాయ బోర్డులను ఏర్పాటు చేసింది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో 26 జిల్లాలకూ వాటిని విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. ఈ విధంగా బాల నేరస్తుల న్యాయ(బాలల సంరక్షణ, రక్షణ) చట్టం–2015ను సమర్థంగా అమలు చేస్తోంది. రాష్ట్రంలో బాల నేరస్తుల సంక్షేమం, దిద్దుబాటు సేవలు, వీధి బాలల సంక్షేమం. సంరక్షణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. 18 ఏళ్లలోపు పిల్లల్లో పలు నేరాల్లో నిందితులు, నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది. అనాథలు, ఇంటి నుంచి పారిపోయి వచ్చిన వారు, అక్రమ రవాణాకు గురైన వారి పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

అథ్లెటిక్స్‌లో జైభీమ్‌కు స్వర్ణం



మొదటి స్థానంలో నిలిచిన జైభీమ్

బొబ్బిలి: విశాఖ స్టీల్ ప్లాంట్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆర్.జైభీమ్ ఐదు కి.మీ.ల రేస్ వాకింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. గ్రూప్ 40 ప్లస్ విభాగంలో ఈయనకు స్వర్ణం లభించింది. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందారు. ఈయన ప్రస్తుతం బొబ్బిలి ఎస్ఈబీ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



వరి సాగును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

రేగిడి: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండలంలోని చాటాయవలస గ్రామ సర్పంచ్ కరణం గోవిందరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాల మేరకు తనకున్న మూడు ఎకరాల్లో పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు చేశారు. పంటకు తెగుళ్ల పట్టకుండా ఘన, ద్రవ జీవామృతం వాడడం వల్ల పంటకు తెగుళ్ల రాకపోవడంతో పాటు ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందని సదరు రైతు ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన పండించిన పంటను మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ, ఐసీఆర్ పీలు పైల తవిటినాయుడు, రమణ, సింహాచలం పరిశీలించారు.

పుంజుకుంటున్న రవాణా ఆదాయం

ఈ ఆర్థిక ఏడాది 6 నెలల్లో 39.15 % వృద్ధి

- సెప్టెంబర్ నాటికి రూ.2,130.92 కోట్ల ఆదాయం
- కార్ల ద్వారా 8.27 % వృద్ధి నమోదు
- ఆటోల ద్వారా ఏకంగా 83.94 % వృద్ధి
- పాసింజర్ వాహనాల ద్వారా 85.02 % పెరిగిన ఆదాయం



సాక్షి, అమరావతి: రవాణా రంగం ద్వారా వచ్చే ఆదాయం గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో మెరుగుపడుతోంది. గత ఆర్థిక ఏడాది మొదటి 6 నెలల్లో (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్) వరకు రూ.1,531.29 కోట్ల ఆదాయం లభించగా.. ఈ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు (6 నెలలు) రూ.2,130.92 కోట్ల మేర ఆదాయం వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలలతో పోలిస్తే.. ఈ ఏడాది తొలి 6 నెలల్లో ఆదాయంలో 39.15 శాతం మేర వృద్ధి నమోదైంది. గత రెండేళ్లలో కోవిడ్-19 ప్రభావం రవాణా రంగం ఆదాయంపై తీవ్రంగా పడింది. 2019–20 రవాణా ఆదాయం గణనీయంగా పడిపోగా.. 2020–21లోనూ నేలచూపులు చూసింది. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో ఇప్పుడిప్పుడే ఆదాయం మెరుగుపడుతోంది. ద్విచక్ర వాహనాల విక్రయాలు మినహా అన్నిరకాల వాహనాల్లో ఈ ఏడాది తొలి 6 నెలల్లో వృద్ధి నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలల్లో ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు గత ఏడాది కంటే 6.52 శాతం తగ్గింది. అయితే, కార్ల అమ్మకాల్లో మాత్రం వృద్ధి నమోదైంది. ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి 6 నెలల్లో కార్లు కొనుగోళ్లలో 8.27 శాతం, గూడ్స్ వాహనాల కొనుగోళ్లలో 22.67 శాతం మేర వృద్ధి నమోదు కాగా.. పాసెంజర్ వాహనాల కొనుగోళ్లలో 85.02 శాతం, ఆటోల కొనుగోళ్లలో 83.94 శాతం వృద్ధి నమోదైంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలల్లో వాహనాల కొనుగోళ్లు ఇలా

కేటగిరీ	2021-22	2022-23
ద్విచక్రవాహనాలు	3,31,695	3,10,054
కార్లు	42,074	45,553
గూడ్స్	17,606	21,598
పాసింజర్	1,756	3,249
ఆటోలు	5,094	9,370

గడచిన ఐదేళ్లలో రవాణా ఆదాయం ఇలా..

ఆర్థిక ఏడాది	రవాణా ఆదాయం (రూ.కోట్లలో)
2017-18	3,044.41
2018-19	3,687.50
2019-20	3,181.78
2020-21	2,973.33
2021-22	3,340.57
2022-23(సెప్టెంబర్ వరకు)	2,130.92

అద్దెకు పంచాయతీ భూములు

అన్ని రాష్ట్రాలకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ లేఖ

- ఖాళీ భూములు వృథాగా ఉంటున్నాయని వెల్లడి
- చాలాచోట్ల ఆక్రమణలకు గురవుతున్నాయని పేర్కొన్న కేంద్రం
- అలాంటి ఆస్తులన్నిటినీ డిజిటలీకరణ చేసి లీజుకు ఇవ్వాలంటూ సూచన
- పంచాయతీల ఆదాయం 63శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా



సాక్షి, అమరావతి: గ్రామాల్లో పంచాయతీలకు సంబంధించిన ఖాళీ స్థలాలను, భూములను లీజుకు ఇవ్వడం ద్వారా ఆయా గ్రామ పంచాయతీల సొంత ఆదాయం భారీగా పెంచుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలంటూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఈ మేరకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి చంద్రశేఖర్‌కుమార్ గత శుక్రవారం అన్ని రాష్ట్రాల పంచాయతీ శాఖ కార్యదర్శులకు లేఖ రాశారు. ఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనమిక్స్ రీసెర్చ్ (ఎన్‌సీఏఈఆర్) ఇటీవల దేశవ్యాప్తంగా నిర్వహించిన అధ్యయనంలో గ్రామ పంచాయతీలకు చెందిన ఖాళీ స్థలాలు, భూములను లీజుకు ఇవ్వడం ద్వారా పంచాయతీల ఆదాయం మరో 63 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేసినట్లు కేంద్రం ఆ లేఖలో వెల్లడించింది. పంచాయతీ చెరువులను చేపల పెంపకానికి లీజుకివ్వడం ద్వారానే ప్రస్తుత ఆదాయం కంటే 21 శాతం అదనపు ఆదాయం పొందవచ్చని ఆ లేఖలో పేర్కొన్నారు. ఖాళీ స్థలాలను షాపులు, గోడౌన్ల నిర్వహణకు అద్దెకు ఇవ్వడం ద్వారా మరో 10 శాతం, పంచాయతీ బంజర భూములను పశువుల మేతకు లీజుకు ఇవ్వడం ద్వారా ఇంకొక 9 శాతం, స్థానిక నీటి అవసరాలు తీరిన తర్వాత బోరు బావులను వివిధ రకాల అవసరాలకు లీజుకు ఇవ్వడం ద్వారా మరో 23 శాతం మేర పంచాయతీలకు సొంత ఆదాయం సమకూరుతుందని అధ్యయనంలో తేలినట్లు పేర్కొన్నారు. లీజుకు ఇవ్వాలని పేర్కొంటున్న భూములన్నీ ఏ మాత్రం ప్రాధాన్యత లేని భూములు, ఖాళీ స్థలాలేనని, వాటిని పట్టించుకోని కారణంగా ఆక్రమణల బారిన పడుతున్నాయని కూడా తేలిందన్నారు.

డిజిటలీకరణ చేయండి

గ్రామ పంచాయతీల వారీగా ఖాళీ స్థలాలు, భూముల వివరాలను డిజిటలైజ్ చేయడంతోపాటు ఆ వివరాలన్నింటితో ఒక రికార్డు రూపంలో పొందుపరచాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి అన్ని రాష్ట్రాల పంచాయతీరాజ్ శాఖలకు సూచించారు. ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో నిరంతరం ఈ రికార్డులలో మార్పులు, చేర్పులు చేస్తూ ఉండాలని సూచించారు. ఆయా స్థలాలు, భూములకు నిర్ణీత కాలానికి క్రమం తప్పకుండా వేలం విధానంలో ఎక్కువ ఆదాయం అందజేసే వారికి లీజులకు ఇస్తూ ఉండాలని సూచించారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టేలా రోడ్ మ్యాప్‌ను కూడా లేఖకు జత చేసి రాష్ట్రాలకు పంపారు.

రాష్ట్రంలో ఇప్పటికే డిజిటలైజేషన్ మొదలు

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ రక్ష, భూ హక్కు కార్యక్రమంలో భాగంగా గ్రామ కంఠాల్లో ఉండే ఇళ్లకు సంబంధించి కొత్తగా యాజమాన్య హక్కు పత్రాలు అందజేయడం తోపాటు పంచాయతీకి సంబంధించి ఖాళీ స్థలాలు, ఇతర ఆస్తుల వివరాలను డిజిటలీకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం జరుగుతున్న డ్రోన్ల సర్వే పూర్తయిన పంచాయతీలకు సంబంధించి ప్రతి ఆస్తి వివరాలను వేర్వేరుగా పేర్కొంటూ అన్ని ఆస్తుల వివరాలతో ప్రతి పంచాయతీలో ఒక రికార్డును కూడా ఏర్పాటు చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

• తెలంగాణ

వలస కార్మికులకు బహ్రెయిన్ షాక్

- అర్ధంతరంగా వర్క్ వీసాల రద్దు
- విజిట్ వీసాలపై వచ్చిన వారికి పనులివ్వొద్దని కంపెనీలకు సర్కార్ ఆదేశం
- తిరిగి ఇంటికి చేరుకుంటున్న కార్మికులు

మోర్తాడ్ (బాల్కొండ): బహ్రెయిన్‌లో ఉపాధి పొందవచ్చని భావిస్తున్న ఎంతో మంది వలస కార్మికులకు అక్కడి ప్రభుత్వం షాకిస్తోంది. యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఖతర్, ఒమాన్‌ల మాదిరిగానే బహ్రెయిన్ కూడా ఎంతో మంది తెలుగు వారికి ఉపాధి అవకాశాలు కల్పించింది. అయితే ఇక నుంచి అది చరిత్రగానే మిగిలిపోనుంది. బహ్రెయిన్ ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాలు, వలస కార్మికుల వీసాలను పర్యవేక్షించే లేబర్ మార్కెట్ రెగ్యులేటరీ అథారిటీ అనుసరిస్తున్న విధానాలతో బహ్రెయిన్‌లో ఉపాధి మార్గాలు మూసుకుపోతున్నాయి. వారం, పది రోజుల వ్యవధిలోనే తెలంగాణ జిల్లాలకు చెందిన వలస కార్మికులు దాదాపు రెండు వేలమంది బహ్రెయిన్ నుంచి ఇంటిదారి పట్టారని అంచనా. వర్క్ వీసాలను రద్దు చేయడం, విజిట్ వీసాలపై వెళ్లి పని వెతుక్కునేవారికి ఎల్ఎంఆర్ఏ ఇచ్చిన ఆదేశాలతో కంపెనీలు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించడంతో ఉపాధి కరువైంది. బహ్రెయిన్ ప్రభుత్వం పునరాలోచన చేస్తే తప్ప ఆ దేశంలో వలస కార్మికుల ఉపాధికి అవరోధాలు తప్పవని అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో బహ్రెయిన్‌కు వెళ్లే ఆలోచన మానుకోవాలని వలస కార్మికుల సంఘాలు సూచిస్తున్నాయి.

'రాజీవ్' కేసు దోషుల విడుదల సరికాదు

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కవాడిగూడ (హైదరాబాద్): 'రాజకీయాల్లో అభిప్రాయభేదాలు ఉండొచ్చు.. విభేదాలు ఉండొచ్చు.. కానీ ఒక దేశ మాజీ ప్రధానిని బలిగొన్నవారి విడుదల సరికాదు..' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవాలకు ఆదివారం వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ హంతకుల విడుదలతో తన మనసు ఎంతో కలత చెందిందని భావోద్వేగానికి గురయ్యారు. దీపం వెలుగు అజ్ఞానాన్ని తొలగిస్తుందని.. వెలుగుతోనే మనిషి మనుగడ సాధ్యమని చెప్పారు. కార్తీకమాసంలో శాంతి, ధర్మం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సమాజం బాగు కోసం కోటి దీపోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని వెంకయ్యనాయుడు ప్రశంసించారు.

మాజీ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణరెడ్డి కన్నుమూత



సాక్షి ప్రతినిధి, వరంగల్/సాక్షి, హైదరాబాద్: సీనియర్ రాజకీయవేత్త, మాజీ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణరెడ్డి(84) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున హనుమకొండలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడలో 1936, సెప్టెంబర్ 2న జన్మించిన ఆయన బీజేపీలో కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. రాజకీయ నేతగానే కాకుండా.. గాయకుడిగా, కవి, రచయితగా కూడా ఆయన గుర్తింపు పొందారు. వరంగల్‌లో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడే 1952లో ఆర్ఎస్ఎస్‌లో చేరారు. విద్యాభ్యాసం అనంతరం 1957లో భారతీయ జన సంఘ్‌లో ఫుల్‌టైం ఆర్గనైజర్‌గా పనిచేశారు. అనంతరం ఫుల్‌టైం ఆర్గనైజింగ్ సెక్రటరీగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పనిచేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మందాడి కీలకపాత్ర పోషించారు. 2001లో టీఆర్ఎస్‌లో చేరిన సత్యనారాయణరెడ్డి 2004 ఎన్నికల్లో నాటి హన్మకొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009 ఎన్నికలకు ముందుగానే టీఆర్ఎస్‌ను వీడిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2012లో తిరిగి బీజేపీలో చేరిన సత్యనారాయణరెడ్డి తుది శ్వాస వరకు పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. మందాడి మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితర ప్రముఖులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

తెలుగు వర్సిటీ పరీక్ష ఫలితాలు విడుదల

నాంపల్లి(హైదరాబాద్): తెలుగు విశ్వవిద్యాలయం వివిధ కోర్సులకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. 2020–21, 2021–22 విద్యా సంవత్సరాలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని 13 ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలు, కళాశాలల్లో ఈ ఏడాది ఆగస్టులో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు వార్షిక పరీక్షలు నిర్వహించారు. పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు విడుదల చేశారని పరీక్షల నియంత్రణాధికారి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను www.teufuuniverrity.ac.in, www.manabadi.co.in వెబ్‌సైట్‌లలో చూడవచ్చని సూచించారు.

గ్రంథాలయాలు.. జ్ఞాన కేంద్రాలు

నది ప్రకృతి ఇచ్చిన ప్రసాదం. మానవాళి తనకు తాను బహుకరించుకున్న కానుక గ్రంథాలయం. ఒకటి జీవధార. రెండోది జ్ఞానధార. నదిని సృష్టించుకున్న ప్రకృతి, ప్రకృతిని కాపాడుకుంటూ మనుగడ సాగిస్తున్నాయి. గ్రంథాలయం కూడా అంతే. వాటితో మనిషి బంధమూ అలాంటిదే. నిన్న ఎలాంటితో అధ్యయనం చేయడానికీ, రేపు ఎలా ఉండాలో సృష్టించడానికీ గ్రంథాలయాలను ప్రతిష్టించుకుంది మానవాళి. ఈ రెండు ధారలు లేని ప్రపంచాన్ని ఊహించడానికి కూడా సాహించవద్దు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా ప్రత్యేక కథనం.



రాజాం గ్రంథాలయంలో పుస్తకాలు

- నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు
- నిరుద్యోగ యువతకు ఆసరాగా గ్రంథాలయాలు
- జిల్లాలో 115 విజ్ఞాన బాండాగారాలు

రాజాం: గ్రంథాలయం ఎంతో మందికి మార్గదర్శిగా మారుతుంది. నిరుద్యోగ యువత గ్రంథాలయాల్లో చదువుకుని ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 115 గ్రంథాలయాలున్నాయి. ఇటీవల కాలంలో ప్రతీ గ్రంథాలయం పాఠకులతో నిండుగా కనిపిస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే మ్యాగ్జైన్‌లతో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాల్లో నిక్షేపితమై ఉంటున్నాయి. వీటిని వినియోగించుకుని గ్రంథాలయాల్లో చదువుతున్న యువత ఉద్యోగాల్లో రాణిస్తుంది. వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ నేతలు కూడా ఈ గ్రంథాలయాలను వినియోగించుకుని అపారమైన జ్ఞానాన్ని పొందుతున్నారు. అందుకే విజ్ఞాన బాండాగారాలుగా ఈ గ్రంథాలయాలు వెలసిల్లుతున్నాయి.

వారోత్సవాలతో చైతన్యం.

గ్రంథాలయ వారోత్సవాలను ప్రతీ ఏడాది నిర్వహిస్తున్నారు. నవంబర్ రెండో వారంలో ఈ ఉత్సవాలు ప్రారంభమౌతాయి. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా సోమవారం నుంచి ఆదివారం వరకూ ఉత్సవాలు నిర్వహణ ఉంటుంది. ఈ వారోత్సవాల సమయంలో గ్రంథాలయాల వద్ద విద్యార్థులకు పోటీ పరీక్షలు, పుస్తక ప్రదర్శన, గ్రంథాలయాల ఉపయోగంపై వక్తల ఉపోద్ఘాతాలు ఉంటాయి. గ్రంథాలయాలను వినియోగించుకుని ఫలితాలు పొందినవారి వివరాలను వెల్లడించడంతో పాటు ప్రజల్లో చైతన్యం కల్గించనున్నారు.

జిల్లాలో శాఖా గ్రంథాలయాలు	41
గ్రామీణ గ్రంథాలయాలు	03
జిల్లా గ్రంథాలయం	01
బుక్ డిపాజిట్ కేంద్ర గ్రంథాలయాలు	70
గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలు	3 వేలు
గ్రంథాలయంలో ప్రతీరోజు వేసే దినపత్రికలు	05
ప్రతీ వారం వచ్చే మ్యాగ్‌జైన్‌లు	15
ప్రతీ గ్రంథాలయంలో రోజువారీ పాఠకులు	200 నుంచి 250 మంది


గ్రంథాలయంలో చదువుకుని...



నేను సంతకవిటి శాఖా గ్రంథాలయానికి వెళ్లేవాడిని. అక్కడ ఎంప్లాయిమెంట్ న్యూస్ మ్యాగ్జైన్ చూసి పలు ఉద్యోగాలకు దరఖాస్తు చేశా.. తొలి ప్రయత్నంలోనే ఆర్మీలో ఉద్యోగం లభించింది. ఇక్కడ పుస్తక జ్ఞానం వల్ల పరీక్షల్లో ఉత్తీర్ణత కావడంతో మంచి ఉద్యోగం లభించింది.

– కర్రి హేమసుందరరావు, ఇండియన్ ఆర్మీ, కాకరాపల్లి

విజ్ఞానానికి దోహదం



గ్రంథాలయంలో చదవడం ద్వారా నాకు మంచి విజ్ఞానం లభించింది. బాగా చదివి డీఎస్సీలో రాణించాను. అప్పట్లో ఈ మొబైల్ టెక్నాలజీ, కోచింగ్ సెంటర్లు ఉండేవి కాదు. గ్రంథాలయమే నాకు గురువు, కోచింగ్ సెంటర్ కూడా.

– గడే అప్పలనాయుడు, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు, రాజాం

డిజిటలైజేషన్ వైపు..



గ్రంథాలయాల ఆవశ్యకత నాటికి.. నేటికి పెరుగుతూ వస్తుంది. ప్రస్తుత ప్రభుత్వం గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసే ఆలోచనలో ఉంది. ఈ ప్రభుత్వం గ్రంథాలయాలను ఎంతో అభివృద్ధి చేసింది. గ్రంథాలయాలు వినియోగించుకోవడం ద్వారా ఎంతో మంది ఫలితాలు పొందుతున్నారు. మా గ్రంథాలయానికి ప్రతీ రోజు 200 మంది వరకూ పాఠకులు వస్తున్నారు.

– సీహెచ్ వెంకటేష్, గ్రంథాలయ అధికారి, రాజాం

బీచ్‌లో పర్యాటకుల సందడి



చింతపల్లి బీచ్‌లో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. కార్తీక మాసానికి పిక్నిక్‌ల సందడి తోడవడంతో పర్యాటకులు వేల సంఖ్యలో బీచ్‌కు వచ్చారు. సందడి చేశారు. బీచ్‌కు సమీపంలోని కొబ్బరి, సరుగుడు తోటల్లో పర్యాటకులు వనభోజనాలు ఆచరించి, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా బీచ్ ఒడ్డున గడిపారు. గోవిందపురం సమీపంలోని ముక్తిధాం క్షేత్రం, షిర్డీసాయిబాబు ఆలయాలను దర్శించుకున్నారు.

– పూసపాటిరేగ

వసివాడుతున్న బాల్యం



పిల్లలు

- ఆనాటి మాధుర్యానికి పూర్తిగా దూరమవుతున్న బాలలు
- తీవ్రప్రభావం చూపుతున్న సోషల్ మీడియా
- కనుమరుగవుతున్న బంధుత్వాలు, స్నేహ సంబంధాలు
- నేడు జాతీయ బాలల దినోత్సవం

విజయనగరం ఫోర్ట్: గతంలో పిల్లలు బాల్యాన్ని, అందులోని మాధుర్యాన్ని ఆస్వాదించేవారు. ఇంట్లో అమ్మమ్మ లేదా నాన్నమ్మలు చెప్పే కథలు శ్రద్ధగా వినేవారు. అదేవిధంగా తోటి పిల్లలతో కలిసి ఆటలు ఆడడం, నలుగురు కలిసి కబుర్లు చెప్పుకోవడం చేసేవారు. కాని నేటి తరం పిల్లలు కథలు వినడానికి, ఆటలు ఆడుకోవడానికి స్వస్తి చెప్పేశారు. రెండు, మూడేళ్ల పిల్లలు సైతం స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. ఫోన్లు, టీవీలు మాత్రమే చూడడం నేటి తరం పిల్లల దినచర్యగా మారిపోవడంతో బాల్యంలోని మాధుర్యానికి పూర్తి దూరంగా ఉంటున్నారు.

చిన్నపాటి మందలింపు సైతం జీర్ణించుకోలేక పోతున్న పిల్లలు

ప్రస్తుతం బాలల్లో చాలా మార్పు వచ్చింది. సెల్ ఫోన్లు, టీవీలు చూసిన పిల్లలను అవి పక్కన బెట్టి చదువుకోండని తల్లిదండ్రులు చిన్న పాటిగా మందలించినా జీర్ణించుకోలేకపోతున్నారు. తల్లిదండ్రులు మందలించారని, డబ్బులు అడిగితే ఇవ్వలేదని కొంతమంది పిల్లలు ఇంటి నుంచి పారిపోయి బయటకు వచ్చేస్తున్నారు.

సోషల్ మీడియా ప్రభావంతో దురలవాట్లు

పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్ వంటివి చూసి కొంతమంది పిల్లలు ఆ విధంగా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వాటి ప్రభావం వల్ల కొంతమంది చెడు అలవాట్లకు లోనవుతున్నారు.

కథలు వినడం, ఆటలు ఆడడానికి స్వస్తి

గతంలో పిల్లలు చందమామ కథలు, పురాణ కథలు వంటివి అమ్మమ్మలు, తాతయ్యలు చెబితే శ్రద్ధగా వినేవారు. అదేవిధంగా ఇంటి వద్ద గోళీలు, తొక్కుడు బిళ్ల వంటి ఆటలు ఆడుకునేవారు. లేదంటే పిల్లలు ఒక చోట కలిసి కబుర్లు చెప్పుకునేవారు. ఇప్పుడు వాటన్నంటికీ స్వస్తి పలికేశారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలు కూడా కలిసి మాట్లాడుకునే పరిస్థితి లేదు. అలాగే ఇంట్లో ఉన్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో కూడా అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు.

బాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



బాలల స్నేహపూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో సహాయ సహకారం అందిస్తున్నారు. బాలల విద్య ఆరోగ్యం, సంక్షేమం, రక్షణ, అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పిల్లల కోసం అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, నాడు–నేడు పనులు, కంటి వెలుగు తదితర అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది.

కేసలి అప్పారావు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్

బాలలతో స్నేహపూర్వకంగా మెలగాలి



బాలలతో పని చేసే శాఖలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. బాలల హక్కుల పరిరక్షణకు నావంతు కృషి చేస్తాను. తల్లిదండ్రులు పిల్లలతో ప్రేమగా నడుచుకోవడం మంచింది.

బి. శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి

మంచి మాట


ఉన్నాయి కదా అని మనం మాటల్ని వాడేస్తూండకూడదు.
వినిపించాయి కదా అని మనం మాటల్ని మాత్రమే
పట్టించుకుని బతుకును పాడు చేసుకోకూడదు.
మాటలతో, మాటలలో మనల్ని మనం వృథా చేసుకోకూడదు.
మాటలకు పరిమితులు ఉంటాయి, ఉన్నాయి.
అనేటప్పుడూ, వినేటప్పుడూ మాటల్ని ఒకస్థాయి వరకే పరిగణించాలి.
మాటలు అని దెబ్బతిన్న సందర్భాలూ, మాటలు విని దెబ్బతిన్న
సందర్భాలూ అందరికీ ఉంటాయి. వాటిని పాఠాలుగా తీసుకోవాలి.
అవసరం అయినంత వరకే మాటల్ని అనాలి, వినాలి.
మాటలు ఎక్కడ అనవసరమో తెలుసుకోవాలి.
మాటలు ఎక్కడ అనర్థమో గ్రహించగలగాలి.



మాటల పాఠాలు

మాటను కంచె అని అన్నారు చైనా తాత్త్వికులు, కవి లావొచు (లావోట్జ్). లావొచు అంటే 'సిద్ధ గురువు' అని అర్థం. వీరి రచనలు తావొ - త - చింగ్ ఆధారంగా తావొ మతం రూపొందింది. కవిత్వం నుంచి మతం పుట్టిన సందర్భం ప్రపంచంలో ఇదొక్కటే.

లావొచు రోజూ ఉదయం పూట ఒక స్నేహితుడితో కలిసి నడకకు వెళ్లే వారు. ఆ సమయంలో వారు ఏ మాటా మాట్లాడేవారు కాదు, తపస్సు చేస్తున్నట్టుగా మౌనంగా ఉండేవారు. ఒక రోజు ఉదయం నడుస్తూండగా లావొచు స్నేహితుడి స్నేహితుడు దారిలో ఎదురుపడి వాళ్లతో కలిసి నడవసాగాడు. వాళ్ల నడక కొనసాగుతున్నప్పుడు ఉదయాన్ని చూస్తూ 'ఈ ఉదయం ఎంతో అందంగా ఉంది' అని అన్నాడు లావొచు స్నేహితుడి స్నేహితుడు. ఆ మాట వినగానే లావొచు ఉన్నపళాన నడక మానేసి ఇంటికి తిరిగి వచ్చేశారు. అది జరిగాక లావొచు స్నేహితుడు లావొచును 'ఏమైంది, చిన్నమాటే కదా అతడన్నది ఆ మాత్రం దానికి మీరు నడక మానేసి తిరిగి వచ్చేయాలా?' అని అడిగాడు. బదులుగా లావొచు ఇలా అన్నారు: 'ఉదయ సౌందర్యమంతా ఆ మాటతో చెదిరిపోయింది. అది శబ్దం లేని సౌందర్యం. దాన్ని మౌనంగా అనుభవించాలి. మాట పుట్టి ఆ సౌందర్యాన్ని వేరు చేసింది. మాట పుట్టడానికి ముందున్న సౌందర్యానుభవం బృహదాత్మకం. మాట పుట్టగానే ఆ బృహత్తుకు కంచె వేసినట్టు అవుతుంది.' ఒకరోజు లావొచు అనుయాయులు 'తెలుసుకున్న వాళ్లు మాట్లాడరు, మాట్లాడుతున్న వాళ్లు తెలుసుకున్న వాళ్లు కారు' అని లావొచు చెప్పిన మాటల గురించి చర్చ చేస్తూ వాళ్ల గురువును ఆ మాటలకు అర్థవివరణను ఇమ్మని అడిగారు. గురువు 'మీలో ఎవరికి గులాబీ పువ్వు పరిమళం తెలుసు?' అని వాళ్లను ప్రశ్నించారు. అందరూ తమకు తెలుసని చెప్పారు. 'మీకు తెలిసిన ఆ విషయాన్ని మాటల్లోకి తీసుకురండి' అని అన్నాడు గురువు. ఆ పని చెయ్యడం చాతకాక శిష్యులు మౌనంగా ఉండిపోయారు.



> 'గురువుల మాటలు జాబిల్లిని చూపించే చేతి వేళ్లు; నువ్వు వేళ్లను గమనిస్తే, జాబిల్లిని చూడలేవు' అని సాంప్రదాయిక బౌద్ధ సాహిత్యం తెలియజెప్పింది.

మాట సత్యానుభవాన్ని సరిగ్గా సమర్పించలేదు. అనుభవానికి పరిధులు ఉండవు. అది ఆకాశంలా అనంతం. మాట సంకుచితమైంది. మాటలలో కూరుకుపోతూంటే మనం అనుభవాన్ని ఆస్వాదించలేం.

మనం మాటల్ని పట్టుకుని కూర్చోకూడదు. ఒకదశ తరువాత మనం మాటల్ని దాటుకుని ముందుకు సాగాలి. ఎందుకంటే మౌనంలోనే సౌందర్యం అనుభవంలోకి వస్తుంది. సౌందర్యానుభవం మాటల్లో చెదిరిపోతుంది. అనుభవాన్ని మాటలు అనువదించలేవు. మాటలతో సౌందర్యానుభవాన్ని పోగొట్టుకోకూడదు.

మాటను కంచె అని లావొచు అనడాన్ని సరిగ్గానూ, సమగ్రంగానూ అవగతం చేసుకోవాలి. మాట కంచె అయి మన చుట్టూ ఉండకూడదు. మాట మనల్ని కట్టిపడెయ్యకూడదు. మాటకు అందని స్థితిలో ఉండే రుచిని ఆస్వాదించగలగాలి. మాటకు అతీతంగా ఉండే అత్యుదాత్తతను మనం అనుభవంలోకి తెచ్చుకోవాలి.

– రోచిష్మాన్





సన్నిధి

ఒక మొక్క చెట్టయి వృద్ధిలోకి రావాలంటే దానికి క్రమం తప్పకుండా నీళ్ళు పోయాలి. అప్పుడు అది పూలతో, పళ్ళతో కళకళలాడుతుంది. కానీ అది ఒక అపూర్వమయిన చెట్టు. దానికి మామూలు పూలు పూయవు. పంట సాధారణంగా ఉండదు. చివరకు అది పెరగడానికి, పుష్పించడానికి, పంట పండించడానికి దానికి నీళ్ళకు బదులు వేరే ఇంధనం అవసరమవుతుంది. అటువంటి చెట్టును గురించి ప్రముఖ కవి గురజాడ ఏం చెబుతున్నారంటే... ''దేశమనియెడి దొడ్డ వృక్షం/ప్రేమలను పూలెత్తవలెనోయ్/నరుల చెమటను తడిసి మూలం/ధనం పంటలు పండవలెనోయ్.'' అంటున్నారు.

ఆ చెట్టుకు నీరు కాదు కావలసింది...

గురువాణి



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఆ చెట్టు ఎక్కడో లేదు. ఈ దేశమే పెద్ద చెట్టు. అది అపూర్వమైనది. అది లేక పోతే మనం లేం. సాధారణంగా చెట్లు రంగు రంగుల పూలు పూస్తాయి. వాటిలో నుంచి సౌరభం, మంచి సువాసనలు వస్తాయి. ఆ పూలలో ఉన్న తేనెకోసం తుమ్మెదలొస్తాయి. అలా చెట్టంతా పూలతో నిండి ఉంటే మరింత అందంగా ఉంటుంది. ఎంత చిన్నది కానీ పెద్దది కానీ దానికి ఒక్క పువ్వు పూయలేదనుకోండి. దానికి అందం, ఆకర్షణ ఉండవు. కానీ దేశమనే ఈ గొప్ప చెట్టుకు పూలు పూయాలి.. అవి భౌతికమైన పూలు కావు. ప్రేమ అనే పూలు. అప్పుడు వాటిలోంచి సౌహార్ద భావనలు వస్తాయి. అందరూ బాగుండాలన్న కోరిక ఉంటుంది. ప్రేమ ఎక్కడుంటుందో అక్కడ ద్వేషం ఉండదు. పగ ఉండదు. చెట్టంతా అలాటి పూలతో ఉంటే అందరి మనసుల లోనూ ప్రేమ భావనలు బాగా పుష్పిస్తాయి. అప్పుడు ఈ దేశమంతా ప్రేమమయం అవుతుంది.

అటువంటి చెట్టు నాలుగు కాలాలపాటూ పచ్చగా కళకళలాడాలంటే ఏం చేయాలి! సాధారణంగా ఏ మొక్కకయినా, చెట్టుకయినా దానికి కింద ఉండే వేరునుంచే నీరు అందాలి. అంతే తప్ప పైన కొమ్మలు తడిసేటట్లు నీరు పోస్తే లాభం లేదు. వేరు మూలం. ఆ మూలానికి నీరు క్రమ పద్ధతిలో అందుతూ ఉండాలి. అయితే ఈ దొడ్డ వృక్షానికి మాత్రం నీరు కాదు కావలసింది. ఈ దేశ ప్రజల చెమట. అది మూలంలో ఉన్న వేరుకు అందాలంటే ప్రతివారూ కష్టపడాలి. ఎలా.. శరీరాలు తడిసేటట్లు, బట్టలు తడిసేటంతగా కష్టపడాలి. ఒకరు కష్టపడి చెమటను కారిస్తే చాలదు. ప్రతి ఒక్కరూ అలా కష్టపడాలి. అప్పుడు నరుల చెమటను తడిసి మూలం/ధనం పంటలు పండవలెనోయ్... ధనం అంటే కేవలం డబ్బు కాదు. సంపద, సుఖం, ఐశ్వర్యం, సంతోషం... అందరూ కష్టపడితే ఈ దేశం అనే గొప్ప వృక్షం ప్రేమ అనే పూలతో శోభిస్తూ, అందరికీ ఆరోగ్యాన్ని, సుఖసంతోషాలను ఇస్తుంది.

కష్టపడే తత్త్వం ఉన్న ప్రజలు ఎక్కడుంటారో, వారి మనసులలో ప్రేమ అనే పూలు ఎక్కడ నిత్యం పుష్పిస్తుంటాయో ఆ దేశం శోభాయమానంగా ప్రకాశిస్తూ ఉంటుంది. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని కూడా గురజాడే అన్నాడు... ఇటువంటి శ్రమజీవులతో నిండిన దేశం ఎప్పుడూ ప్రేమ భావనలు పరిమళింప చేస్తూ సుఖసంతోషాలనే పంటలు పండిస్తూ సమున్నత స్థితిలో ఉంటుంది.



ఇస్లాం వెలుగు

ఇహ పర సాఫల్యం ఇలా..



దివ్య ఖురాన్‌లోని సూరె షూరాలో ఇలా ఉంది: 'వారు ఘోరమైన పాపాలకు, నీతి బాహ్యమైన పనులకు దూరంగా ఉంటారు. కోపోద్రేకాలు కలిగినప్పుడు దిగమింగి ఇతరుల్ని క్షమిస్తారు. తమ ప్రభువు ఆదేశాలను శిరసావహించడానికి సదా సిద్ధంగా ఉంటారు. నమాజును నెలకొల్పుతారు. పరస్పర సలహా సంప్రదింపులతో తమ వ్యవహారాలను నడుపుకుంటారు. మేము ప్రసాదించిన ఉపాధిలో కొంతభాగం మామార్గంలో ఖర్చుపెడతారు. ఇతరులు వారిపై ఏదైనా దౌర్జన్యం చేస్తే దాన్ని వారు ఎదుర్కొంటారు. (42. 37 – 39)

ఈ విధంగా దైవోపదేశాల వెలుగులో జీవితం గడిపే వారికి దైవం తగిన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. కనుక మానవుల ఇహపర జీవన సాఫల్యానికి సంబంధించి అనేక హితవులు చేసి, చక్కని రుజుమార్గం చూపించిన పవిత్ర ఖురాన్ ఉపదేశాలను సర్వకాల సర్వావస్థల్లో పాటించాలి, శిరసావహించాలి. ఎవరైతే వీటిని పాటిస్తారో వారే సాఫల్యం పొందుతారు. మరెవరైతే ఈ హితబోధలను పెడచెవిన పెట్టి, రుజుమార్గానికి బదులు వక్రమార్గాన్ని అవలంబిస్తారో వారు నష్టపోతారు. ఈ విషయానికి సంబంధించిన ఖురాన్ వాక్యం చూడండి:

'.. వారు పరలోకానికి బదులుగా ప్రాపంచిక జీవితాన్నే కోరుకున్నారు. దైవం తన అనుగ్రహాన్ని తిరస్కరించేవారికి మోక్షమార్గం చూపడు. ఆయన వారి హృదయ కవాటాలు మూసివేశాడు. వారి కళ్ళకు, చెవులకు సీలు వేశాడు. వారు పూర్తిగా ఏమరుపాటుకు గురయ్యారు. అందుకని వారు పరలోకంలో తప్పక నష్టానికి గురవుతారు.'(16.107)

మానవుల విశ్వాసం, ఆచరణలను బట్టే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉంటాయని, ఈ ప్రపంచం ఒక పరీక్షాస్థలమని, కర్మలు ఆచరించే కార్యక్షేత్రమని ఖురాన్, హదీసుల ద్వారా మనకు తెలుస్తోంది. అందుకని మానవుడు దైవం చూపిన దారిలో నడుస్తూ, ఆయన ఆదేశాలకను గుణంగా, ప్రవక్త హితోపదేశాల వెలుగులో జీవనం సాగిస్తే ఇహలోక జీవితంతో పాటు, పరలోక జీవితం కూడా సఫలం అవుతుంది.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సినిమా

డిసెంబరులో టీజర్!



● అల్లు అర్జున్

'పుష్ప: ది రూల్' టీజర్ విడుదలకు ప్రణాళిక సిద్ధమైనట్లు తెలుస్తోంది. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ సినిమా తొలి పార్టు 'పుష్ప: ది రైజ్' గత ఏడాది విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం సాధించింది. ఇటీవల ఈ సినిమా మలి పార్టు 'పుష్ప: ది రూల్' షూటింగ్ ప్రారంభం అయ్యింది. అయితే ఈ టీజర్‌ను డిసెంబరు 16న రిలీజ్ చేయాలని చిత్రయూనిట్ ప్లాన్ చేసిందని టాక్. డిసెంబరు 16న 'అవతార్ 2' సినిమా రిలీజ్ అవుతోంది. ఈ సినిమా ప్రదర్శనకు ముందు, విరామ సమయంలో 'పుష్ప: ది రూల్' టీజర్‌ను ఆడియన్స్‌కు చూపించాలని, ఇలా చేస్తే మూవీకి మరింత మైలేజ్ వస్తుందని చిత్రయూనిట్ భావిస్తోందట. అలాగే 'పుష్ప: ది రూల్' ని పది భాషల్లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. కాబట్టి టీజర్ కూడా పది భాషల్లో రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయన్నది ఫిల్మ్‌నగర్ భోగట్టా. రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్, ధనుంజయ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న 'పుష్ప: ది రూల్' సినిమా వచ్చే ఏడాది ఆఖరులో రిలీజ్ కానుందని టాక్.

రీ యూనియన్

తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషలకు చెందిన ప్రముఖ సినీతారలంతా ఒకే చోట కలిసి, ఆట పాటలతో సందడి చేశారు. 1980 దశకం నాటి ప్రముఖ నటీనటులు 'క్లాస్ ఆఫ్ 1980' పేరుతో కొంతకాలంగా ప్రతి ఏడాది రీ యూనియన్ అవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ తారల రీ యూనియన్ పార్టీకి ఈసారి ముంబై వేదిక అయ్యింది. బాలీవుడ్ నటీనటులు జాకీష్రాఫ్, పూనమ్ ధిల్లాన్ ఆతిథ్యమిచ్చారు. ఈ సందర్భంగా పాటలు పాడుతూ, డ్యాన్స్ చేస్తూ, వైవిధ్యమైన ఆటలు ఆడుతూ సందడి చేశారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకుని సరదాగా ఎంజాయ్ చేశారు. కాగా 2019లో హీరో చిరంజీవి ఈ రీ యూనియన్ పార్టీని హైదరాబాద్‌లో హోస్ట్ చేశారు. ఆ తర్వాత కరోనా కారణంగా రెండేళ్ల గ్యాప్ వచ్చింది. ముంబైలో జరిగిన రీ యూనియన్‌లో చిరంజీవి, వెంకటేశ్, అనుపమ్ ఖేర్, అనిల్ కపూర్, వీకే నరేశ్, భానుచందర్, శరత్ కుమార్, అర్జున్, జయప్రద, సుహాసిని, రాధ, రమ్యకృష్ణ, విద్యాబాలన్, ఖుష్బూ, శోభన, నదియా తదితరులు హాజరయ్యారు. అయితే పలు కారణాల వల్ల కొందరు హాజరుకాలేకపోయినట్లు తెలుస్తోంది.



ఆర్ఆర్ఆర్‌కు సీక్వెల్



● రాజమౌళి

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆర్ఆర్ఆర్' (రౌద్రం.. రణం.. రుధిరం). డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ ఏడాది మార్చి 25న విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 'ఆర్ఆర్ఆర్' కి సీక్వెల్ ఆలోచన ఉన్నట్లుగా ఓ సందర్భంలో చిత్ర కథా రచయిత విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. అయితే ఇదే విషయాన్ని రాజమౌళి కూడా చెప్పడం సినిమా లవర్స్‌కు మరింత సంతోషాన్ని ఇస్తోంది. ''నా సినిమాలన్నింటికీ నా ఫాదర్(విజయేంద్రప్రసాద్) కథలు అందించారు. 'ఆర్ఆర్ఆర్ 2' గురించి మా మధ్య చర్చ జరిగింది.. స్క్రిప్ట్‌పై ఆయన వర్క్ చేస్తున్నారు'' అని రాజమౌళి పేర్కొన్నారు. చికాగోలో జరిగిన 'ఆర్ఆర్ఆర్' స్క్రీనింగ్ తర్వాత ఈ సీక్వెల్‌పై రాజమౌళి స్పందించినట్లు వార్తలు వస్తున్నాయి. కాగా రాజమౌళి తన తర్వాతి చిత్రాన్ని మహేశ్‌బాబు హీరోగా తెరకెక్కించనున్నారనే సంగతి తెలిసిందే.

సొట్టబుగ్గలున్న అగ్గిపెట్టే నేను..



● హెబ్బాపటేల్

'నన్ను పట్టుకుంటే జారిపోతుంటాను... ఒంపుసొంపులున్న పాదరసమే నేను.. నన్ను ముట్టుకుంటే నిప్పునవుతుంటాను.. సొట్టబుగ్గలున్న అగ్గిపెట్టే నేను..' అంటూ అదిరిపోయే స్టెప్పులు వేశారు హెబ్బా పటేల్. ఇంద్రసేన హీరోగా నటిస్తున్న పొలిటికల్ థ్రిల్లర్ 'శాసనసభ'. ఇందులో ఐశ్వర్యారాజ్ భకుని, రాజేంద్ర ప్రసాద్, సోనియా అగర్వాల్ ప్రధాన పాత్రలు పోషించారు. తులసీరామ్ సప్పని, షణ్ముగం సప్పని నిర్మాతలు. రవి బసూర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'నన్ను పట్టుకుంటే..'పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. ఈ స్పెషల్ సాంగ్‌లో హెబ్బాపటేల్ మంచి స్టెప్పులు వేశారు. కాసర్లశ్యామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ, సంతోష్ వెంకీ, 'కేజీఎఫ్' ఫేమ్ రవి బసూర్ పాడారు. ప్రేమ్‌రక్షిత్ నృత్యరీతులు సమకూర్చారు.

ప్రేక్షకులు మరోసారి నిరూపించారు - ఉదయ్ శంకర్



● జెన్నీఫర్, ఉదయ్ శంకర్

''నచ్చింది గాళ్ ఫ్రెండూ' వంటి చిన్న సినిమాను పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మా మూవీ ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందని, చివరి పది నిమిషాలు కట్టిపడేశావు అని ఆడియన్స్ అంటున్నారు. థియేటర్‌లో ఎంజాయ్ చేయాల్సిన మూవీ ఇది. ఆ థ్రిల్, ఫీలింగ్ ఓటీటీలో చూస్తే రావు'' అని చిత్ర దర్శకుడు గురు పవన్ అన్నారు. ఉదయ్ శంకర్, జెన్నీఫర్ జంటగా నటించిన చిత్రం 'నచ్చింది గాళ్ ఫ్రెండూ'. అట్లూరి ఆర్. సౌజన్య సమర్పణలో అట్లూరి నారాయణరావు నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం విజయోత్సవంలో ఉదయ్ శంకర్ మాట్లాడుతూ– ''కంటెంట్ బాగుంటే చిన్న చిత్రమైనా ఆదరిస్తామని మా మూవీతో ప్రేక్షకులు మరోసారి నిరూపించారు. సినిమా విడుదలైన అన్ని చోట్ల షోలు పెంచుతున్నారు'' అన్నారు. ''వైవిధ్యమైన కథ, కథనాలతో సినిమా తీశారనే మంచి పేరు వచ్చింది'' అన్నారు అట్లూరి నారాయణ రావు. ''తెలుగులో నా తొలి చిత్రమిది'' అన్నారు జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్.

తెలుగు సినిమాలకే థియేటర్స్ ఇవ్వాలి

- తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి

రానున్న సంక్రాంతి పండుగకు స్ట్రయిట్ తెలుగు సినిమాలకు మాత్రమే థియేటర్లు ఇవ్వాలి అని 'తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్'(తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి) పేర్కొంది. ఈ మేరకు తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి గౌరవ కార్యదర్శులు టి.ప్రసన్న కుమార్, మోహన్ వడ్లపట్లలు ఎగ్జిబిటర్స్‌కి (సినిమా ప్రదర్శకులు) లేఖ రాశారు. 'పెరిగిన నిర్మాణ వ్యయం, నిర్మాతల శ్రేయస్సు కోసం తెలుగు సినిమాని కాపాడుకుందాం అనే లక్ష్యంతో 2017 డిసెంబరు 8న 'తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి' లో అత్యవసర సమావేశం నిర్వహించారు. సంక్రాంతి, దసరా పండుగలకు స్ట్రయిట్ తెలుగు సినిమాలకు మాత్రమే థియేటర్స్ ఇవ్వాలని ఆ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయమై నిర్మాత, ఫిల్మ్ ఛాంబర్ ప్రస్తుత వైస్ ప్రెసిడెంట్ 'దిల్' రాజు కూడా 2019లో మీడియాతో మాట్లాడుతూ 'స్ట్రయిట్ సినిమాలు ఉండగా డబ్బింగ్ సినిమాలకు థియేటర్స్ ఎలా ఇస్తాం?' అని ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు కూడా స్ట్రయిట్ తెలుగు సినిమాలకే తొలి ప్రాధాన్యత ఇచ్చి, మిగిలిన వాటిని డబ్బింగ్ సినిమాలకు కేటాయించాలి. ఈ నిర్ణయాన్ని విధిగా అమలుపర్చాలి' అని ఎగ్జిబిటర్స్‌ని కోరారు.

యాక్షన్ థ్రిల్లర్



● అశ్విన్

అశ్విన్, నందితా శ్వేత జంటగా అనీల్ కన్నెగంటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'హిడింబ'. శ్రీ విఘ్నేశ్ కార్తీక్ సినిమాస్ బ్యానర్‌పై శ్రీధర్ గంగపట్నం నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి అయింది. దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ–''ఒక షాకింగ్ పాయింట్‌తో డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'హిడింబ'. హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్సులు ఆడియన్స్‌ని థ్రిల్ చేస్తాయి. ఈ సినిమా కోసం అశ్విన్ సరికొత్తగా మేకోవర్ అయ్యారు. ఇప్పటికే విడుదలైన మా చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌కు మంచి స్పందన వచ్చింది'' అన్నారు. మకరంద్ దేశ్‌పాండే, సిజ్జు, రాజీవ్ కనకాల, శ్రీనివాస రెడ్డి, 'శుభలేఖ' సుధాకర్, రఘు కుంచె ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: బి.రాజశేఖర్, సంగీతం: వికాస్ బడిసా.

రొమాంటిక్ కపుల్

జియంత్ వదాలి, శగ్న శ్రీ, చలాకి చంటి, ఇమ్మాన్యుయేల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బెస్ట్ కపుల్స్'. దొరల గణేష్ దర్శకత్వంలో పార్థు రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలకానుంది. ''భార్యాభర్తల మధ్య జరిగే సంభాషణలు, ప్రేమాభిమానాలు,గొడవలు.. ఇలాంటి అంశాలు మా సినిమాలో ఉంటాయి. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో ఆడియన్స్‌ను అలరించే అంశాలు ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మహర్షి రవిచంద్ర.



● శగ్న శ్రీ, జయంత్

సీతారామపురంలో...



● రణధీర్, నందిని

''గ్రామీణ నేపథ్యంలో జరిగే విభిన్నమైన ప్రేమకథా చిత్రం 'సీతారామపురంలో ఒక ప్రేమ జంట..'. ట్విస్టులు, అంతర్లీనంగా మంచి సందేశం కూడా ఉంటుంది. మా చిత్రాన్ని యువతరంతో పాటు తల్లితండ్రులు చూడాలి'' అని చిత్ర నిర్మాత బీసు చందర్ గౌడ్ అన్నారు. రణధీర్, నందిని జంటగా ఎం.వినయ్ బాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సీతారామపురంలో ఒక ప్రేమ జంట..'. బీసు చందర్ గౌడ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో మాజీ ఎమ్మెల్యే మోత్కుపల్లి నర్సింహులు, 'తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి' గౌరవ కార్యదర్శి టి.ప్రసన్న కుమార్, నిర్మాత రామసత్యనారాయణ, దర్శకులు వీఎస్ ఆదిత్య, చంద్రమహేష్, వై.కాశీవిశ్వనాథ్ హాజరై, చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు. చిత్ర దర్శకుడు ఎమ్. వినయ్ బాబు మాట్లాడుతూ– ''మంచి కంటెంట్‌తో పాటు వాణిజ్య అంశాలున్న చిత్రమిది. ప్రేక్షకులను మా సినిమా ఏ మాత్రం నిరుత్సాహ పరచదు'' అన్నారు. రణధీర్, నందిని, నటుడు అమిత్ తదితరులు మాట్లాడారు.

ఇంగ్లండ్ ఖాతాలో రూ. 12 కోట్ల 88 లక్షలు

విజేతగా నిలిచిన ఇంగ్లండ్ జట్టుకు 16 లక్షల డాలర్లు (రూ. 12 కోట్ల 88 లక్షలు)... రన్నరప్ పాకిస్తాన్ జట్టుకు 8 లక్షల డాలర్లు (రూ. 6 కోట్ల 44 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. సెమీఫైనల్లో ఓడిన న్యూజిలాండ్, భారత జట్లకు 4 లక్షల డాలర్ల (రూ. 3 కోట్ల 22 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ దక్కింది.

"చాలా గర్వంగా ఉంది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో కొన్ని మార్పులు.. వాటి ఫలితాలు ఇప్పుడు అందుకుంటున్నాం. టోర్నీ చాలా అద్భుతంగా సాగింది. ఐర్లాండ్ చేతిలో ఓటమి అసలు ఎప్పుడు ఎదురైందో అనిపిస్తోంది. కోచ్ మాథ్యూ మాట్ కూడా పూర్తి స్వేచ్ఛనిచ్చి మేం అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రోత్సహించారు. ఆదిల్ రషీద్ ఓవర్ అసాధారణం. అతనికి ఎప్పుడు బంతిని అప్పగించినా ఏదో ఒకటి చేసి చూపిస్తాడు. స్టోక్స్ పోరాటయోధుడు. తన అనుభవంతో అతను ఏదైనా చేయగలడు. కీలక సమయాల్లో రాణించడమే స్టోక్స్ గొప్పతనం. నాలుగున్నర నెలల కెప్టెన్సీలోనే ప్రపంచకప్ దక్కిందనే ఆనందాన్ని మాటల్లో వర్ణించలేకపోతున్నాను. ప్రపంచకప్‌కు ముందు జరిగిన పాకిస్తాన్ పర్యటన మా ఆటగాళ్లందరూ బాగా కలిసిపోయేందుకు ఉపకరించింది. –జోస్ బట్లర్, ఇంగ్లండ్ కెప్టెన్

ఇంగ్లండ్ జట్టుకు అభినందనలు. మైదానంలో ప్రేక్షకులంతా మాకు మద్దతు పలికేందుకే వచ్చినట్లుంది. అందరికీ కృతజ్ఞతలు. గత నాలుగు మ్యాచ్‌లలో మా జట్టు అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఫైనల్లో స్వేచ్ఛగా ఆడాలని మా ఆటగాళ్లకు చెప్పాను. కనీసం 20 పరుగులు తక్కువగా చేసినా చివరి వరకు పోరాడగలిగాం. మా బౌలింగ్ అత్యుత్తమమైంది. అఫ్రిదికి మధ్యలో గాయం కావడం కూడా మాకు ఇబ్బందిగా మారింది. అయితే అదంతా ఆటలో భాగం. –బాబర్ ఆజమ్, పాకిస్తాన్ కెప్టెన్"

వరల్డ్‌కప్ ఫైనల్ ఈసారి 'టై' కాలేదు... సూపర్ ఓవర్లు కూడా సమం కాలేదు... క్రీడా స్ఫూర్తిని ప్రశ్నించడానికి, సగం గెలుపు అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేయడానికి ఇంగ్లండ్ అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు అలాంటి చర్చే రాకుండా అద్భుత ఆటతో అందరికంటే శిఖరాన నిలిచింది. టోర్నీ ఆరంభంలో వర్షం తమ అవకాశాలను దెబ్బకొట్టినా, ఒక్కసారిగా పుంజుకొని మ్యాచ్‌లు వానపాలైన వేదికపైనే విశ్వ విజేతగా ఆవిర్భవించింది. వన్డే, టి20 వరల్డ్‌కప్‌లు రెండూ ఒకే సమయంలో తమ వద్ద కలిగి ఉన్న తొలి జట్టుగా చరిత్రకెక్కింది. మూడేళ్ల క్రితం వన్డే వరల్డ్‌కప్ గెలిచినా వివాదం వెంట తీసుకొచ్చి ఆనందం కాస్త మసకబారగా... అంతకు ముందే ఆరేళ్ల క్రితం టి20 వరల్డ్‌కప్ ఆఖరి మెట్టుపై అనూహ్య రీతిలో ఓడింది. వాటిని మరిచేలా తాజా విజయం పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఇంగ్లండ్ ఆధిపత్యాన్ని చూపించింది.

వరల్డ్‌కప్ ఫైనల్ పోరులో 8 ఫోర్లు, 2 సిక్సర్లు... తొలుత బ్యాటింగ్ చేస్తూ పాకిస్తాన్ చూపిన పేలవ బ్యాటింగ్ ఇది... టి20ల్లో చివరి నాలుగు ఓవర్లంటే బౌలర్లకు డెత్ ఓవర్లు! కానీ పాక్ దానిని రివర్స్‌గా మార్చింది. ఆఖరి 4 ఓవర్లలో కనీసం 40 పరుగులు చేస్తే విజయంపై ఆశలు ఉంచుకోగలిగే చోట 18 పరుగులకే పరిమితమైంది. ముగింపు స్కోరుతోనే పాక్ ఓటమికి పునాది పడింది. టోర్నీ ఆసాంతం చెలరేగిన స్యామ్ కరన్ బౌలింగ్ పదును ముందు పాక్ తేలిపోయింది.

2012 ఫైనల్లో కూడా విండీస్ 137 పరుగులే చేసి విజేతగా నిలిచిన తీరు గుర్తుకొచ్చిందేమో... పాక్‌లో కాస్త ఆశలు పెరిగాయి! పైగా తొలి ఓవర్లోనే హేల్స్ అవుట్ కావడం, మెల్‌బోర్న్ మైదానం మొత్తం హోరెత్తిపోవడం ఆ జట్టును మరింత ఉత్సాహపరచింది. మధ్య ఓవర్లలో ప్రత్యర్థిని పాక్ కట్టడి కూడా చేయగలిగింది కూడా. అయితే పాక్ ఆశించినట్లుగా 1992 పునరావృతం కాలేదు. బెన్ స్టోక్స్ వారి ఆశలపై నీళ్లు చల్లాడు. 43 మ్యాచ్‌ల టి20 కెరీర్‌లో తన తొలి అర్ధసెంచరీ చేసేందుకు అతను సరైన సమయాన్ని ఎంచుకున్నట్లున్నాడు. చివరి వరకూ నిలబడి మరోసారి తన చేతుల మీదుగా ఇంగ్లండ్‌ను వరల్డ్‌కప్ చాంపియన్‌గా నిలిపాడు.

ఇదీ ఇంగ్లండ్‌దే

టి20 ప్రపంచకప్ కూడా సొంతం • గెలిపించిన కరన్, స్టోక్స్ • ఫైనల్లో 5 వికెట్లతో పాకిస్తాన్ ఓటమి

వరుసగా వన్డే, టి20 వరల్డ్‌కప్‌లు సాధించిన తొలి జట్టుగా ఇంగ్లండ్ రికార్డు



మెల్‌బోర్న్: టి20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ విజేతగా నిలిచింది. 2010లో తొలిసారి టైటిల్ సాధించిన ఆ జట్టు పుష్కర కాలం తర్వాత మళ్లీ ట్రోఫీని అందుకుంది. ఆదివారం మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్ 5 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. షాన్ మసూద్ (28 బంతుల్లో 38; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, కెప్టెన్ బాబర్ ఆజమ్ (28 బంతుల్లో 32; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్యామ్ కరన్ (3/12) పాక్‌ను పడగొట్టగా... ఆదిల్ రషీద్, జోర్డాన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఇంగ్లండ్ 19 ఓవర్లలో 5 వికెట్లకు 138 పరుగులు చేసి గెలిచింది. బెన్ స్టోక్స్ (49 బంతుల్లో 52 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో చివరి వరకు నిలిచి జట్టును గెలిపించాడు. 6 మ్యాచ్‌లలో 11.38 సగటు, 6.52 ఎకానమీతో 13 వికెట్లు పడగొట్టి ఇంగ్లండ్ టైటిల్ విజయంలో కీలక పాత్ర పోషించిన స్యామ్ కరన్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా కూడా నిలిచాడు.

అంతా విఫలం...

ఓపెనర్లు బాబర్, రిజ్వాన్ (15) పాక్‌కు దూకుడైన ఆరంభం ఇవ్వడంలో విఫలమయ్యారు. తొలి నాలుగు ఓవర్లలో ఆ జట్టు ఒకే ఒక బౌండరీ (సిక్స్) కొట్టగా, తర్వాతి ఓవర్లో రిజ్వాన్ వెనుదిరిగాడు. పవర్‌ప్లేలో స్కోరు 39 పరుగులకు చేరింది. ధాటిగా ఆడగల హారిస్ (8)ను రషీద్ తన తొలి బంతికే అవుట్ చేయగా, 10 ఓవర్లు ముగిసేసరికి జట్టు 68 పరుగులు చేసింది. ఇందులో మూడు ఫోర్లే ఉన్నాయి! లివింగ్‌స్టోన్ ఓవర్లో 4, 6తో మసూద్ జోరును పెంచే ప్రయత్నం చేయగా, బాబర్‌ను చక్కటి రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేసి రషీద్ మళ్లీ దెబ్బ కొట్టాడు. ఇఫ్తికార్ (0) కూడా చేతులెత్తేయడంతో పాక్ కష్టాలు మరింత పెరిగాయి. ఇంగ్లండ్ పదునైన బౌలింగ్‌లో తీవ్రంగా ఇబ్బంది పడిన పాక్ బ్యాటర్లు భారీ షాట్లు ఆడటంలో పూర్తిగా విఫలమయ్యారు. డెత్ ఓవర్లలో జట్టు పరిస్థితి మరీ ఘోరంగా కనిపించింది. చివరి 4 ఓవర్లలో పాక్ కేవలం 18 పరుగులు మాత్రమే జోడించి ఓవర్‌కు ఒక వికెట్ చొప్పున 4 వికెట్లు కోల్పోయింది. దాంతో కనీస స్కోరును కూడా సాధించలేక పాక్ ఇన్నింగ్స్ ముగించింది.

హేల్స్ విఫలం...

ఛేదనలో ఇంగ్లండ్ కూడా గొప్పగా ఆడలేదు. అయితే లక్ష్యం బాగా చిన్నది కావడంతో జాగ్రత్తగా, తగిన ప్రణాళికతో ఆ జట్టు విజయాన్నందుకుంది. తొలి ఓవర్లోనే ప్రమాదకరమైన హేల్స్ (1)ను షాహిన్ అఫ్రిది అవుట్ చేయగా, జోస్ బట్లర్ (17 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఆపై నసీమ్ తొలి ఓవర్లోనే ఇంగ్లండ్ మూడు ఫోర్లతో ఎదురుదాడి చేసింది. రవూఫ్ తన రెండు వరుస ఓవర్లలో సాల్ట్ (10), బట్లర్‌లను అవుట్ చేయడంతో పవర్‌ప్లే ముగిసేసరికి ఇంగ్లండ్ స్కోరు 49/3 వద్ద నిలిచింది. ఈ దశలో పాక్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఇంగ్లండ్ బ్యాటర్లు పరుగుల కోసం తీవ్రంగా శ్రమించారు. బౌండరీలు రావడం కష్టంగా మారిపోయింది. ఒకదశలో వరుసగా 31 బంతుల పాటు ఇంగ్లండ్ బౌండరీ కొట్టలేకపోయింది! అయితే స్టోక్స్ మాత్రం పట్టుదలగా నిలబడ్డాడు. హ్యారీ బ్రూక్ (23 బంతుల్లో 20; 1 ఫోర్) అవుటైనా... సింగిల్స్‌తోనే పరుగులు రాబడుతూ తన వికెట్ మాత్రం అప్పగించకుండా జాగ్రత్త పడ్డాడు. గాయంతో అఫ్రిది అర్ధాంతరంగా తప్పుకోవడంతో ఆ ఓవర్ పూర్తి చేసేందుకు ఇఫ్తికార్ రాగా వరుసగా 4, 6 బాదాడు. 24 బంతుల్లో 28 పరుగులు చేయాల్సిన దశలో వసీమ్ వేసిన 17వ ఓవర్లో మొయిన్ అలీ (12 బంతుల్లో 19; 3 ఫోర్లు) 3 ఫోర్లు కొట్టడంతో పని సులువైంది. వసీమ్ వేసిన 19వ ఓవర్లో నాలుగో బంతికి ఫోర్‌తో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న స్టోక్స్... చివరి బంతిని మిడ్ వికెట్ దిశగా సింగిల్ తీసి ఇంగ్లండ్‌ను వరల్డ్ చాంపియన్‌గా నిలిపాడు.


స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: రిజ్వాన్ (బి) కరన్ 15; బాబర్ (సి అండ్ బి) రషీద్ 32; హారిస్ (సి) స్టోక్స్ (బి) రషీద్ 8; మసూద్ (సి) లివింగ్‌స్టోన్ (బి) రషీద్ 38; ఇఫ్తికార్ (సి) బట్లర్ (బి) స్టోక్స్ 0; షాదాబ్ (సి) వోక్స్ (బి) జోర్డాన్ 20; నవాజ్ (సి) లివింగ్‌స్టోన్ (బి) కరన్ 5; వసీమ్ (సి) లివింగ్‌స్టోన్ (బి) జోర్డాన్ 4; అఫ్రిది (నాటౌట్) 5; రవూఫ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 137.** **వికెట్ల పతనం:** 1-29, 2-45, 3-84, 4-85, 5-121, 6-123, 7-129, 8-131. **బౌలింగ్:** స్టోక్స్ 4-0-32-1, వోక్స్ 3-0-26-0, స్యామ్ కరన్ 4-0-12-3, రషీద్ 4-1-22-2, జోర్డాన్ 4-0-27-2, లివింగ్‌స్టోన్ 1-0-16-0.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బట్లర్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 26; హేల్స్ (బి) అఫ్రిది 1; సాల్ట్ (సి) ఇఫ్తికార్ (బి) రవూఫ్ 10; స్టోక్స్ (నాటౌట్) 52; బ్రూక్ (సి) అఫ్రిది (బి) షాదాబ్ 20; మొయిన్ అలీ (బి) వసీమ్ 19; లివింగ్‌స్టోన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (19 ఓవర్లలో 5 వికెట్లకు) 138.** **వికెట్ల పతనం:** 1-7, 2-32, 3-45, 4-84, 5-132. **బౌలింగ్:** షాహిన్ అఫ్రిది 2.1-0-13-1, నసీమ్ 4-0-30-0, రవూఫ్ 4-0-23-2, షాదాబ్ 4-0-20-1, వసీమ్ 4-0-38-1, ఇఫ్తికార్ 0.5-0-13-0.

అదే దూకుడు...అదే ఫలితం!

సాక్షి క్రీడా విభాగం


రషీద్

'లెట్ ఇట్ హర్ట్...' ఐర్లాండ్ చేతిలో అనూహ్య ఓటమి తర్వాత తన సహచరులకు ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ ఇచ్చిన ఏకవాక్య సందేశం ఇది. ఏమీ పర్వాలేదు, గెలుపోటములు ఆటలో భాగం అనే రొటీన్ మాటలు చెప్పి అతను తమ పరాజయాన్ని చిన్నదిగా చూపించే ప్రయత్నం చేయలేదు. 'ఈ ఓటమి మనల్ని బాధించనివ్వండి. ప్రతీ క్షణం గుర్తు చేసుకుంటేనే తర్వాతి మ్యాచ్‌లు గెలవాలన్న కసి పెరుగుతుంది' అని బట్లర్ చెప్పాడు. తర్వాతి మ్యాచ్ ఆస్ట్రేలియాతో వర్షం కారణంగా పూర్తిగా రద్దయింది. దాంతో ముందంజ వేయడంపై మరోసారి సందేహాలు! అయితే తర్వాతి రెండు మ్యాచ్‌లలో సత్తా చాటుతూ కివీస్, శ్రీలంకపై విజయాలతో సెమీస్, ఆపై భారత్‌పై ఘన విజయంతో ఫైనల్లో చోటు. ఇక తుది పోరులో కూడా సంపూర్ణ ఆధిపత్యంతో టైటిల్ సొంతం.


స్యామ్ కరన్

ఇంగ్లండ్ టైటిల్ విజయంలో ప్రధాన ఆటగాళ్లందరి పాత్ర ఉంది. కీలక సమయాల్లో వీరంతా తమ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించారు. ఓపెనర్లుగా బట్లర్ (225 పరుగులు), హేల్స్ (212 పరుగులు) అదీ దాదాపు 150 స్ట్రయిక్‌రేట్‌తో పరుగులు చేయడంతో ఆరంభంలోనే ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం సాధించేందుకు వీలు కలిగింది. వీరిద్దరు కలిసి టోర్నీలో 6 మ్యాచ్‌లలోనే 43 ఫోర్లు, 17 సిక్సర్లు బాదడం విశేషం. మిడిలార్డర్‌లో కొంత తడబాటు కనిపించినా ఓపెనర్లు ఇచ్చిన పునాదులపైనే ఇంగ్లండ్ విజయయాత్ర సాగిందనడం అతిశయోక్తి కాదు. 'బిగ్ గేమ్–బిగ్ మ్యాన్' అంటూ గుర్తింపు తెచ్చుకున్న బెన్ స్టోక్స్ నిజంగా ఈ టోర్నీలో జట్టుకు మూలస్తంభంలా నిలిచాడు. టోర్నీకి ముందు టి20 టీమ్‌లో అతని స్థానంపై విమర్శలు వచ్చాయి. అయితే బ్యాటింగ్ అవసరమైతే బ్యాటింగ్‌తో, బౌలింగ్ అవసరమైతే బౌలింగ్‌తో అతను సత్తా చాటాడు. శ్రీలంకతో మ్యాచ్‌లో, ఫైనల్లో అతను పట్టుదలగా నిలబడి ఉండకపోతే ఫలితాలు భిన్నంగా ఉండేవేమో! కొత్త బంతితో కేవలం 6.79 ఎకానమీతో అతను తీసిన 6 కీలక వికెట్లు ఇంగ్లండ్‌ను ముందుకు నడిపించాయి. బౌలింగ్‌లో స్యామ్ కరన్ చూపిన ప్రతిభ అసాధారణం. గత ఏడాది గాయంతో వరల్డ్ కప్‌కు దూరమై కామెంటేటర్‌గా మైదానంలో కనిపించిన అతను ఏడాదిలోగా 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలుస్తాడని ఎవరూ ఊహించలేదు. అతను తీసిన 13 వికెట్లలో ప్రతీది విలువైందే. ముఖ్యంగా ఫైనల్లో ప్రదర్శన చిరకాలం గుర్తుండిపోతుంది. కరన్‌కు తోడుగా లెగ్‌స్పిన్నర్ ఆదిల్ రషీద్ ముద్ర కూడా టోర్నీపై ఎంతో ఉంది. రషీద్ ఆటను చూసినప్పుడల్లా భారత అభిమానులు చహల్‌తో ఒక్క మ్యాచ్ కూడా ఎందుకు ఆడించలేదు అని బాధపడటం సహజం! 6.12 ఎకానమీతో అతను ప్రత్యర్థులను కట్టి పడేశాడు. వరల్డ్ కప్ ఫైనల్లో ఇన్నింగ్స్ 12వ ఓవర్ మెయిడిన్ వేయడం అంటే సాధారణ విషయం కాదు. అదీ బాబర్ ఆజమ్ వికెట్‌తో రావడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. మార్క్ వుడ్ తన పదునైన పేస్‌తో 4 మ్యాచుల్లోనే 9 వికెట్లు తీసి సత్తా చాటాడు.

2015 వన్డే వరల్డ్ కప్‌లో చిత్తయిన తర్వాత ఆట, రాత మార్చుకున్న ఇంగ్లండ్ మోర్గాన్ నాయకత్వంలో పదును తేలింది. విధ్వంసక జట్టుగా తయారై 2019లో విశ్వ విజేతగా నిలిచింది. మోర్గాన్ జట్టుకు కొత్త దశ, దిశను చూపించినవాడిగా నిలిచాడు. ఇప్పుడు సరైన సమయంలో మోర్గాన్ తప్పుకొని బట్లర్‌కు పగ్గాలు అప్పగించాడు. కొత్త కెప్టెన్సీలో కొన్ని కొత్త మొహాలు వచ్చాయంతే...జట్టు దృక్పథం మాత్రం మారలేదు. అదే దూకుడు, అవసరమైతే 11వ నంబర్ ఆటగాడు కూడా సిక్స్‌లు కొట్టేందుకు సిద్ధంగా ఉండటం, జట్టులో సగం మంది ఆల్‌రౌండర్లు ఒక విభాగంలో విఫలమైతే, రెండో విభాగంలో సత్తా చాటుకోవడం... ఇవన్నీ జట్టులో అంతర్భాగంగా మారిపోయాయి. ఫలితంగానే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో వరుసగా రెండో ప్రపంచకప్ ఇంగ్లండ్ ఇంటికి చేరింది.

స్టోక్స్ 2016 – 2022


బెన్ స్టోక్స్

2019 వన్డే వరల్డ్‌కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్'గా ఇంగ్లండ్‌ను విజేతగా నిలిపిన వాడు బెన్ స్టోక్స్. కానీ అంతకు ముందునాటి 2016 టి20 ప్రపంచకప్ ఫైనల్ మాత్రం అతని కెరీర్‌లో చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. ఈ ఫార్మాట్‌లో చేరువగా వచ్చి దూరమైన వరల్డ్ కప్‌ను అందుకోవాలని ఉందని స్టోక్స్ చెబుతూ వచ్చాడు. నాటి ఫైనల్లో చివరి ఓవర్లో వెస్టిండీస్ 19 పరుగులు చేయాల్సి ఉండగా, స్టోక్స్ బౌలింగ్‌లో కార్లోస్ బ్రాత్‌వైట్ తొలి నాలుగు బంతుల్లో సిక్సర్లు కొట్టి జట్టును గెలిపించగా... స్టోక్స్ మైదానంలో కుప్పకూలిపోయాడు. ఆ బాధ కూడా మరిచేలా ఈ ఫలితం చేసింది. చివరి వరకు క్రీజ్‌లో నిలిచి తొలి అర్ధసెంచరీతో జట్టుకు విజయం అందించిన స్టోక్స్‌కు ఈ గెలుపు మరింత ప్రత్యేకం.

షాహిన్ అఫ్రిది గాయంతో...



మ్యాచ్ కీలకదశలో ప్రధాన పేసర్ షాహిన్ అఫ్రిది గాయంతో తప్పుకోవడంతో పాక్‌కు ఎదురుదెబ్బ తగిలింది. 13 ఓవర్లో బ్రూక్ క్యాచ్ అందుకునే క్రమంలో అఫ్రిది మోకాలికి గాయమైంది. చికిత్స అనంతరం 16వ ఓవర్ వేసేందుకు అతను వచ్చాడు. ఈ సమయంలో ఇంగ్లండ్ 30 బంతుల్లో 41 పరుగులు చేయాల్సి ఉంది. అయితే ఒక బంతి వేయగానే అతను బౌలింగ్ నుంచి తప్పుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్‌ను, స్వల్ప లక్ష్యాన్ని చూస్తే అఫ్రిది మిగతా 11 బంతులు వేసినా పెద్దగా ఫలితం ఉండేదో లేదో చెప్పలేం కానీ... అతని తొలి 2 ఓవర్ల బౌలింగ్ చూస్తే మాత్రం పాక్ అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకుందనేది వాస్తవం. వరల్డ్ కప్ తొలి 2 మ్యాచ్‌లలో సగం ఫిట్‌నెస్‌తోనే ఇబ్బందిగా ఆడిన షాహిన్, తర్వాతి 4 మ్యాచ్‌లలో పూర్తి ఫిట్‌గా మారి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే ఇప్పుడు అసలు పోరులో మోకాలి గాయం తిరగబెట్టింది.

వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు సింధు దూరం




న్యూఢిల్లీ: వచ్చే నెలలో చైనాలో జరిగే బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నీ 'వరల్డ్ టూర్ ఫైనల్స్' నుంచి భారత స్టార్ షట్లర్ పీవీ సింధు వైదొలిగింది. చీలమండ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడం వల్లే టోర్నీకి దూరమవుతున్నట్లు ఆమె తెలిపింది. ఆగస్టులో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో ఆమె గాయపడింది. 'మరికొంత కాలం విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్ సూచించారు. అప్పుడే కొత్త సీజన్‌ను పూర్తి ఫిట్‌నెస్‌తో, ఉత్సాహంతో ప్రారంభించవచ్చని చెప్పారు. అందువల్లే టోర్నీ నుంచి సింధు వైదొలగాలని నిర్ణయించుకుంది' అని ఆమె తండ్రి రమణ వెల్లడించారు.

హైదరాబాద్‌కు త్రిపుర షాక్


రవితేజ

న్యూఢిల్లీ: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో శనివారం డిఫెండింగ్ చాంపియన్ హిమాచల్ ప్రదేశ్‌ను ఓడించిన హైదరాబాద్‌కు ఆదివారం చుక్కెదురైంది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా త్రిపుర జట్టుతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 46.1 ఓవర్లలో 190 పరుగులకే ఆలౌటైంది. అభిజిత్ సర్కార్ (3/27) దెబ్బకు హైదరాబాద్ 16 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో రవితేజ (72; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టును ఆదుకున్నాడు. రిషిత్ రెడ్డి (39; 6 ఫోర్లు)తో ఐదో వికెట్‌కు 81 పరుగులు.. భావేశ్ సేథ్ (25; 1 ఫోర్, 1 సిక్స్)తో ఆరో వికెట్‌కు 58 పరుగులు జత చేశాడు. 191 పరుగుల లక్ష్యాన్ని త్రిపుర జట్టు 35 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి అధిగమించింది. ఓపెనర్ విశాల్ ఘోష్ (102 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేయగా, దీపక్ (67; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించాడు. హైదరాబాద్ జట్టులో ఏకంగా 9 మంది బౌలింగ్ చేయగా.. సంకేత్ 41 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు.

తమిళనాడు చేతిలో ఆంధ్ర ఓటమి


భరత్

ఆలూర్ (కర్ణాటక): విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం జరిగిన ఎలైట్ గ్రూప్ 'సి' లీగ్ మ్యాచ్‌లో తమిళనాడు తొమ్మిది వికెట్ల తేడాతో ఆంధ్ర జట్టును ఓడించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర 45.3 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అభిషేక్ రెడ్డి (85; 9 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ శ్రీకర్ భరత్ (51; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 107 పరుగులు జోడించారు. తమిళనాడు బౌలర్లలో సిలాంబరాసన్ మూడు వికెట్లు తీయగా... సందీప్ వారియర్, సాయికిశోర్, సంజయ్ యాదవ్ రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం తమిళనాడు ధాటిగా ఆడి 32.1 ఓవర్లలో వికెట్ నష్టపోయి 206 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్ జగదీశన్ (114 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. సాయి సుదర్శన్ (73; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి జగదీశన్ తొలి వికెట్‌కు 177 పరుగులు జత చేశాడు.

సమర్థ్ 200

- విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీలో డబుల్ సెంచరీ చేసిన సౌరాష్ట్ర ఓపెనర్
- 131 బంతుల్లో 20 ఫోర్లు, 9 సిక్స్‌లతో మెరుపు ఇన్నింగ్స్


సమర్థ్

న్యూఢిల్లీ: దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆదివారం అద్భుతం చోటు చేసుకుంది. ఇక్కడి జామియా మిలియా యూనివర్సిటీ మైదానంలో మణిపూర్‌తో జరిగిన ఎలైట్ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టు పరుగుల వరద పారించింది. ఏకంగా 282 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించింది. ఓపెనర్ సమర్థ్ వ్యాస్ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. 131 బంతులు ఆడిన సమర్థ్ 20 ఫోర్లు, 9 సిక్స్‌లతో సరిగ్గా 200 పరుగులు సాధించి అవుటయ్యాడు. మరో ఓపెనర్ హార్విక్ దేశాయ్ (107 బంతుల్లో 100; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 36.3 ఓవర్లలో 282 పరుగులు జోడించడం విశేషం. సమర్థ్, హార్విక్ మెరుపు ఇన్నింగ్స్‌తో తొలుత బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 397 పరుగులు సాధించింది. 398 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మణిపూర్‌ను సౌరాష్ట్ర ఎడంచేతి వాటం స్పిన్నర్ ధర్మేంద్రసింగ్ జడేజా తిప్పేశాడు. 32 ఏళ్ల ధర్మేంద్రసింగ్ 10 ఓవర్లు వేసి కేవలం 10 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. దాంతో మణిపూర్ 41.4 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌటై ఓడిపోయింది.

9 లిస్ట్ 'ఎ' క్రికెట్‌లో (అంతర్జాతీయ, దేశవాళీ వన్డే మ్యాచ్‌లు) డబుల్ సెంచరీ సాధించిన తొమ్మిదో భారత క్రికెటర్‌గా సమర్థ్ వ్యాస్ నిలిచాడు. గతంలో రోహిత్ శర్మ (3 డబుల్ సెంచరీలు), సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, శిఖర్ ధావన్, పృథ్వీ షా, సంజూ సామ్సన్, యశస్వి జైస్వాల్, కేవీ కౌశల్ ఈ ఘనత సాధించారు.


మెస్సీ

అర్జెంటీనా జోరు కనబర్చేనా!

'ఫిఫా' ఫుట్‌బాల్ ప్రపంచకప్ అంటే గుర్తొచ్చేది అర్జెంటీనా. దివంగత దిగ్గజం మారడోనా నుంచి నేటి తరం మెస్సీ దాకా అర్జెంటీనాను అందలంలో నిలిపిన వారే! ఇలాంటి జట్టు ఉన్న గ్రూప్‌లో మిగతా ప్రత్యర్థులకు గుండె హడల్ గ్యారంటీ. గ్రూప్ 'సి'లో ఈ మేటి జట్టును ఎదుర్కొనేందుకు మెక్సికో, పోలాండ్, సౌదీ అరేబియా సర్వశక్తులు ఒడ్డాల్సిందే. ఓడించలేకపోయినా... కనీసం నిలువరించినా ఆయా జట్లకు గెలిచినంత సంబరం. ఈ నేపథ్యంలో ఏ జట్టు అర్జెంటీనాను 'ఢీ'కొంటుందనేది ఆసక్తికరం!

అర్జెంటీనా

ప్రపంచకప్‌లో శక్తిమంతమైన జట్లలో అర్జెంటీనా ఒకటి. ఖతర్ ఈవెంట్‌లో తన బలాన్ని ప్రపంచానికి చాటేందుకు సిద్ధమైంది. తమ ఆల్ టైమ్ గ్రేటెస్టు ఫుట్‌బాలర్ లయోనల్ మెస్సీకి ఘనమైన వీడ్కోలు పలకాలనే పట్టుదలతో ఉంది. 35 ఏళ్ల మెస్సీ ప్రపంచకప్ మెరుపులకు ఖతరే ఆఖరి వేదిక. ఆ తర్వాత ఆటకు టాటా చెప్పడమే తరువాయి. గతేడాది గట్టి ప్రత్యర్థి బ్రెజిల్‌ను ఓడించి 'కోపా అమెరికా కప్'ను గెలిచింది. ఆ టోర్నీలో మెస్సీతో పాటు ఏంజెల్ డి మరియా అద్భుతంగా రాణించారు.

ఫిఫా ర్యాంక్: 3 **ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన:** రెండుసార్లు విజేత (1978, 1986). **ఇతర ఘనతలు:** 15 సార్లు 'కోపా అమెరికా కప్' టైటిళ్లు. **అర్హత:** దక్షిణ అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీలో రన్నరప్ ద్వారా. **కీలక ఆటగాళ్లు:** మెస్సీ, డి మరియా, లో సెల్సో.

మెక్సికో

ఈ గ్రూప్‌లో అర్జెంటీనా తర్వాత మరో మంచి జట్టు మెక్సికో. గత ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ జర్మనీని కంగుతినిపించి గ్రూప్ దశను ఆరంభించిన మెక్సికో తదుపరి రౌండ్ ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. ఈసారి మాత్రం మెరుగైన ప్రదర్శన ఇచ్చేందుకు చెమటోడ్చింది. అర్జెంటీనాకు చెందిన కోచ్ గెరార్డో మార్టినో 2019 నుంచి మూడున్నరేళ్లుగా జట్టును సానబెడుతున్నారు. స్టార్ ఆటగాళ్లు రాల్ జిమెనెజ్, హెక్టర్ హెరెరా, హిర్వింగ్ లొజానోలపై జట్టు భారీ ఆశలు పెట్టుకుంది.



ఫిఫా ర్యాంక్: 13. **ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన:** క్వార్టర్ ఫైనల్ (1986). **ఇతర ఘనతలు:** కాన్ఫెడరేషన్ కప్ విజేత (1999). **అర్హత:** ఉత్తర, మధ్య అమెరికా క్వాలిఫయింగ్ టోర్నీ రన్నరప్‌తో. **కీలక ఆటగాళ్లు:** జిమెనెజ్, హిరెరా.

పోలాండ్

అర్జెంటీనా, మెక్సికోలతో పోల్చితే గట్టి ప్రత్యర్థి కాదు కానీ... ఈ గ్రూప్‌లో 'డార్క్ హార్స్' అని చెప్పొచ్చు. తనదైన రోజున ఒక్క గోల్‌తో పైచేయి సాధించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. స్టార్ ఆటగాళ్ల ఫామ్‌లో ఉండటం జట్టుకు కలిసొచ్చే అంశం. స్ట్రయికర్లు రాబర్ట్ లెవండోస్కీ, పీటర్ జెలిన్‌స్కీ, మాటీ కాష్‌లు ఇటీవల బాగా ఆకట్టుకుంటున్నారు. ఇంగ్లండ్, స్పెయిన్ లీగ్‌లలో సత్తా చాటుకున్నారు. ఈ ఏడాది ఆరంభంలోనే కోచ్ బాధ్యతలు చేపట్టిన చెస్లా మిచ్‌నివిక్ (పోలాండ్) సొంత జట్టును ప్రపంచకప్‌కు సిద్ధం చేస్తున్నారు. అయితే మేటి జట్లను దాటుకుని నాకౌట్ చేరడం అంత సులువేమీ కాదు.

ఫిఫా ర్యాంక్: 26. **ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన:** మూడో స్థానం (1982). **ఇతర ఘనతలు:** 'యూరో కప్'లో క్వార్టర్స్ (2016). **అర్హత:** యూరోపియన్ క్వాలిఫయింగ్ ప్లేఆఫ్ విన్నర్. **కీలక ఆటగాళ్లు:** లెవండోస్కీ, జెలిన్‌స్కీ.

సౌదీ అరేబియా

గ్రూప్‌లోని మిగతా జట్లకంటే తక్కువ ర్యాంక్ జట్టు. పైగా గత నాలుగు ప్రపంచకప్‌లలో గ్రూప్ దశనే దాటలేకపోయింది. ఇలాంటి జట్టు గ్రూప్ 'సి' నుంచి ప్రిక్వార్టర్స్ చేరితే అది సంచలనమే అవుతుంది. అయితే గల్ఫ్ దేశంలోనే మెగా ఈవెంట్ జరగడం కాస్త కలిసొచ్చే అంశం కానీ... ముందడుగు వేయడం కష్టమే! కీలక ఆటగాళ్లు సలేహ్ అల్ శెహ్రి, సలిమ్, సాల్మన్ అల్ ఫరాజ్ తమ ప్రదర్శనతో గల్ఫ్ సాకర్ ప్రియుల్ని అలరించడం ఖాయం. ఫ్రాన్స్‌కు చెందిన కోచ్ హెర్వ్ రినార్డ్ 2019 నుంచి జట్టును తీర్చిదిద్దుతున్నాడు.

ఫిఫా ర్యాంక్: 51. **ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన:** ప్రిక్వార్టర్స్ (1994). **ఇతర ఘనతలు:** ఆసియా చాంపియన్ (1984, 1988, 1996). **అర్హత:** ఆసియా క్వాలిఫయింగ్‌లో గ్రూప్ 'బి' రన్నరప్. **కీలక ఆటగాళ్లు:** సలేహ్ అల్ శెహ్రి, అల్ ఫరాజ్.

–సాక్షి క్రీడా విభాగం

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,181	321
61,795	18,350

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	11,322	▲	209
డోజోన్స్	33,748	▽	32
ఎఫ్‌టీఎస్ఈ 100	7,318	▽	57
డాక్స్	14,225	▲	79
షాంఘై	3,087	▲	51
నికాయ్	28,264	▲	817

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ముందు చూపుతోనే.. హాయిగా 'విశ్రాంతి'!



- రిటైర్మెంట్ జీవనం పెద్ద టాస్క్...
- ఆర్జన లేకుండా జీవించాల్సి ఉంటుంది
- ముందు నుంచే తగిన ఏర్పాట్లు కావాలి
- ప్రతి నెలా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి
- ద్రవ్యోల్బణ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలి
- ముందే మొదలు పెడితే కాంపౌండింగ్ పవర్
- ఆలస్యం చేసిన కొద్దీ మరింత భారం
- అన్నింటికంటే ఈక్విటీలే మెరుగైనవి

"వాతావరణంలో మార్పులు మానవాళిని అంతం చేయకపోతే.. ఇప్పటి నుంచి వచ్చే 25 ఏళ్లలో చాలా దేశాలకు రిటైర్మెంట్ సంక్షోభం పెద్ద సమస్యగా మారుతుంది. గత తరాలకు దీర్ఘకాలం పాటు రియల్ ఎస్టేట్, ఈక్విటీ బుల్ మార్కెట్లు రిటైర్మెంట్ నిధి సమకూర్చుకోవడానికి సాయపడ్డాయి. కానీ, భవిష్యత్తులో ఇలా ఉండకపోవచ్చు". ప్రముఖ బ్రోకరేజీ సంస్థ జీరోధా వ్యవస్థాపకుల్లో ఒకరైన నితిన్ కామత్ నేటి యువతరాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇవి. సాంకేతిక పురోగతితో పదవీ విరమణ కాలం తగ్గిపోతుంటే, వైద్య రంగంలో పురోగతితో జీవించే కాలం పెరుగుతుందని అంచనా వేశారు. వచ్చే 20 ఏళ్లకు పదవీ విరమణ వయసు 50కు తగ్గి.. 80 ఏళ్ల వరకు జీవిస్తామని.. రిటైర్మెంట్ తర్వాత కూడా 30 ఏళ్ల పాటు జీవించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. జీవితంలో పదవీ విరమణ తర్వాత దశను సరైన ప్రణాళికతోనే సుఖవంతం చేసుకోగలరంటూ కామత్ ఇచ్చిన సూచనలు ప్రతి ఒక్కరికీ మేల్కొలుపు. వయసు సహకరించి పనిచేస్తున్న దశలోనే.. పనిచేయని దశ కోసం ప్రణాళిక వేసుకోకపోతే వృద్ధాప్యంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తమ పిల్లలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తాము పిల్లలకు భారం కాకూడదనే ఎవరైనా కోరుకుంటారు. అలా కోరుకునే వారు ఆ దిశగా ముందు నుంచే అడుగులు వేసుకుంటూ వెళ్లాలి. మరి రిటైర్మెంట్ తర్వాత జీవితానికి ఎంత కావాలి? అందుకు ఎంత పెట్టుబడులు పెట్టాలి..? ఈ అంశాలపై అవగాహన కల్పించే కథనం ఇది.



అవసరాల్లో రాజీ పడలేం



మనలో ఒక్కొక్కరు ఒక్కో జీవిత దశలో ఉండొచ్చు. కొందరు ఇప్పుడే ఉద్యోగం ఆరంభిస్తే, మరికొందరు ఇప్పటికే కొన్నేళ్ల ఉద్యోగ కాలాన్ని పూర్తి చేసుకుని ఉండొచ్చు. సంపాదించే వయసులో మన అవసరాలు ఏదో రకంగా తీరిపోతుంటాయి. ఒక విధమైన జీవనశైలికి అలవాటు పడి ఉంటాం. కోరుకున్న మాదిరి జీవితాన్ని కొనసాగిస్తాం. రిటైర్మెంట్ తర్వాత కూడా ఇదే మాదిరి జీవితాన్ని సాఫీగా కొనసాగించడమే అసలైన సవాలు. ఇందుకోసం ఇప్పుడు నెలవారీ జీవనానికి ఎంత అయితే ఖర్చు చేస్తున్నామో.. పదవీ విరమరణ అనంతరం కూడా ప్రతి నెలా అంతే మొత్తం ఖర్చు చేసేందుకు సరిపడా పొదుపు చేసుకోవాలి.

ముందుగా మొదలు పెడితే ఈజీ

25 ఏళ్లకు కెరీర్ మొదలు పెట్టారని అనుకుంటే, 55–60 ఏళ్లకు రిటైర్ అవుతారని అనుకుంటే ఇన్వెస్ట్ చేయడానికి 30–35 ఏళ్ల కాలం మిగిలి ఉంటుంది. కనుక నెలకు రూ.10వేల చొప్పున, ఏటేటా దీనిపై 10 శాతం చొప్పున పెట్టుబడిని పెంచుతూ వెళితే 30 ఏళ్లకే రూ.6.91 కోట్లు (ఏటా 11 శాతం కాంపౌండెడ్ వృద్ధి అంచనా ప్రకారం) సమకూరుతుంది. అందుకే విశ్రాంత జీవన నిధి కోసం పెట్టుబడికి కెరీర్ ఆరంభంలోనే శ్రీకారం చుట్టాలి. దానివల్ల ఓ పెద్ద లక్ష్యం తేలిక అవుతుంది. 25 ఏళ్లలో రూ.7 కోట్లు సమకూరేందుకు ప్రతి నెలా రూ.20వేల చొప్పున ఇన్వెస్ట్ చేయాల్సి (ఏటాటా 10 శాతం పెంచుతూ) ఉంటే, 30 ఏళ్ల సమయం ఉన్న వారు ఇందులో సగం రూ.10వేలు ఇన్వెస్ట్ చేస్తే సరిపోతుంది. ఇంకా 35 ఏళ్ల వ్యవధి ఉంటే ఇంకా తక్కువే ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అందుకే ఈ కాంపౌండింగ్ మహిమను ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిందే.

నిపుణుల సాయం అవసరమే

రిటైర్మెంట్ అవసరాలన్నవి ప్రత్యేకమైనవి. ఇక్కడి నుంచి మరో 25–35 ఏళ్ల తర్వాతి జీవనం కోసం నిధిని సమకూర్చుకోవాలి. అలా ఏర్పడే నిధి అక్కడి నుంచి మరో 20–30 ఏళ్ల పాటు మన జీవితానికి ఆధారంగా నిలబడాలి. కనుక ప్రతి నెలా ఆర్జన ఎంత? పదవీ విరమణకు ఉన్న కాలం ఎంత? ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా? పెట్టుబడుల పరంగా రిస్క్ తీసుకోగలరా? ఆశిస్తున్న రాబడులు ఏ మేరకు? ఇలా ఎన్నో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వీటి తర్వాత ప్రతి నెలా ఎంత చొప్పున ఇన్వెస్ట్ చేయాలో అంచనాకు రావాలి. ఆశిస్తున్న రాబడులకు తగిన సాధనాలను ఎంపిక చేసుకోవాలి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అయితే, అందులోనూ ఎన్నో విభాగాలున్నాయి. వాటిల్లో రాబడులు, రిస్క్ వేర్వేరుగా ఉంటుంది. పైగా రిటైర్మెంట్ ఒక్కటే కాదు, జీవిత బీమా, ఆరోగ్య బీమా కూడా కీలకమే. అందుకే కెరీర్ ఆరంభించిన వారు పర్సనల్ ఫైనాన్స్ నిపుణులు, లేదా ఫైనాన్షియల్ ప్లానర్ సాయంతో పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవడం ఎంతైనా అవసరం

ఇప్పుడు ప్రతి నెలా కుటుంబ అవసరాల కోసం నికరంగా రూ.50,000 ఖర్చు అవుతుందని అనుకుందాం. ఇప్పటి నుంచి పదవీ విరమణకు మరో 25 ఏళ్ల కాలం మిగిలి ఉంది. రిటైర్మెంట్ తర్వాత కనీసం 20 ఏళ్ల పాటు జీవించి ఉంటామని అంచనా వేసుకునేట్టు అయితే.. ఆ 20 ఏళ్ల కాలానికి కూడా ప్రతి నెలా రూ.50,000 కావాల్సి ఉంటుంది. అంటే ఏడాదికి రూ.6 లక్షలు అవసరపడతాయి. రిటైర్మెంట్ విషయంలో కొందరికి భిన్నమైన అంచనాలు ఉండొచ్చు. కొందరు ఇప్పటికంటే వృద్ధాప్యంలో ఇంకా మెరుగ్గా జీవించాలని కోరుకోవచ్చు. అటువంటి వారి విషయంలో ఈ అంచనాలు మారిపోతాయి. కనుక అందరికీ అర్థమయ్యేందుకే దీన్ని ఓ ప్రామాణిక ఉదాహరణగా చెప్పుకుంటున్నాం. విశ్రాంత జీవితానికి సంబంధించి ప్రణాళికలో ముందు రెండు అంశాలపై స్పష్టత తెచ్చుకోవాలి. 1. ఇప్పటి నెలవారీ అవపసరాల ఆధారంగా రిటైర్మెంట్ నాటికి ఎంత నిధి సమకూర్చుకోవాలి. ఇప్పుడు నెలకు రూ.50,000 ఖర్చు అవుతోంది. అంటే ఏడాదికి రూ.6 లక్షలు. పదవీ విరమణ తర్వాత కూడా ఏటా రూ.6 లక్షలు ఆదాయాన్ని ఇచ్చేంత నిధిని సమకూర్చుకోవాలి. 2. ఇంత మేర

ఎంత కావాలి?

నిధి పోగు చేసుకునేందుకు ఇప్పటి నుంచి ప్రతి నెలా ఎంత మేర ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాలన్నది మరో ముఖ్యమైన విషయం.

•••

రిటైర్మెంట్ తర్వాత 20 ఏళ్ల పాటు జీవించి ఉంటామనే అంచనా ప్రకారం.. ఏటా రూ.6 లక్షల చొప్పున 20 ఏళ్ల కోసం మొత్తం రూ.1.2 కోట్లు కావాల్సి ఉంటుంది. 2047 నాటికి ఈ మేరకు నిధి మనకు కావాలి. కానీ, రూ.50,000 అన్నది నేటి కరెన్సీ విలువ ప్రకారం జీవనానికి అవుతున్న వ్యయం. ద్రవ్యోల్బణం ప్రభావంతో ఏటేటా కరెన్సీ విలువ తగ్గుతూ, జీవన వ్యయం పెరుగుతూ ఉంటుంది. కనుక ఈ నిధికి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని కూడా జోడించాలి. దీర్ఘకాలంలో సగటున 5 శాతం వార్షిక ద్రవ్యోల్బణం ఉంటుందని అంచనా వేసుకుంటే.. 20 ఏళ్ల తర్వాత రూ.6 లక్షలు ఏమూలకూ సరిపోవు. ఇప్పటి నుంచి 25 ఏళ్ల పాటు రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకుంటాం కనుక అన్నేళ్ల కాలానికి ఏటా 5 శాతం ద్రవ్యోల్బణ ప్రభావాన్ని కలిపి చూస్తే.. ఇప్పుడు ఏడాది జీవనానికి రూ.6 లక్షలు అవుతుంటే, 2047లో ఇది రూ.2,031,813 అవుతుంది. అంటే అప్పుడు ఒక ఏడాది జీవనానికి రూ.20.31 లక్షలు కావాలి. అంతేకాదు, అప్పటి నుంచి ఏటేటా ఇది మరో 5 శాతం (ద్రవ్యోల్బణం మేర) పెరుగుతుందని భావించొచ్చు. ఈ ప్రకారం 2048లో రూ.21.33 లక్షలు కావాలి. 2067వ సంవత్సరంలో జీవన వ్యయం రూ.రూ.53.91 లక్షలుగా ఉంటుంది. ఇక 2047 నుంచి 2067 సంవత్సరం వరకు, 20 ఏళ్ల కాలానికి జీవన వ్యయం కోసం (5 శాతం ద్రవ్యోల్బణం కలిపి) మొత్తం రూ.7.25 కోట్లు కావాల్సి వస్తుంది. అంటే మన చేతిలో సంపాదన కోసం మిగిలిన ఈ 25 ఏళ్లలో.. విశ్రాంత జీవనం కోసం రూ7.25 కోట్ల నిధిని సమకూర్చుకోవాలన్నది అంచనా.

అంచనా మాత్రమే..

పదవీ విరమణ తర్వాత వృద్ధాప్యంలో మన జీవన అవసరాలు ఇప్పటి మాదిరిగా ఉండవు. కొంత మారొచ్చు. ఖరీదైన డెనిమ్ వస్త్రాలు అవసరపడకపోవచ్చు. వినోదం, విహారం కోసం ఖర్చు పెరగొచ్చు. ఎందుకంటే అప్పుడు చేతిలో తగినంత ఖాళీ సమయం ఉంటుంది. అందుకని అప్పటి అవసరాలు ఎలా ఉంటాయని ఇప్పుడే అంచనాకు రాలేం. ఆరోగ్య సమస్యల కారణంగా తరచూ వైద్యం అవసరపడొచ్చు. అందుకే ఇప్పుడు నెలవారీ అవుతున్న వ్యయాన్ని ఓ ప్రామాణికంగా తీసుకున్నాం అంతే. రిటైర్మెంట్ తర్వాత ఫలానా విధంగా జీవితాన్ని కొనసాగించాలనే కచ్చితమైన స్పష్టత, ప్రణాళిక ఉన్న వారు ఆ మేరకు అంచనాకు వచ్చి నిధిని సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

నిధిని ఎలా సమకూర్చుకోవాలి?

రిటైర్మెంట్ తర్వాత 20 ఏళ్ల జీవిత అవసరాలకు కావాల్సిన రూ.7.25 కోట్లు సమకూర్చుకోవడం ఎలా..? ఇందుకోసం ఈ రోజు నుంచే పెట్టుబడులు ఆరంభించాలి. ఒకటికి మించిన సాధనాలను ఇందుకోసం ఎంపిక చేసుకోవచ్చు. 50 శాతం రియల్ ఎస్టేట్‌పై, 10 శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్లలో, బంగారంలో 10 శాతం, ఈక్విటీల్లో 15 శాతం చొప్పున పెట్టుబడులు పెడుతూ, 15 శాతం నగదుగా ఉంచుకునేట్టు (ఇది అధిక నికర విలువ కలిగిన వ్యక్తుల పోర్ట్‌ఫోలియో విధానం) అయితే.. రాబడి ఏ మేరకు వస్తుందో చూద్దాం. రియల్ ఎస్టేట్‌పై దీర్ఘకాలంలో 8–10 శాతం, ఎఫ్‌డీలపై 6–7 శాతం, బంగారంపై 8–9 శాతం, ఈక్విటీల్లో 10–11 శాతం వస్తుందని అనుకుంటే.. అప్పుడు మొత్తం మీద అన్ని రకాల పెట్టుబడులపై సగటున 8.25 శాతం వార్షిక రాబడి వస్తుంది. ఇది కొంత రక్షణాత్మకంగా వేసిన అంచనాయే. ఈక్విటీల్లో 10 ఏళ్లకు మించిన కాలంలో రిస్క్ దాదాపు ఉండదు. సగటు రాబడి ఎంత లేదన్నా వార్షికంగా 11 శాతం చొప్పున వస్తుంది. కనుక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మార్గంలో రిటైర్మెంట్ కార్పస్‌ను సమకూర్చుకోవడం రిటైల్ ఇన్వెస్టర్లకు అన్నింటిలోకి మెరుగైన మార్గం అవుతుంది.

•••



నెలవారీగా సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఏటేటా పెరిగే ఆదాయానికి అనుగుణంగా ఈ పెట్టుబడి మొత్తాన్ని 10 శాతం పెంచుకుంటూ వెళ్లాలి. ఉదాహరణకు మొదటి నెల రూ.5,000 ఇన్వెస్ట్ చేసినట్టయితే.. ఏటా 11 శాతం చొప్పున కాంపౌండెడ్ వృద్ధి ప్రకారం 25 ఏళ్ల తర్వాత (300 నెలలకు) ఈ మొత్తం రూ.67,927 అవుతుంది. రెండో ఏడాది 10 శాతం అధికంగా రూ.5,500, మూడో ఏట రూ.6,050 చొప్పున ఇన్వెస్ట్ చేయాలి. ఇలా అయితే 25 ఏళ్లకు సమకూరే నిధి రూ.1.7 కోట్లుగా ఉంటుంది. కానీ, మనం చెప్పుకున్న ఉదాహరణ ఆధారంగా రిటైర్మెంట్ కోసం రూ.7.25 కోట్లు కావాలి. అందుకని ప్రతి నెలా రూ.5 వేలకు బదులు.. రూ.20 వేల చొప్పున ఆరంభించి, ఏటా 10 శాతం పెంచుకుంటూ వెళ్లాలి. దీంతో 25 ఏళ్లకు రూ.7 కోట్ల నిధి ఏర్పడుతుంది.



టిప్స్



- చాలా ముందుగానే పెట్టుబడులు ఆరంభించాలి.
- పెట్టుబడి సాధనాల మధ్య వైవిధ్యం ఉండాలి.
- అన్నింటిలోకీ ఈక్విటీలు దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు ఇస్తాయి.
- అవసరం లేనివి, విలువ తరిగిపోయే వాటిని రుణాలపై కొనుగోలు చేయవద్దు.
- ఆర్జించే వ్యక్తి తనతోపాటు, కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ రక్షణనిచ్చే ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవాలి. లేకపోతే ఒక ఆరోగ్య సమస్య కారణంగా ఆర్థిక జీవితం తలకిందులు అయిపోవచ్చు.
- ఉద్యోగం శాశ్వతం కాదు. కనుక పనిచేసే చోట ఆరోగ్య బీమా రక్షణ ఉన్నా కానీ, విడిగా ఆరోగ్య బీమా ప్లాన్ కూడా ఉండాలి.
- టర్మ్ ఇన్సూరెన్స్ అవసరం. అనుకోనిది జరిగితే వచ్చే బీమా పరిహారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేస్తే, నెలవారీ కుటుంబ అవసరాలను తీర్చేంత సరిపడా ఆదాయం ఆ నిధి నుంచి రావాలి.

– నితిన్ కామత్, జీరోధా సీఈవో

భైద్యనాథ్ నుంచి మధుమేహారి ఔషధం

హైదరాబాద్: మధుమేహం నియంత్రణే లక్ష్యంగా ప్రముఖ ఆయుర్వేదిక్ సంస్థ.. బైద్యనాథ్ అత్యంత శాస్త్రీయ, పరిశోధనలతో 'మధుమేహరి' పేరుతో ఔషధాన్ని రూపొందించింది. మధుమేహారీ యోగ్ ట్యాబ్లెట్‌తో పాటు భోజనానికి ముందు ఈ ఔషధాన్ని ఒక టీ స్పూను నీటిలో కలపి రోజుకు రెండు సార్లు సేవించడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని ఒక ప్రకటనలో పేర్కొంది. కాలపరీక్షలకు నిలబడిన సుద్ధ శిలాజిత్, త్రివంగ భస్మలతో ఈ గ్రాన్యుల్స్‌ను అభివృద్ధి చేసినట్లు కూడా ప్రకటనలో సంస్థ తెలిపింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

14-11-2022	
విశాఖ	515-00
చిత్తూరు	548-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	514-00
విజయవాడ	514-00
రిటైల్ ధర (డజను)	78.00
13-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	497-00
వరంగల్	499-00
రిటైల్ ధర	5.60

మూలధన నష్టాలను, లాభాలతో సర్దుబాటు చేసుకోవచ్చా?

ఫ్రాంక్లిన్ ఇండియా ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్‌లో పెట్టుబడులపై దీర్ఘకాల మూలధన లాభాలు వచ్చాయి. నాస్‌డాక్ 100 ఈటీఎఫ్ (పన్ను పరంగా డెట్ ఫండ్) పెట్టుబడులపై నష్టాలు వచ్చాయి. ఈ నష్టాన్ని లాభంలో సర్దుబాటు చేసి, మిగిలిన లాభంపైనే ఆదాయపన్ను చెల్లిస్తే సరిపోతుందా?

– సంజయ్ కుమార్



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

లాభాల్లో నష్టాలను సర్దుబాటు చేసుకోవడాన్ని 'సెట్టింగ్ ఆఫ్ లాసెస్'గా పేర్కొంటారు. ఒక సాధనంలో మూలధన నష్టాన్ని, మరో సాధనంలో మూలధన లాభంతో సర్దుబాటు చేసుకోవడాన్ని ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 70 అనుమతిస్తోంది. కాకపోతే ఇందుకు సంబంధించి కొన్ని షరతులను తెలుసుకోవాలి. స్వల్పకాల మూలధన నష్టాలను.. స్వల్ప కాల మూలధన లాభాలతోనూ, అలాగే దీర్ఘకాలిక మూలధన లాభాలతోనూ సర్దుబాటు చేసుకోవచ్చు. కానీ, దీర్ఘకాల మూలధన నష్టాల విషయంలో కొంత వ్యత్యాసం ఉంది. కేవలం దీర్ఘకాల మూలధన లాభాలతోనే వీటిని సర్దుబాటు చేసుకోవడానికి ఉంటుంది. పెట్టుబడుల కాల వ్యవధి ఆధారంగా లాభాలు స్వల్పకాలం లేదా దీర్ఘకాలం కిందకు వస్తాయి. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అయితే ఏడాది వరకు (ఏడాది నిండకుండా) లాభాలు స్వల్పకాలంగా, ఏడాదికి మించితే దీర్ఘకాలంగా చట్టం పరిగణిస్తోంది. ఈక్విటీయేతర మ్యూచువల్ ఫండ్స్‌లో మూడేళ్ల వరకు లాభాలు స్వల్పకాలంగాను, మూడేళ్లు, అంతకు మించిన కాలానికి వచ్చేవి దీర్ఘకాల మూలధన లాభాలుగా పరిగణిస్తారు.

ఉదాహరణకు మీరు ఈ ఏడాది రెండు రకాల దీర్ఘకాల పెట్టుబడులు విక్రయించారని అనుకుందాం. ఒకటి ఈక్విటీ, రెండోది ఈక్విటీయేతర ఫండ్. ఈక్విటీ ఫండ్‌లో రూ.లక్ష దీర్ఘకాల మూలధన నష్టం చ్చింది. నాన్ ఈక్విటీ ఫండ్‌లో రూ.4 లక్షల దీర్ఘకాల లాభం వచ్చింది. అప్పుడు దీర్ఘకాల మూలధన లాభం రూ.4 లక్షల నుంచి దీర్ఘకాల మూలధన నష్టం రూ.లక్ష మినహాయించి, మిగిలిన రూ.3 లక్షలపైనే పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఎందుకంటే ఈ రెండూ దీర్ఘకాలిక సాధనాలే. మూలధన నష్టాలను సర్దుబాటు చేసుకునే అవకాశం లేనప్పుడు వాటిని ఎనిమిది సంవత్సరాల పాటు క్యారీ ఫార్వార్డ్ (కొనసాగించుకోవడం) చేసుకోవచ్చు. అంటే ఈ ఏడాది వచ్చిన నష్టాన్ని.. భవిష్యత్ 8 సంవత్సరాల లాభాల్లో అయినా చూపించుకోవచ్చు.

దీర్ఘకాల పెట్టుబడులకు స్మాల్ క్యాప్‌ఫండ్స్ మంచివేనా?

– వర్షిల్ గుప్తా

స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు కేవలం దీర్ఘకాలం ఒక్కటే చాలదు. ఫండ్‌లో నష్టాలు వచ్చినా, పెట్టుబడుల విలువ క్షీణించినా తట్టుకుని పెట్టుబడులు కొనసాగించే సామర్థ్యం కూడా ఉండాలి. దీర్ఘకాలంలో స్మాల్‌క్యాప్ ఫండ్స్‌ను సంపద సృష్టి మార్గంగా చూడొచ్చు. కానీ, స్మాల్ క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయడం అంత సులభం కాదు. మార్కెట్ పతనాల్లో ఇవి అదే పనిగా క్షీణిస్తూ, నష్టాలను చూపిస్తుంటాయి. మార్కెట్లో ఇతర విభాగాలు మంచి రాబడులు ఇస్తున్నప్పుడు.. అదే సమయంలో రాబడులు చూపించని స్మాల్‌క్యాప్ మాదిరి సాధనాల్లో పెట్టుబడులు పెడితే ఆందోళన చెందడం సహజం. అందుకనే స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు, మొత్తం పెట్టుబడుల్లో 10–15 శాతం మించి కేటాయింపులు చేసుకోరాదు. ఓ చిన్న కంపెనీ, పెద్ద కంపెనీగా మారిన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి సందర్భాల్లోనే సంపద సృష్టి జరుగుతుంది. అదే సమయంలో సంపదను తుడిచి పెట్టే కంపెనీలు కూడా ఉంటాయి. చిన్న కంపెనీలు ఆటుపోట్లకు ఎక్కువగా గురవుతుంటాయి.

స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో ఉన్న అనుకూలతలను చూస్తే.. దీర్ఘకాలంలో ఇవి పెట్టుబడులపై రాబడులు కురిపిస్తాయి. లార్జ్‌క్యాప్ స్టాక్స్ పెరగని సందర్భాల్లోనూ ఇవి వృద్ధిని చూపించగలవు. చిన్న కంపెనీలను ఇనిస్టిట్యూషన్స్ పెద్దగా పట్టించుకోవు. కనుక తెలివైన ఇన్వెస్టర్లు ఇక్కడ పెట్టుబడులు పెట్టడం ద్వారా వృద్ధి చేసుకోవచ్చు. స్మాల్ క్యాప్ విభాగం చాలా పెద్దది. ప్రతీ స్మాల్‌క్యాప్ పథకం కూడా భిన్నమైనది. భిన్నమైన పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంటాయి. కనుక వీటి మధ్య సారూప్యత ఉండదు. సిప్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తూ రిస్క్ తగ్గించుకోవచ్చు. అయితే, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో లిక్విడిటీ అన్నది పెద్ద సవాలు. ఒకేసారి అమ్మకాల ఒత్తిడి వస్తే విలువ గణనీయంగా తగ్గిపోతుంది. కొనేవారు కరువై లిక్విడిటీ సమస్య ఏర్పడవచ్చు. పైగా, స్మాల్‌క్యాప్ పథకాలు పెద్ద సైజుతో ఉంటే ప్రతికూలతే. అంటే ఒక స్మాల్‌క్యాప్ ఫండ్ నిర్వహణ ఆస్తులు రూ.2,000 కోట్లు, అంతకంటే తక్కువే ఉండడం అనుకూలం. మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్‌తో పోలిస్తే వీటిల్లో అస్థిరతలు ఎక్కువ. మార్కెట్లలో సెంటిమెంట్ మారిపోతే ఇవి ఎక్కువ నష్టపోతుంటాయి. ఏ సమయంలో స్మాల్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేశారన్నది (లంప్‌సమ్/ఏకమొత్తంలో) రాబడులను నిర్ణయిస్తుంది.

సెంబ్‌కార్ప్ చేతికి వెక్టార్ గ్రీన్ ఎనర్జీ

రూ. 2,780 కోట్ల ఒప్పందం • 2023 తొలి త్రైమాసికంలో డీల్ పూర్తి

న్యూఢిల్లీ: సింగపూర్ లిస్టెడ్ కంపెనీ సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ తాజాగా వెక్టర్ గ్రీన్ ఎనర్జీని కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రూ. 2,780 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపింది. దీనితో సెంబ్‌కార్ప్ భారత్‌లో పునరుత్పాదక విద్యుత్ విభాగంలో తమ సామర్థ్యాలను 3 గిగావాట్లకు (జీడబ్ల్యూ) పెంచుకోనుంది. భారత్‌లో రెన్యువబుల్స్ పోర్ట్‌ఫోలియోను పెంచుకోవడానికి కట్టుబడి ఉన్నామని సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్ వాంగ్ కిమ్ ఇన్ తెలిపారు. తమ భారత విభాగంలో పవన విద్యుదుత్పత్తికి అనుబంధంగా సౌర విద్యుదుత్పత్తి వాటాను గణనీయంగా పెంచుకునేందుకు ఈ డీల్ ఉపయోగపడగలదని సంస్థ సీఈవో (దక్షిణాసియా) విపుల్ తులి తెలిపారు. వెక్టార్ గ్రీన్‌తో కలిపితే స్థూలంగా సెంబ్‌కార్ప్ రెన్యువబుల్స్ పోర్ట్‌ఫోలియోలో 1 గిగావాట్ సోలార్ అసెట్లు, 2 గిగావాట్ల పవన విద్యుత్ అసెట్లు (ఇప్పటికే ఇన్‌స్టాల్ అయినవి, అభివృద్ధి చేస్తున్న వాటితో కలిపి) ఉంటాయని ఆయన వివరించారు. 2023 తొలి త్రైమాసికంలో ఈ డీల్ పూర్తి కాగలదని అంచనా. గ్రూప్ స్థాయిలో సెంబ్‌కార్ప్ స్థూల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యం 8.5 గిగావాట్లకు చేరనుంది. 2025 నాటికల్లా దీన్ని 10 గిగావాట్లకు పెంచుకోవాలని సంస్థ నిర్దేశించుకుంది.

13 రాష్ట్రాల్లో వెక్టార్ గ్రీన్

గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్ట్‌నర్స్ ఇండియా నిర్వహణలోని ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ 2 ఆధ్వర్యంలో వెక్టార్ గ్రీన్ ఎనర్జీ స్వతంత్ర విద్యుదుత్పత్తి సంస్థగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ప్రస్తుతం 13 రాష్ట్రాల్లో 519 మెగావాట్ల సామర్థ్యంతో కార్యకలాపాలు ఉన్నాయి. 64 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. అలాగే మరో 1 గిగావాట్ల సామర్థ్యానికి సంబంధించి పెట్టుబడులతో సిద్ధంగా ఉంది. టోరెంట్ పవర్ కూడా వెక్టార్ గ్రీన్ ఎనర్జీ కోసం పోటీపడినప్పటికీ అంతిమంగా సెంబ్‌కార్ప్ దక్కించుకుంది.



క్లుప్తంగా

రవిశంకర్‌కు గాంధీ పీస్ పిలిగ్రిమ్ అవార్డు



సాక్షి, అమరావతి: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవిశంకర్ ప్రతిష్టాత్మక గాంధీ పీస్ పిలిగ్రిమ్ అవార్డును అందుకొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ప్రవచించిన అహింస, శాంతి సందేశాన్ని వ్యాపింపజేస్తున్న రవిశంకర్ కృషికి గాను అమెరికాలోని గాంధీ ఫౌండేషన్ అట్లాంటాలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ మేనల్లుడు ఇసాక్ ఫారిస్, అట్లాంటాలోని భారత కాన్సుల్ జనరల్ డాక్టర్ స్వాతి కులకర్ణి సమక్షంలో అవార్డును రవిశంకర్ అందుకున్నారు.

నేడు ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు కౌన్సెలింగ్

నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 14న మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 4 ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన 204 సీట్లకు, ఎన్‌సీసీకి సంబంధించి 40 సీట్లకు కౌన్సెలింగ్‌ను నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్నామన్నారు.

'పిల్లలు అద్భుతంగా ఎదిగే అవకాశం కల్పించాలి'

పెదకాకాని: విద్యార్థుల్లో సృజన, నైపుణ్యం, భాషా పరిజ్ఞానం పెంపొందించేందుకు బాలోత్సవ్ పోటీలు దోహదపడతాయని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులోని వీవీఐటీలో నిర్వహిస్తున్న బాలోత్సవ్-2022కు రెండో రోజు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పిల్లలు గొప్పగా, అద్భుతంగా ఎదిగే అవకాశం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కల్పించాలన్నారు. పిల్లలకు ఏది ఇష్టమో తెలుసుకుని వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం రెండో రోజు విజేతలకు సరిఫికెట్లు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా

స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే

- వలంటీర్ల ద్వారా నిరుద్యోగ యువత గుర్తింపు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక యాప్‌లో నమోదు
- అభ్యర్థులకు ఆసక్తిగల కోర్సుల్లో స్కిల్ హబ్స్‌లో శిక్షణ
- నైపుణ్య శిక్షణకు ఇప్పటివరకు నమోదైనవారి సంఖ్య 27,655





జిల్లాల వారీగా స్కిల్ హబ్స్ అప్లికేషన్‌లో నమోదు చేసిన అభ్యర్థుల సంఖ్య ఇలా ఉంది

జిల్లా	నమోదైన అభ్యర్థులు		
		ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు	456
		అన్నమయ్య	403
ప్రకాశం	13,056	కాకినాడ	358
కృష్ణా	2,097	చిత్తూరు	354
విజయనగరం	1,394	అనకాపల్లి	348
తూర్పుగోదావరి	1,111	గుంటూరు	346
కర్నూలు	975	శ్రీసత్యసాయి	344
నంద్యాల	790	అనంతపురం	333
శ్రీకాకుళం	777	అల్లూరి సీతారామరాజు	328
పార్వతీపురం మన్యం	733	పల్నాడు	310
ఏలూరు	625	బాపట్ల	308
విశాఖపట్నం	559	ఎన్టీఆర్	236
వైఎస్సార్	511	పశ్చిమగోదావరి	221
తిరుపతి	471	డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	211

సాక్షి, అమరావతి: నిరుద్యోగ యువతకు ఆసక్తిగల కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే నిర్వహిస్తోంది. వలంటీర్లు ఇంటింటి సర్వేచేసి నిరుద్యోగ యువత పేర్లను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. అభ్యర్థికి ఆసక్తిగల కోర్సు, ఏ ప్రాంతంలోని స్కిల్ హబ్‌లో శిక్షణ పొందాలనుకుంటున్నారో కూడా నమోదు చేస్తున్నారు. ఈ డేటా ఆధారంగా అభ్యర్థుల వివరాలు అందుబాటులో ఉండటంతోపాటు అవసరమైనచోట వారి సేవలను వినియోగించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 27,655 మంది పేర్లను స్కిల్ హబ్స్ అప్లికేషన్‌లో నమోదు చేశారు. అత్యధికంగా ప్రకాశం జిల్లాలో 13,056 మంది అభ్యర్థుల పేర్లు స్కిల్ హబ్స్ అప్లికేషన్‌లో నమోదయ్యాయి. ఈ సర్వేకి సంబంధించి విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు సూచించింది. స్కిల్ డెవలప్‌మెంట్ సర్వే పురోగతిని ప్రతి గురువారం కలెక్టర్లతో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ సమీర్‌శర్మ సమీక్షిస్తున్నారు. వీలైనంత త్వరగా ఈ సర్వే పూర్తిచేయించాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

19 నుంచి జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- మంత్రి ఆర్కే రోజా వెల్లడి

తిరుపతి అర్బన్: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి వారితో జగనన్న స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు జరపబోతున్నట్లు మంత్రి ఆర్కే రోజా చెప్పారు. సంబరాల్లో భాగంగా క్రీడల పోటీలను జోనల్, రాష్ట్ర స్థాయిల్లో జరపబోతున్నట్లు చెప్పారు. తిరుపతిలోని ఓ హోటల్‌లో ఆదివారం ఆమె సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. తిరుపతి జోన్ కళాకారులకు మహతి కళాక్షేత్రంలో నవంబర్ 19, 20, 21 తేదీల్లో, గుంటూరు జోన్ వారికి 24, 25, 26 తేదీల్లో శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో, రాజమండ్రి జోన్ వారికి 29, 30, డిసెంబర్ 1 తేదీల్లో శ్రీవేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విశాఖ జోన్ వారికి డిసెంబర్ 7,8,9 తేదీల్లో ఉడా చిల్డ్రన్స్ థియేటర్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్ 19, 20 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తామని తెలిపారు. కూచిపూడి, ఆంధ్ర నాట్యం, భరత నాట్యం, జానపద కళారూపాలు తదితర కళా రంగాల్లో జోనల్, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు నిర్వహిస్తామని, ప్రతి విభాగంలో జోనల్ స్థాయి విజేతల గ్రూప్‌నకు రూ.25 వేలు, సోలోకి రూ.10 వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు గ్రూప్‌నకు రూ.లక్ష, సోలోకి రూ.50 వేలను సీఎం జన్మదినం రోజున అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు https://culture.ap.gov.in/ వెబ్‌సైట్‌లో పేర్లను ఈ నెల 15 లోపు నమోదు చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి 15వ అంతర్జాతీయ

బాలల చలన చిత్రోత్సవం

- తెనాలిలో పది రోజులు వివిధ దేశాల బాలల సినిమాల ప్రదర్శన
- హాజరుకానున్న బాలనటులు, దర్శకులు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 14వ తేదీ నుంచి 15వ అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం నిర్వహించనున్నట్లు చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ-తెనాలి అధ్యక్షుడు డాక్టర్ రావిపాటి వీరనారాయణ, కార్యదర్శి బొల్లిముంత కృష్ణ తెలిపారు. స్థానిక వివేక పబ్లిక్ స్కూలులో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో తెనాలి మున్సిపాలిటీ, వివేక విద్యాసంస్థల సౌజన్యంతో పది రోజులపాటు ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పది రోజులు వివిధ దేశాల బాలల సినిమాలను ప్రదర్శిస్తామన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు బాలల చిత్రోత్సవం ప్రారంభమవుతుందని, అనంతరం 11 గంటలకు చైనా చిత్రం 'లిటిల్ బిగ్ సోల్జర్', ఒంటి గంటకు దక్షిణ కొరియా చిత్రం 'డాగ్స్', మధ్యాహ్నం 3 గంటలకు హిందీ సినిమా 'హమ్ ఔర్ ఆప్' ప్రదర్శిస్తామని తెలిపారు. రెండో రోజు మంగళవారం బుర్రిపాలెంరోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూలులో ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. పట్టణంలోని మున్సిపల్, సమీప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థుల కోసం వారి స్కూళ్లలోనే చిత్రాలను ప్రదర్శిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఏ పాఠశాల నుంచి అయినా ఆహ్వానం వస్తే, అక్కడకి వెళ్లి ఉచితంగా బాలల చిత్రాలను ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఆసక్తిగల ఉన్నత పాఠశాలల యాజమాన్యాలు 9959431235 నంబరులో సంప్రదించాలని కోరారు.

అవినీతిపై ఉక్కుపాదం

- 11 నెలల్లో 17 మంది ఎస్సైలు, సీఐలు సస్పెన్షన్
- 'సాక్షి' ప్రతినిధితో ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు



సాక్షిప్రతినిధి, ఏలూరు: పోలీస్ శాఖలో అవినీతిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు.. స్టేషన్‌కు వచ్చే వంద మంది బాధితుల్లో 85 మంది పేదవాళ్ళే.. వారికి న్యాయం పక్కాగా అందించాల్సిన బాధ్యత పోలీసులదే.. పోలీస్ శాఖలో అవినీతి పూర్తిగా తగ్గాలి.. శాఖాపరమైన అవినీతిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఊపేక్షించం.. అని ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు స్పష్టం చేశారు. 'సాక్షి ప్రతినిధి'తో ప్రత్యేకంగా పలు అంశాలపై మాట్లాడారు.

17 మంది సస్పెండ్

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు రేంజ్ పరిధిలో 17 మంది ఎస్సైలు, సీఐలను సస్పెండ్ చేశాం. అవినీతి ఆరోపణలు, ఇతర ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. కొందరిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశాం. అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు నూరు శాతం సేవలందించాల్సిందే. దీనిలో రాజీపడే ప్రసక్తే లేదు. రేంజ్ పరిధిలో ప్రస్తుతం 9 మందిపై శాఖాపరమైన విచారణ జరుగుతుంది. విచారణ పూర్తయి నివేదిక వచ్చిన తర్వాత చర్యలు ఉంటాయి. పనితీరులో అలసత్వం ప్రదర్శించినా, నిర్లక్ష్యం చూపినా చార్జీమెమో ఇస్తున్నాం. శాఖాపరమైన విచారణ ప్రక్రియ రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా క్షుణ్ణంగా జరుగుతుంది. గతంలో ఆరోపణలు వచ్చిన అధికారులపైనా ప్రత్యేక విచారణ నిర్వహిస్తున్నాం.

బాణసంచా కర్మాగారాలపై నిఘా

తాడేపల్లిగూడెం రూరల్, తణుకు, జగ్గంపేటతో పాటు మరికొన్ని చోట్ల బాణసంచా కర్మాగారాలు ఉన్నాయి. ప్రతి కర్మాగారాన్ని సంబంధిత సీఐ, డీఎస్పీలు క్షుణ్ణంగా తనిఖీలు చేసి నివేదిక పంపాల్సిందిగా ఆదేశించాం. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా, అనుమతులు లేకున్నా సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిందిగా ఆదేశించాం. ప్రతి కర్మాగారంలో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పక్కగా పాటించాలి. అలాగే స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయడం, అందుబాటులో నీటినిల్వలు ఉంచుకోవడం తప్పనిసరి. ఇది కాకుండా ప్రతి నెలా రెవెన్యూ, ఫైర్ విభాగాలతో కలిసి పోలీసులు పరిశీలించి నివేదిక పంపాల్సి ఉంది.

జూద క్రీడలను అరికట్టేలా..

రేంజ్ పరిధిలో సంక్రాంతి పేరుతో ఈనెల నుంచే కోడిపందాలు, పేకాట శిబిరాలు అక్కడక్కడ మొదలయ్యాయి. ఇప్పటికే కొన్నిచోట్ల కేసులు నమోదు చేస్తున్నారు. జూద క్రీడల నిర్వహణపై ఎస్సైలు, సీఐలదే బాధ్యత. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, నరసాపురం, జంగారెడ్డిగూడెం, ఏలూరు రూరల్, ఉంగుటూరు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అమలాపురం, రాజోలు, కాకినాడ రూరల్, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని రూరల్, ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు, విసన్నపేట, గుడివాడ రూరల్, అవనిగడ్డ, రాజమండ్రి అర్బన్ జిల్లాలో కోరుకొండ, రాజానగరం ప్రాంతాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాం. ఇప్పటికే రేంజ్‌లో కోడికత్తులు పలుచోట్ల స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నాం. గతేడాది సంక్రాంతి నేపథ్యంలో దాదాపు 4,500 మందిపై బైండోవర్లు నమోదు చేయడంతో పాటు వందల మందిని అరెస్టు చేశాం. నెలాఖరు నుంచి ప్రత్యేక డ్రైవ్‌లా దీనిని నిర్వహిస్తాం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.